www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 257 | గురువారం | 8 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

కేంద్రానికి టిడిపి మంత్రుల
గుడ్ బై



పదవులకు నేడు అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి రాజీనామా

గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు : చంద్రబాబు

ఎపి కేబినెట్ నుంచి వైదొలగాలని బిజెపి నిర్ణయం

మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్ర మంత్రివర్గం నుంచి బయటకు రావాలని తెలుగుదేశం నిర్ణయించింది. అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరిలు కేంద్ర మంత్రి పదవులకు గురువారం రాజీనామా చేయనున్నట్లు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రస్తుతానికి మంత్రి పదవులకు రాజీనామా చేస్తారని, ఎన్‌డిఎ కూటమి నుంచి వైదొలగడంపై త్వరలోనే నిర్ణయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఏ ప్రయోజనం కోసమైతే కేంద్ర మంత్రివర్గంలో చేరాలని నాలుగేళ్ళ క్రితం నిర్ణయించుకున్నామో ఇప్పుడు అది నెరవేరడం తరువాయి 6లో

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఇటుక మీద ఇటుక మోసి ఇల్లు కట్టే ఇంతి
బతుకంతా కడగండ్ల పంక్తి

మూడవ రోజూ
కోటా పోరు

రిజర్వేషన్లను 62 శాతానికి పెంచాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని ఆమోదించాలంటూ లోక్‌సభలో టిఆర్‌ఎస్ ఆందోళన

ప్రత్యేక హోదాపై ఎపి, కావేరి వివాదంపై తమిళనాడు ఎంపిల నిరసన గళం

సభను వాయిదా వేసి ఫ్లోర్ లీడర్లతో స్పీకర్ భేటీ

రాష్ట్రాలవారీ కోటాకు చొరవ తీసుకుంటే మద్దతిస్తామని టిఆర్‌ఎస్ హామీ


మన తెలంగాణ/ న్యూఢిల్లీ: ముస్లింలు, ఎస్‌టిలకు విద్యాసంస్థల్లో, ఉద్యోగ కల్పనలో మరిన్ని రిజర్వేషన్లు ఇచ్చేందుకుగాను ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను 50 నుంచి 62 శాతానికి పెంచుతూ రాష్ట్ర శాసనసభ గతేడాది ఏప్రిల్‌లో చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టిఆర్‌ఎస్ ఎంపిలు మూడవ రోజూ పార్లమెంట్ బయట, లోపల ఆందోళన నిర్వహించారు. తొలిరోజైన సోమవారం లోక్‌సభను స్తంభింపజేసిన ఎంపిలు.. రెండోరోజైన మంగళవారం కూడా తమ ఆందోళనను కొనసాగించారు. మూడవ రోజు లోక్‌సభ లోపల, బయట నిరసన తెలిపారు. తమ రాష్ట్ర ప్రభుత్వం చేసిన సిఫారసును రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం టిఆర్‌ఎస్ ఎంపిల నిరసన ప్రతిధ్వనులతో లోక్‌సభ దద్దరిల్లింది. వారిని శాంతింపజేసేందుకు స్పీకర్ సుమిత్రా మహాజన్ చేసిన ప్రయత్నాలు తరువాయి 6లో



విగ్రహాగ్రహం

లెనిన్, పెరియార్ విగ్రహాల ధ్వంసంపై పార్లమెంట్‌లో నిప్పులు చెరిగిన ప్రతిపక్షాలు

- పాలక బిజెపిపై విమర్శల వెల్లువ
- తాలిబానిస్టు విధ్వంసంపై ఉపరాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రి ఖండన
- విధ్వంసకులపై కఠిన చర్యలకు మోడీ ఆదేశం
- అయినా ఆగని విగ్రహాలపై దాడి
- తాజాగా యుపిలో అంబేడ్కర్, బెంగాల్‌లో శ్యాంప్రసాద్ ముఖర్జీ విగ్రహాలపై విరుచుకుపడిన దుండగులు



న్యూఢిల్లీ: త్రిపురలో లెనిన్, తమిళనాడులో పెరియార్ విగ్రహాలను ధ్వంసం చేయడంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన తెలిపాయి. ఇవి 'సిగ్గుమాలిన పనులు' అని చెప్పడమేకాక, బిజెపి సభ్యులు అసహనులవుతున్నారని, ప్రజలను ముఖ్యంగా పేదలను అవమానిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. ఇలాంటి గూండాయిజం చర్యలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. తమిళనాడులో పెరియార్ విగ్రహాన్ని తరువాయి 6లో



గోప్యత

- **జాతీయ ఫ్రంట్ నిర్మాణంపై జర జాగ్రత్త వహించాలని టిఆర్‌ఎస్ నిర్ణయం**
- **కూర్పు, ఎజెండా భవిష్యత్తు కార్యక్రమ నిర్ణయాలు స్వయంగా సిఎం చూసుకుంటున్నారని సమాచారం**

మన తెలంగాణ / హైదరాబాద్ : దేశ రాజకీయాల్లో ప్రబలమైన మార్పుకు ఉద్దేశించిన ప్రత్యామ్నాయ ఫ్రంట్‌పై వివిధ పార్టీలతో జరిగే సంప్రదింపులను గోప్యంగానే ఉంచాలని టిఆర్‌ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. ఎవరెవరితో సంప్రదింపులు జరుగుతున్నాయి, భవిష్యత్తులో చేపట్టనున్న సమావేశాల వివరాలను వీలైనంత వరకు బహిర్గతం చేయరాదని భావిస్తున్నట్లు పేర్కొన్నాయి. మంత్రులు, ఎంపిలు, సన్నిహితులకు సైతం ఈ వివరాలు వెళ్ళకుండా సిఎం జాగ్రత్తపడుతున్నట్లు తెలిసింది. ఫ్రంట్ కూర్పు, ఎజెండా, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలేవీ కూడా మూడో తరువాయి 6లో

హోదా అనేదే లేదు

ఎపికి ఇచ్చేది ప్యాకేజీయే : కేంద్ర ఆర్థికమంత్రి జైట్లీ



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన హామీలు విషయంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ మరోసారి స్పష్టమైన ప్రకటన చేశారు. దేశంలో ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా అనేదే లేదని స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయనేది ముందుగా చూడాల్సిన ముఖ్యమైన అంశమని అన్నారు. జిఎస్‌టి రాబడి, కేంద్ర, రాష్ట్రాలకు పంపిణీ జరుగుతోందని, తగినంత రాబడి లేకపోవడం వల్లే గతంలో ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతానికి ప్రత్యేక హోదా ఏ రాష్ట్రానికీ లేదని ఆయన స్పష్టం చేశారు. ఈశాన్య రాష్ట్రాలకు ప్రస్తుతం 90:10 శాతం చొప్పున నిధుల పంపిణీ జరుగుతోందని తరువాయి 6లో

కుంచెపోటు



మీ మహిళా దినోత్సవం సెలబ్రేట్ చేద్దాం, చికెన్ బిరియాని, పెరుగు చట్నీ, పాయసం వండు!



కందిపోయిన రైతు

- **మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో మిట్టమధ్యాహ్నం మండుటెండలో మార్కెట్ యార్డు వద్ద నిల్వలతో బారులుతీరిన రైతులు**

మన తెలంగాణ/ లక్షెట్టిపేట : మంచిర్యాల జిల్లాలోని రైతులంతా కందులను లక్షెట్టిపేట పట్టణ మార్కెట్‌యార్డులోని కొనుగోలు కేంద్రానికి తీసుకురావడంతో అధికారులు, సిబ్బందితో పాటు పోలీసులు కూడా ఊపిరి పీల్చుకోకుండా అయింది. జిల్లా వ్యాప్తంగా రైతులు సుమారు ఆరు వందల వాహనాలతో కందులను తీసుకురావడంతో ఎక్కడా వాహనాలు నిలుపరాని పరిస్థితి నెలకొంది. వచ్చిన వాహనాలకు అధికారులు పోలీసుల సహకారంతో నెంబరింగ్ ఇచ్చి కొనుగోలు ప్రారంభించారు. కందుల కొనుగోలుకు తరువాయి 6లో


కర్నాటక లోకాయుక్తపై దాడి, కత్తిపోట్లు

10

- కేసు విచారణ సమయంలోనే ఘటన
- ఆసుపత్రికి తరలింపు
- ప్రాణాపాయం లేదని ప్రకటించిన రాష్ట్ర హోంమంత్రి

దవాఖానాల్లో మెరుగైన వైద్యానికి ఏం చేస్తున్నారు?

- వివరించాలని తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశం
- సిఎంలు, మంత్రులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందడం మానేశారని వ్యాఖ్య 2



కేంద్ర సిబ్బందికి
7% డిఎ



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛన్‌దారులకు శుభవార్త. కరువు సాయం (డిఎ)ను 5 నుంచి 7 శాతానికి పెంచుతూ బుధవారం నాడు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. దీంతో 1 కోటి 10 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. తాజాగా డిఎ 2018 జనవరి 1 నుంచి వర్తిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్దేశించిన ఈ అదనపు కరువు భత్యానికి ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 'మూల వేతనం (బేసిక్ పే)/ పింఛనుపై ఇప్పుడున్న 5 శాతాని కి అదనంగా 2 శాతం పెంచారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈ డిఎను పెంచారు' అని తరువాయి 6లో

రానున్న ఎన్నికల్లో 'వివిపిఎటి' విధానం అమలు



మన తెలంగాణ/హైదరాబాద్: రానున్న సాధారణ ఎన్నికలల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు వివిపిఎటి ఉప కరణాలను అనుసంధానం చేస్తామని, ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు నిర్భయంగా ఓటుహక్కు వినియో గించే వాతావరణాన్ని కల్పిస్తామని తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారిగా బాధ్యతలు స్వీకరించిన రజత్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఇవిఎంలు సురక్షితమైనవని, ఎలాంటి అపోహలు అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు కేంద్రం ఎన్నికల సంఘం వేర్వేరు అధికారులను నియమించిందని, ఇందులో భాగంగా తనను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారిగా నియమించిందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి మొదటి ఎన్నికల అధి కారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, విధి నిర్వహణలో పారదర్శకంగా వ్యవహరిస్తానని, ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తానన్నారు. ఫిర్యాదులు, సమస్య లను ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవా లని, ఎలాంటి భయాందోళనలకు తావు లేకుండా తగిన పరిస్థితులను కల్పిస్తానని స్పష్టం చేశారు. తాను కూడా ఎవరికి భయపడకుండా ఎన్నికలు నిర్వహిస్తానని చెప్పారు. ఓట్ల గల్లంతుపై పాత్రికేయులు అడగ్గా తాను ఇప్పుడే బాధ్యతలు తీసుకున్నానని, తనకు పూర్తి అవగాహన లేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

కోటాపై టిఆర్‌ఎస్ వితండవాదం

మన తెలంగాణ/హైదరాబాద్ : రిజర్వేషన్లపై నిర్ణయాధికారం రాష్ట్రాలకే ఉండాలని టిఆర్‌ఎస్ అనడం వితండవాదన అవుతోందని బిజెఎల్‌పి నాయకులు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. టిఆర్‌ఎస్ ఎంపిలు లేని సమ స్యను సృష్టిస్తూ పార్లమెంట్‌ని అడ్డుకుంటూ రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కెసిఆర్ తన ఆలోచనను దేశ ప్రజల మీద రుద్దాలంటే అవివేకం అవుతోందన్నారు.

వర్శిటీలలో 1551 పోస్టులు

- ఏప్రిల్‌లో నోటిఫికేషన్ జారీ
- కళాశాలల్లో సిసి కెమెరాలు, బయో మెట్రిక్ హాజరు విధానం అమలు
- వైస్ ఛాన్స్‌లర్ల సమావేశంలో కడియం

మనతెలంగాణ/హైదరాబాద్: వివిధ యూనివర్శిటీలలో ఖాళీగా ఉన్న 1,551 అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియను జూన్ నెలాఖరుకు పూర్తి చేయాలని రాష్ట్ర ఉపముఖ్య మంత్రి, విద్యాశాఖ కడియం శ్రీహరి వైస్ ఛాన్స్‌లర్లకు స్పష్టం చేశారు. వర్శిటీల విసిలతో గత అక్టోబర్‌లో గవ ర్నర్ నర్సింహన్ పది అంశాల ఎజెండాతో సమావేశం నిర్వహించారని, వాటి పురోగతి, అమలుపై బుధవారం 'రూసా' కార్యాలయంలో మంత్రి విసిలతో సమీక్షా సమా వేశం నిర్వహించారు. విద్యాశాఖ స్పెషల్ సిఎస్ రంజీవ్ ఆర్ ఆచార్య, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ టి.పాపిరెడ్డి, వివిధ వర్శిటీ విసిలు, ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఎ.అశోక్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ, త్వరలో వైస్ ఛాన్స్‌లర్లతో గవర్నర్ సమావేశం నిర్వహించబోతున్నారని, గత సమా వేశంలోని పది అంశాలపై ఇప్పటివరకు ఏం చేశారో చెప్పాల్సిన అవసరం ఉంటుందన్నారు. గవర్నర్ సమ క్షంలో జరిగిన సమావేశంలో అంశాలను అమలు చేయ డంలో విసిలపై తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశా రు. గతంలోనే వర్శిటీలలో పోస్టులు మంజూరయ్యారని, భర్తీలో ఎందుకు జాప్యం జరిగిందని విసిలను ప్రశ్నిం చగా, డిమాండ్ లేని పోస్టులను డిమాండ్ ఉన్న పోస్టు లుగా మార్చుకునేందుకు సమయం పట్టిందని విసిలు వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో పోస్టుల మార్పుకు సంబంధించి విసిలకు అనుమతి ఇచ్చామని, వెంటనే ఈ మార్పు మేరకు రిజర్వేషన్లు, రోస్టర్ సిద్ధం చేసుకుని ఏప్రి ల్‌లో నోటిఫికేషన్లు జారీ చేయాలని ఆదేశించారు. వర్శిటీ లలో వసతుల కల్పనకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.420 కోట్ల నిధులు సకాలంలో ఖర్చు చేయాలన్నా రు. చాలా వర్శిటీలు ఇప్పటికే టెండర్లు పిలవగా, కొన్ని వర్శిటీలు ఇంకా పనులనే గుర్తించలేదని చెప్పారు. ఈ నెల 31 వరకు అన్ని వర్శిటీలు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

రాష్ట్రంలో 31 కొత్త జిల్లాలకు అనుగుణంగా ఆరు విశ్వవిద్యాలయాల పరిధిలో మార్పులపై విసిలు సూచన చేశారని, త్వరలో మార్గదర్శకాలు రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. అలా గే వర్శిటీలలో విద్యా ర్థులు, అధ్యాపకులు, సిబ్బంది హాజ రు పెంచేందుకు సిసి కెమెరాలు, బయోమెట్రిక్ హాజ రు విధానాన్ని కచ్చి తంగా అమలు చేయాలన్నారు. వర్శిటీల అనుబంధ కళా శాలల్లో ఈ విధానం అమలు చేస్తేనే అఫిలియేషన్లు



ఇవ్వాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలకు భూము లు అన్యాక్రాంతం కాకుం డా డాక్యుమెంట్లను సిద్దంగా ఉంచుకోవడంతోపాటు ప్రహరీ గోడ లు నిర్మించాలని విసిలకు సూచించారు. హరితహారం చేపట్టి, సోషల్ ఫారె స్ట్రీని ప్రోత్సహించాలన్నారు. కొన్ని యూనివర్శిటీలలో పిహెచ్‌డి ప్రవేశాలు సక్రమంగా జరగలేదనే ఆరోపణలు వచ్చాయని, పారదర్శకంగా జరిగేలా చర్య లు తీసుకోవా లని, నోటిఫికేషన్ తేదీ నుంచి పిహెచ్‌డి అవార్డు వరకు కాలపరిమితి ఐదేళ్లు మించి ఉండకూడదని విసిలు సూచించారని,దానిని అమలు చేస్తామన్నారు. మారు తున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా వర్శిటీలలో ఇన్‌క్యుబేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇంటర్నెట్, వైఫై, లైబ్రరీ డిజిటలైజేషన్ చేయాలని తెలి పారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాలు దేశంలోని పేరెన్నిక గన్న వర్శిటీలతో పోటీ పడేలా నాణ్యతా ప్రమాణాలు పెంచాలని వైస్ ఛాన్స్‌లర్లకు సూచించారు.

1:20 నిబంధన ఉపసంహరణ!



మనతెలంగాణ/హైదరాబాద్ : సాంకేతిక విద్యాసంస్థల్లో అధ్యాప కులు, విద్యార్థులు నిష్పత్తి 1:20 గా ఉండాలంటూ ఎఐసిటిఇ ప్రవే శపెట్టిన కొత్త నిబంధన ఉద్యోగు లకు శాపంగా మా రిందని, దానిని వెంటనే ఉపసంహరించు కోవాలని తెలంగాణ టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేష న్(టిటిఇఎ)అధ్యక్షులు వి.బాలకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ నిబంధన వల్ల దేశవ్యాప్తంగా సుమారు 1.78 లక్షల మంది, రాష్ట్రంలో సుమారు 15 వేల మంది ఉద్యోగాలు కోల్పోతారని తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఐసి టిఇ ప్రవేశపెట్టిన కొత్త నిబంధన ఉపసంహరించాలని కోరు తూ సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్దంగా అధ్యాపకుల ఒరిజినల్ సర్టిఫికె ట్లను తమ వద్ద పెట్టుకుంటున్నాయని అన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో అధ్యాపకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధ్యాపకులకు గ్రూప్, హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని నిబంధనల్లో ఉన్నప్ప టికీ అమలు చేయడం లేదన్నారు. టిటిఇఎ ప్రధాన కార్యదర్శి ఎ.సంతో ష్‌కుమార్, ఉపాధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ట్రస్ట్'పై సమగ్ర విచారణ!

- ఖమ్మం డిసిసిబి వ్యవహారంపై సహకార శాఖ రిజిస్ట్రార్ ఆదేశం
- ఎందుకు చర్యలు తీసుకోకూడదు: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మన తెలంగాణ/హైదరాబాద్: రైతులకు రుణా లు, బ్యాంకు లావాదేవీల ద్వారా సేవలందించా ల్సిన ఖమ్మం డిసిసిబి (జిల్లా కేంద్ర సహకార బ్యాంకు) ఒక ట్రస్టును ఏర్పాటు చేసి ఆసుపత్రిని నిర్మించడంపై రాష్ట్ర సహకార శాఖ సమగ్ర విచా రణకు ఆదేశించింది. అదనపు రిజిస్ట్రార్ సుమిత్ర ను విచారణ అధికారిగా నియమించింది. బ్యాం కింగేతర కార్యాకలపాలు నిర్వహిస్తున్నందుకు ఎందుకు చర్య తీసుకోకుడదంటూ రిజర్వ్ బ్యాం కు కూడా ఇటీవల ఒక లేఖను ఖమ్మం డిసిసిబికి పంపినట్లు తెలిసింది. రిజర్వు బ్యాంకు నిబంధన లకు విరుద్ధంగా ఖమ్మం డిసిసిబి రైతు సంక్షేమ నిధి పేరుతో రైతులకిచ్చే పంట రుణాల నుంచి వసూళ్లకు పాల్పడిందని గతంలో జరిపిన ప్రాథ మిక విచారణలో వెల్లడైంది. సుమారు రూ.8.11 కోట్లు వసూలు చేసి ఆసుపత్రి నిర్మించింది. మరో 40 లక్షలతో ప్రత్యేకంగా ఒక భవనాన్ని నిర్మిం చింది. ఇటీవలే ఈ ఆసుపత్రికి ప్రారంభోత్సవం కూడా జరిగింది.

వీటన్నింటిపై ఇప్పటికే ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన విషయాలు, టెస్కాబ్ ఎండి ఇచ్చిన నివేదికలపై పూర్తిస్థాయిలో చట్టబద్ధంగా విచారణ చేయనున్నట్లు సహకార శాఖ వర్గాలు వెల్లడించాయి. వసూలు చేసిన సొమ్మును రైతుల కోసం ఖర్చు పెడుతున్నట్లు పాలకవర్గం ఇచ్చిన వివరణ ఆర్‌బిఐనిబంధనలకు విరుద్ధమని టెస్కాబ్ ఇప్పటికే స్పష్టంచేసింది. ఇంత జరిగిన ప్పటికీ ఇటీవల పదవీకాలం ముగిసిన పాలకవ ర్గానికే పర్సన్ ఇంఛార్జీలుగాబాధ్యతలు అప్పగిం చడం గమనార్హం.

రికార్డుల్లో నమోదు చేయలేదు!

పంట రుణాలు తీసుకున్న ప్రతీ రైతు నుంచి 500 రూపాయల చొప్పున చందాలు వసూ లు చేశారు. అంతేకాకుండా పంట రుణపరి మితిని పెంచి మళ్ళీ నిధులు సేకరించారు. ఇక్కడితో ఆగకుండా వ్యవసాయేతర కోటా లో అంబులెన్స్ రుణం కోసం ప్రతిపాదిం చారు. రుణమివ్వాలంటే మొత్తం సొమ్ములో 20 శాతాన్ని 'డౌన్ పేమెంట్'గా ఇవ్వాలి. ఇందులో 10 శాతం రుణగ్రహీత భరించాలి. కానీ ఈ నిబంధనను కూడా పక్కన పెట్టారు. ఇలా సేకరించిన నిధుల వివరాలను రికా ర్డుల్లో నమోదు చేయకపోవడం గమనార్హం.

ఏప్రిల్ 29న భారీ బహిరంగసభ

- యాదవ,కురుమలతో నిర్వహిస్తాం : మంత్రి తలసాని



మన తెలంగాణ/హైదరాబాద్ : సికింద్రాబాద్ లోని జింఖానా మైదానంలో ఏప్రిల్ 29న యాద వ, కురుమలతో భారీ బహిరంగసభ నిర్వహించ నున్నట్లు పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి తల సాని శ్రీనివాసయాదవ్ తెలిపారు. బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో యాదవ, కురుమ సంఘాల నాయకులతో ఆయ న సమా వేశమయ్యారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఈ సభకు ప్రతి గ్రామం నుండి గొల్ల, కురుమలు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తు న్నామని, దాదాపు 10 లక్షల మంది హాజరవుతా రని తెలిపారు. ఇందుకోసం పాత జిల్లాల ప్రాతిప దికన నాయకులతో సమన్వయ కమిటీలను ఏర్పాటుచేశామని చెప్పారు. ఈ కమిటీల నాయ కులు ఈనెల 11 నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి సమావేశాలు నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశాల్లో బహిరంగసభ ఉద్దేశ్యాన్ని వివరించి భారీ సంఖ్యలో సభకు తరలివచ్చేలా చూస్తారని తెలిపారు. వాల్‌పోస్టర్లు, వాల్‌పెయింటింగ్స్ ద్వా రా సభ గూర్చి విస్తృత ప్రచారం నిర్వహిస్తామ న్నారు. కురమసంఘం రాష్ట్ర అధ్యక్ష్యుడు ఎగ్గె మల్లేషంకు సిఎం కెసిఆర్ ఎమ్మెల్సీ పదవిని ఇవ్వ నున్నట్లు ప్రకటించారని చెప్పారు. అలాగే యాద వ కులస్తుడిని రాజ్యసభకు పంపుతామని కూడా చెప్పారన్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ సభకు సిఎం కెసిఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయా దవ్, గొర్రెల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ రాజయ్య యాదవ్, యాదవ మహిళా సంఘం అధ్యక్ష్యు రాలు రాగం సుజాత, కురుమ, యాదవ సంఘా ల నాయకులు చింతల రవీందర్ యాదవ్, బాబు రావు కురుమ, ఎడ్ల హరిబాబు పాల్గొన్నారు.

అసెంబ్లీ పరిధిలో ఆంక్షలు

- బడ్జెట్ సమావేశాల దృష్ట్యా విధింపు
- 12 నుంచి ప్రారంభం

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమవుతున్న దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా అసెంబ్లీకి 4 కి.మీ దూరం వరకు ఆంక్షలు విధిస్తూ నగర పోలీసు కమిషనర్ వి.వి.శ్రీని వాస్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆంక్షలు ఈ నెల 12వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి 18వ తేదీ ఉదయం ఆరు గంటల వరకు కొనసాగుతాయని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆంక్షలు విధించిన ప్రాంతంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించడం నిషేధమని పేర్కొన్నారు. ఆంక్షలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చిరంచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశల సందర్భంగా కేవలం ఒక కి.మీ దూరం వరకు మాత్రమే ఆంక్షలు విధించే నిబంధన ఉండగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ పరిధిని 4 కి.మీ దూరం వరకు పెంచడం గమనార్హం.

దవాఖానాల్లో మెరుగైన వైద్యానికి ఏం చేస్తున్నారు?

- తెలుగు రాష్ట్రాల వివరణను కోరిన హైకోర్టు

మన తెలంగాణ/ హైదరాబాద్: ఇటీవల కాలం వరకూ మంత్రులేకాదు సీఎం కూడా ప్రభుత్వాసుపత్రిల్లోనే వైద్యచికిత్సలు చేయించుకునే వారని, వాటిని నిర్లక్ష్యం చేయడంతో ప్రైవేటు హాస్పటల్స్‌కు వెళ్లాల్సివస్తోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగుల్ని పీడించకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సీనియర్ జర్నలిస్టు కె.నరేందర్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు న్యాయమూర్తులు రామసుబ్రమణియన్, అమర్‌నాథ్‌గౌడ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించిన సందర్భంగా ఈ వ్యాఖ్యాలు చేసింది. ప్రభు త్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందజేసేందుకు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే చర్యల్ని వివరించాలని బెంచ్ బుధవారం నోటీ సులు జారీ చేసింది. హైదరాబాద్ సరిహద్దు జిల్లాలోని బీబీనగర్‌లో రూ.125 కోట్లతో నిమ్స్ భవనాలు కొత్తగా కట్టి వాటిని పూర్తి చేయలేదని పిటిషనర్ లాయర్ అర్జున్‌కుమార్ వాదన సమయంలో చెప్పారు. ఏడేళ్ల క్రితమే నిర్మాణాలు జరిగిపోయాయని, నేటికీ ఎందుకు అక్కడ ఆస్పత్రి వైద్య సేవలు ప్రారంభించడం లేదో తెలియదని, ఈ విషయాన్ని కాగ్ కూడా తప్పుపట్టిందని చెప్పారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం వివరణ ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశించింది. ఆరోగ్యశ్రీ బిల్లుల్ని ప్రైవేటు ఆస్ప త్రులు దోపిడీ చేసుకున్నాయని విజిలెన్స్ నివేదికలు చెబుతున్నాయని చెప్పారు. విచారణ 21కి వాయిదా పడింది.

సామాజిక కట్టుబాట్ల వల్లే వివక్ష

మన తెలంగాణ/ హైదరాబాద్ : పురుషులతో సమానంగా రాణిస్తున్నా, అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నా సామాజికంగా అనేక రకాలుగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాలంచెల్లిన కట్టుబాట్లతో బాలికలు ఇప్పటికీ భయపడుతూనే ఉన్నారని 'టీమ్ నిర్బంధం' సంస్థ వ్యాఖ్యానించింది. ప్రకృతిపరంగా సంభవించే బహిష్టు పట్ల బాలికలకు శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు 'టీమ్ నిర్బంధం' ముందుకు వచ్చింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమం లో టీమ్ నిర్బంధం తరపున సామాజిక ఉద్యమ కారిణి, గేయ రచయిత గౌరీ వందన ప్రసంగించారు.

విగ్రహాల ధ్వంసం బిజెపి కుట్రే


- ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి
- డిమాండ్ చేస్తున్న వామపక్షాలు



మన తెలంగాణ/హైదరాబాద్ : త్రిపురలో లెనిన్ విగ్రహం ధ్వంసం బిజెపి అగ్ర నాయకుల పథకం ప్రకారమే జరిగిన కుట్రపూరితమైన చర్య అని, ఈ ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. త్రిపుర ఘటన ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి అని, రాజ్యాంగం కల్పించిన పౌరుల హక్కులను ఉల్లఘించడమేనని పేర్కొన్నాయి. దేశంలో బిజెపి, సంఘ్ పరివార్ శక్తుల ఫాసిస్టు, పాశవిక చర్యలను వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు సంఘటితంగా తిప్పికొట్టాలని ఈ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ వామపక్షాల కార్యకర్తలు బుధవారం బషీర్‌బాగ్ కూడలిలో ప్రదర్శన నిర్వ హించి బిజెపి ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. వామపక్షాల నాయకులు చాడ వెంకటరెడ్డి, ఇ.టి.నరసింహా (సిపిఐ), తమ్మినేని వీరభద్రం, డి.జి.నరసిం హారావు (సిపిఐ(ఎం), సాధినేని వెంకటేశ్వరరావు, కె.గోవర్ధన్ (సిపిఐ(ఎం ఎల్) న్యూడెమాక్రసీ), జె.జానకిరాములు (ఆర్‌ఎస్‌పి), సిహెచ్.మురహరి (ఎ స్‌యుసిఐసి), తాండ్ర కుమార్ (ఎంసిపిఐ) ఈ నిరసనలో పాల్గొన్నారు. విగ్ర హాల ధ్వంసం వెనుక బిజెపి నాయకుల హస్తమున్నందునే ప్రధాని మోడీ మౌనం వహిస్తున్నారని చాడ వెంకటరెడ్డి, తమ్మినేని వీరభద్రం విమర్శించారు. త్రిపుర ఘటనను సమర్థించడం ద్వారా సుబ్రమణ్యస్వామి వామపక్షాలపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. లెనిన్, పెరియార్ రామ స్వామి లాంటి మహనీయుల విగ్రహాలు ధ్వంసం చేయడం ద్వారా భయపెడ తామని భావించడం బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ గుండాల మూర్ఖత్వమేనన్నారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విగ్రహాలను ధ్వంసం చేయడమంటే దేశంలో ప్రజా స్వామ్యాన్ని, విలువలను ధ్వంసం చేయడమేనన్నారు. త్రిపుర ఘటనకు కార ణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘ పరి వార్ శక్తులు సంఘ విద్రోహ శక్తులుగా పాశవిక చర్యలకు పాల్పడుతున్నారని, వారి చర్యలకు అడ్డుకట్ట వేయకపోతే దేశం మరిన్ని ప్రమాదాలు ఎదుర్కో వాల్సి వస్తుందన్నారు. తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ దేశంలో లౌకిక శక్తు లను ఛిద్రం చేసేందుకు మోడీ సర్కార్ ప్రయత్నిస్తుందన్నారు. మతోన్మాద ఫాసిస్టులు ధ్వంసం చేసింది లెనిన్ విగ్రహాన్ని కాదని, ప్రపంచ కమ్యూనిస్టుల ఆత్మగౌరవాన్ని అని అన్నారు. దేశంలో సెక్యులర్ వ్యవస్థను ధ్వంసం చేయాల నుకుంటే మరో తిరుగుబాటు తప్పదన్నారు.

బిజెపివి ఫాసిస్టు చర్యలు

మన తెలంగాణ/హైదరాబాద్ : బిజెపి ఫాసిస్టు చర్యలతో దేశంలో ప్రజలు శాంతియుతంగా జీవించే పరిస్థితి లేకుండా పోతోందని సిపిఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.మఖ్దూంభవన్‌లో బుధవారం జరిగిన సిపిఐ హైదరాబాద్ నగర సమితి సమావేశాన్ని ఉద్దేశించి చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. సమా వేశానికి పి.గెల్వయ్య అధ్యక్షత వహించగా సిపిఐ హైదరాబాద్ నగర కార్యదర్శి ఇ.టి.నరసింహ, కార్యవర్గ సభ్యు లు బి.వెంకటేశ్, ఎం.నర్సింహ్మ, ఎం.డి.సలీంఖాన్, టి.రాకేష్‌సింగ్ పాల్గొన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ త్రిపురలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు కలిసి లెనిన్ విగ్రహాన్ని కూల్చివే యడం, అక్కడి ప్రజలపై దాడులు చేసి విధ్వంసం సృష్టించడం గర్హనీయమని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మూడేళ్ల యినా అమలు చేయని సిఎం కెసిఆర్‌కు వచ్చే



ఎన్నికల్లో ప్రజల నుంచి తగిన గుణపాఠం తప్ప దన్నారు. ఇ.టి.నరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు సక్రమంగా అమలు కాకపోవడంతో టిఆర్‌ఎస్ పాలన పట్ల ప్రజలు విసుగెత్తిపోయారన్నారు.



బిసిల సంక్షేమానికి మోడీ చేసిందేమిటీ?

మన తెలంగాణ /హైదరాబాద్ : ప్రధాని మోడీ ఒబిసి వర్గానికి చెందినప్పటికీ బిసి సంక్షేమం కోసం చేసిన ఒక్క పనైనా చెప్పగలరా ? అని బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న ప్రశ్నించారు. టిఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రూ.24 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్ లో బిసి సంక్షేమానికి కేటాయించింది కేవలం రూ.వెయ్యి కోట్ల లోపేనన్నారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో బిసి సంక్షేమానికి రూ. 5 వేల కోట్లు నిధులు కేటాయించామన్నారు. కెసిఆర్ కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే ఒబిసి మంత్రిత్వ శాఖ ప్రతిపాదన తెరపైకి తెచ్చారని గుర్తు చేశారు. దేశానిన 71 సంవత్సరాలు ఏలిన కాంగ్రెస్ ,బిజెపిలు బిసి సంక్షేమం విషయంలో అడుగు వేయలేక పోయిందన్నారు. దేశం దశ మార్చేందుకే కెసిఆర్ మూడో రాజకీయ ఫ్రంట్ ఆలోచన తెర పైకి తెచ్చారన్నారు.చట్ట సభల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి పంపినా మోడీ దానిపై స్పందించడం లేదని ,కేంద్రం లో ఒబిసి కమీషన్ కు చట్టబద్దత తేవడం లో మోడీ ప్రభుత్వం విఫలమయ్యిందని విమర్శించారు. రిజర్వేషన్ల పెంపు విషయంలో కూడా కేంద్రం నిర్ణయం తీసుకోకుండా తెలంగాణ కు అన్యాయం చేస్తున్నారని చెప్పారు.ఫ్లీనరీ వేదికగా జాతీయ నాయకుల సమక్షం లో కొత్త ఫ్రంట్ పై ప్రకటన వస్తుందనే వార్త తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమని చెప్పారు.

పౌరసరఫరాలలో సంస్కరణలు భేష్



మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో చేపట్టిన సంస్కరణలపై చత్తీస్‌ఘడ్ అధికారుల బృందం ప్రశంసలు కురిపించింది. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కొనుగోళ్ళను, చెల్లింపులను ఆన్‌లైన్ ద్వారానే నిర్వహిస్తూ అక్రమాలకు, దళారీల జోక్యానికి అవకాశం లేకుండా నిర్వహించడం ప్రజా ధనాన్ని సద్వినియోగం చేయడానికి దారితీస్తుందని వ్యాఖ్యానించింది. తెలంగాణ అమలుచేస్తున్న విధానాలను చత్తీస్‌ఘడ్‌లోనూ అమలు చేయడానికి ఆ రాష్ట్రానికి చెందిన ఉన్నతాధికారుల బృందం రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించి అధ్యయనం చేసింది. చత్తీస్‌ఘడ్ పౌరసరఫరాల శాఖ ప్రత్యేక కార్యదర్శి మనోజ్‌కుమార్ సోనీ, అదనపు డైరెక్టర్ రాజీవ్ జైస్వాల్, ఎన్ఐసి టెక్నికల్ డైరెక్టర్ సోమ్‌శేఖర్, సిఎం గుడ్ గవర్నెన్స్ అధికారి ఆశుతోష్ మిశ్రాలతో కూడిన అధికారుల బృందం పౌరసరఫరాల భవన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్, గోదాముల్లో సిసి కెమెరాలు, రేషన్ వాహనాలకు జిపిఎస్, 'టి రేషన్' యాప్, 'వాట్సప్' కంట్రోల్ రూమ్ తదితరాలను పరిశీలించారు. సిఆర్ఓ కార్యాలయంలోని మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్, గోదాముల్లో సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం పౌరసరఫరాల శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్‌తో సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రం వందశాతం ఆధార్ సీడింగ్‌ను పూర్తిచేయడం,ఇ-పాస్ విధానాన్ని అమలుచేయడం, 'ఇ పాస్' ఉపకరణాల్లో సదుపాయాలు చాలా బాగున్నాయని అన్నారు. తమ రాష్ట్రంలోనూ ఇదే తరహా 'ఇ-పాస్' ఉపకరణాలను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని చత్తీస్‌ఘడ్ అధికారుల బృందం తెలిపింది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు, చెల్లింపుల వరకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఆన్‌లైన్ ద్వారా ధాన్యసేకరణ అద్భుతంగా ఉందని కొనియాడారు. ఈ సందర్భంగా కమిషనర్ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రతిష్టాత్మక ఇ-పాస్ ప్రాజెక్ట్ ను పూర్తి చేయగలిగామన్నారు. తమ విధానాలను అధ్యయనం చేయడానికి 12 రాష్ట్రాల అధికారులు రాష్ట్రంలో పర్యటించారని తెలిపారు.

రోడ్లకు నిధులు మంజూరు

మన తెలంగాణ/హైదరాబాద్: 'తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి' పథకంలో భాగంగా రాష్ట్రానికి కేంద్రం నుండి తన వాటాగా (40%) ఇటీవలే రూ. 547 కోట్లను మంజూరు చేయగా రాష్ట్ర ప్రభుత్వం 60 శాతం వాటాను జోడించి పనులు ప్రారంభించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, తెలంగాణను కలుపుతూ ఈ పథకం కింద జాతీయ రహదారుల విస్తరణ ప్రాజెక్టులో మన రాష్ట్రంలో 452 కి.మీ నిర్మాణానికి అవుతున్న రూ. 1590 కోట్ల మొత్తం వ్యయంలో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన నిధుల్లోంచి తొలి విడతగా ఇటీవల రూ. 547 కోట్లను ఇటీవల మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ. 774 కోట్లను కేటాయించాల్సి ఉందని, ఇవి విడుదలకాగానే పనులు ప్రారంభమవుతాయని రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో నాలుగు రోడ్లు, రెండు వంతెనలకు రూ. 97.93 కోట్లు, మంచిర్యాల జిల్లాలో మూడు రోడ్లు, రెండు వంతెనలకు రూ.103.13 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 7 రోడ్లు, 14 వంతెనల నిర్మాణం కోసం రూ. 165.72 కోట్లు, మహబూబాబాద్ జిల్లాలో ఒక రోడ్డుకు రూ. 37 కోట్ల చొప్పున ఖర్చు కానున్నట్లు జాతీయ రహదారుల అథారిటీ అంచనావేసింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రతిపాదనలను రూపొందించింది.

ఈ సారి భారీ కేటాయింపులకు కసరత్తు! : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు త్వరలోనే ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర రోడ్లతో పాటు జాతీయ రహదారుల ప్రాజెక్టుల నిర్మాణానికి భారీ కేటాయింపులు చేసే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో రోడ్ల నిర్మాణానికి రూ. 5,033 కోట్లను కేటాయించిన ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా ఇందుకు అనుగుణంగానే భారీ నిధులు కేటాయించనుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎస్‌సి, ఎస్‌టిలతో సమానంగా మైనారిటీలకు పథకాలు

- మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎకె ఖాన్



మన తెలంగాణ/హైదరాబాద్: ఎస్‌సి, ఎస్‌టిలతో సమానంగా మైనారి టీలకు సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎకె ఖాన్ తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రభుత్వం తరఫున చేకూరుతున్న ప్రయోజనాలు, పథకాలను అధ్యయనం చేశామని, వారికి అమలవుతున్న 19 పథకాలు మైనారిటీ సంక్షేమ శాఖలో లేవని, వాటిని కూడా అమలు చేసేందుకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖలకు లేఖలు రాసినట్లు తెలిపారు. ఉర్దూ అకాడమీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉర్దూను ద్వితీయ అధికార భాషగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో భాషాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల బోర్డులపై ఉర్దూలో పేర్లు రాసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే 66 ఉర్దూ అధికారుల నియామకాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పక్షం రోజుల్లోనే నోటిఫికేషన్ వెలువడుతుందని, మూడు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మొత్తం 66 పోస్టుల్లో 6 పోస్టులు గ్రేడ్-1, 60 పోస్టులు గ్రేడ్-2 ఉన్నాయని తెలిపారు. ఒక సబ్జెక్టు ఉర్దూ తో డిగ్రీ విద్యార్థుల కలిగి ఉన్న వారితో ఈ పోస్టు లు భర్తీ చేస్తామన్నారు. పదోతరగతి వరకు ఒక సబ్జెక్టు తెలుగు చదివి ఉండి ఉండాలని తెలిపారు. వీరిని ముఖ్యమంత్రి కార్యాలయం, సచివాలయం, అసెంబ్లీ, కలెక్టర్లు, మంత్రుల వద్ద నియమిస్తున్నట్లు వెల్లడించారు. ఉర్దూ మీడియం పాఠశాలలను ఆంగ్ల మాధ్యమంలోకి మార్చడం లేదని, ఉర్దూ మీడియం పాఠశాలలు అలాగే కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో 2వేల పాఠశాలలు, కళాశాలలు ఉర్దూ మాధ్యమంలో కొనసాగుతున్నాయన్నారు. వీటిలో మౌలిక సదుపాయాలు కల్పించి మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభు త్వం మైనారిటీలకు కేటాయించిన బడ్జెట్‌లో 70 శాతం విడుదలయిందని, మిగతా 30 శాతం విడుదల కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. కోకాపేటలో ఇస్లామిక్ సెంటర్ ఏర్పాటుకు 10 ఎకరాలను గుర్తించామని ప్రభుత్వం అమోదం రాగానే దాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఉర్దూ అకాడమి ఆధ్వర్యంలో డిక్షనరీని తేనున్నట్లు తెలిపారు. 100 మంది మైనారిటీ యువతను ఎంపిక చేసి సివిల్స్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

'ఫుడ్ ప్రాసెసింగ్'తో రైతుకు భరోసా

- 31 నియోజకవర్గాల్లో కారం పొడి తయారీ యూనిట్లు?

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుపై లోతుగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రాసెసింగ్ యూనిట్లలో రైతులకు భాగస్వామ్యం కల్పించాలని యోచిస్తోంది. అందులో భాగంగానే పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారి అభిప్రాయాలను తీసుకోవడంతో పాటు రైతులకు ఉపయోగకరంగా ఉండేలా ముసాయిదాను సిద్ధం చేయనుంది. రాష్ట్రంలో మిర్చి పంట ఎక్కువగా పండిస్తున్న 31 నియోజకవర్గాల్లో కారంపొడి తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఉద్యాన శాఖ ప్రతిపాదించింది. ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘానికి ఈ మేరకు ప్రతిపాదనలను పంపింది. ఆయా జిల్లాలలో సాగవుతున్న ఉద్యాన పంటల ఆధారంగా108 నియోజకవర్గాల్లో 14 రకాల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని సూచించింది. ఇందులో 26 యూనిట్లు పట్టణ నియోజకవర్గాల్లో, 68 యూనిట్లు గ్రామీణ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయాలని ఉద్యానశాఖ పేర్కొంది. వీటిలో పసుపు పొడి తయారీ, పసుపు పార్క్, రెండు ఆహార ఉత్పత్తుల పార్కులు ఉన్నాయి. మిర్చి సాగు ఆధారంగా మొత్తం 12 జిల్లాలలో మిర్చి ప్రాసెసింగ్ యూనిట్లు, టమాట ఉత్పత్తుల కోసం 12 జిల్లాల్లోని 22 నియోజకవర్గాల్లో టమా టా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని సూచించింది. వీటిద్వారా కారం పొడి, టమాట పచ్చడి, టమాటో కెచ్చప్, సాస్, రసం, జామ్ వంటివి తయారు చేయనున్నారు. మామిడి కాయలను మగ్గపెట్టేందుకు 11 నియోజకవర్గాల్లో రైపెనింగ్ ఛాంబర్స్‌ను, మామిడి ఆమ్‌చూర్ తయారీకి 3 యూనిట్లను ప్రతిపాదించింది. అల్లం పేస్ట్ తయారీకి ఒక యూనిట్, ఉల్లి తురుముకు (ఆనియన్ ఫ్లేక్స్) 4 ప్రాసెసింగ్ యూనిట్లు, పసుపు శీతల నిల్వగదులు కావాలని కోరింది.ఈ ప్రతిపాదనలపై మంగళవారం జరగనున్న మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో చర్చించనున్నారు.



బుల్లెట్ ప్రూఫ్ క్యాంపు కార్యాలయం

- సిఎం భద్రత దృష్ట్యా గజ్వేల్‌లో ఏర్పాటు



మన తెలంగాణ/హైదరాబాద్ : సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్‌కు అక్కడ బుల్లెట్‌ప్రూఫ్ క్యాంపు కార్యాలయం సిద్ధమవుతోంది. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలకు కోటి రూపాయల ఖర్చుతో నివాసం, కార్యాలయాన్ని నిర్మిస్తోన్న ప్రభుత్వం సిఎం కెసిఆర్‌కు మాత్రం భద్రతా కారణాలరీత్యా బుల్లెట్‌ప్రూఫ్ క్యాంపు కార్యాలయాన్ని నిర్మిస్తోంది. తలుపులు, కిటికీలకు బుల్లెట్‌ప్రూఫ్ అద్దాలను వినియోగించనున్నట్లు నిర్మాణ బాధ్యతలు చూస్తున్న రోడ్డు భవనాల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇంటిచుట్టూ ప్రత్యేక బారికేడ్లతో పాటు ప్రహరీగోడ ఎత్తును కూడా పెంచుతున్నారు. ఇలాంటి అదనపు ఏర్పాట్లన్నింటినీ రెండు కోట్ల రూపాయలకంటే ఎక్కువే ఖర్చు కానుందని, ప్రత్యేక అవసరాల రీత్యా వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. భద్రతా అవసరాల కోసం సిసి కెమెరాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగిస్తున్నామని తెలిపారు. కేవలం బుల్లెట్‌ప్రూఫ్‌అద్దాలకే రూ. 50 లక్షలు ఖర్చవుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్, ఢిల్లీలోని క్యాంపు కార్యాలయాలను కూడా బుల్లెట్‌ప్రూఫ్‌గానే తీర్చిదిద్దారు. ఇక జిల్లాల పర్యటన సందర్భంగా వినియోగించే బస్సుగానీ, కాన్వాయ్‌లోని ఆయన కారు కూడా బుల్లెట్‌ప్రూఫ్‌తోనే తయారయ్యాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న బుల్లెట్‌ప్రూఫ్ బస్సుకు అదనంగా కొత్తదాన్ని తయారుచేయాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఇందుకోసం ఏడు కోట్ల రూపాయలు ఖర్చుకానుంది. చండీఘడ్‌లో తయారుచేయించి మూడు నెలల్లోగా వినియోగంలోకి వచ్చేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా గజ్వేల్‌లోని క్యాంపు కార్యాలయం కూడా బుల్లెట్‌ప్రూఫ్‌గానే రూపుదిద్దుకుంటోంది. ప్రతి ఎమ్మెల్యేకు నియోజకవర్గకేంద్రంలో నివాసంతో పాటు క్యాంపు కార్యాలయ అవసరాల నిమిత్తం రెండంతస్తుల భవనాన్ని కోటి రూపాయల ఖర్చుతో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఆ బాధ్యతను రోడ్లు భవనాల శాఖకు అప్పగించింది. అన్ని ఇళ్ళకూ ఒకే డిజైన్‌ను, ప్లానింగ్‌ను ఖరారు చేసినా అంతర్గత అలంకరణ మాత్రం ఎమ్మెల్యేల ఇష్టాయిష్టాల ప్రకారం ఉంటుంది. ఇప్పటికే 16 భవనాల నిర్మాణం పూర్తికాగా, మరో 31 ఇండ్ల నిర్మాణం ఈ నెలాఖరుకు పూర్తి కానున్నట్లు ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో 15 మంది ఎమ్మెల్యేలకు విడిగా నిర్మించడానికి బదులుగా ఎమ్మెల్యే క్వార్టర్స్ భవన సముదాయంలోనే సమకూర్చనున్నందున మిగిలిన ఇండ్లను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. సిఎంకు గజ్వేల్‌లో నిర్మిస్తున్న క్యాంపు కార్యాలయానికి మొత్తం రూ. 3.50 కోట్లు ఖర్చు కానుంది.

హైదరాబాదీ మహిళకు దుబాయ్ షేక్ చిత్రహింసలు

మన తెలంగాణ/హైదరాబాద్ : కుటుంబ పెద్దయిన భర్త రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో...భార్య కుటుంబ భారాన్ని భుజాన వేసుకుంది. ఓ ఏజెంట్ మాయమాటలు నమ్మిన ఆమె దేశం ఎల్లలు దాటి దుబాయ్‌లో ఓ అరబ్ షేక్ ఇంట్లో పనిమనిషిగా చేరింది. రెండు నెలలకే ఆమెను మస్కట్‌లోని ఓ స్టార్ హోటల్‌కు సదరు అరబ్ షేఖ్ విక్రయించాడు. ఆ హోటల్‌లో డ్యాన్స్ చేయమని చిత్రహింసలకు గురి చేస్తున్నారు. ఈ విషయాన్ని హోటల్‌కు వచ్చిన ఓ కస్టమర్ ఫోన్ సహాయంతో హైదరాబాద్‌లో ఉన్న తన ముగ్గురు కూతుర్లకు చెప్పుకుని రోధించడంతో విషయం బయట పడింది. దీంతో తమ తల్లిని అరబ్ షేక్‌ల చెర నుంచి రక్షించి క్షేమంగా స్వదేశానికి తిరిగి వచ్చేటట్లు చేయాలంటూ కేంద్ర విదేశీ వ్యవహారల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌కు బాధితురాలి కూతుర్లు బుధవారం మొరపెట్టుకున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్న తరుణంలో హైదరాబాద్ మహిళకు ఇలాంటి ఘోరం జరగడం విడ్డూరంగా ఉంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జీడిమెట్ల సూరారంలోని రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్న పేయింటర్ చింతపల్లి క్రిష్ణ (40) గత ఏడాది జూలైలో విధులు ముగించుకుని ఇంటికి వస్తుడగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ప్రస్తుతం అతను పనిచేసే స్థితిలో లేకుండా జీవచ్ఛవంలా ఇంట్లో ఉన్నాడు. తన ముగ్గురు కూతుర్లను పోషించే భారాన్ని భార్య నగామణి (35) తన భుజాలపై వేసుకుంది. ఏదైన ఉద్యోగం ఇప్పించమని పరిచయస్తుడైన శ్రీనివాస్ అనే ఏజెంట్‌ను ఆమె ఆశ్రయించింది. దుబాయ్‌లో అరబ్ షేక్ ఇంట్లో పనిమనిషిగ పనిచేస్తే నెలకు రూ.15 వేల జీతం వస్తుందని ఆమెను నమ్మించాడు. దీంతో ఆమె గత అక్టోబర్‌లో దుబాయ్‌కు వెళ్లింది. రెండు నెలలు అక్కడ పనిచేసిన ఆమెను గుట్టు చప్పుడు కాకుండా మస్కట్‌లోని ఓ స్టార్ హోటల్ నిర్వాహకులను ఆమెను అరబ్ షేక్ విక్రయించాడు. హోటల్ నిర్వాహకులు ఆమెను గదిలో నిర్బంధించారు. హోటల్‌లో డ్యాన్స్ చేయాలని కోరడంతో ఆమె తిరస్కరించింది. తనను స్వదేశానికి పంపించాలని వేడుకుంది. ఎలాగైనా డ్యాన్స్ చేయాల్సిందేనంటూ ఆమెను చిత్రహింసలకు గురి చేశారు. ఈ క్రమంలోనే హోటల్‌కు వచ్చిన ఓ కస్టమర్ సహాయంతో ఈ విషయాన్ని హైదరాబాద్‌లో ఉన్న తన ముగ్గురు కూతుర్లకు చెప్పుకుని ఆమె కన్నీటి పర్వతమైంది. ఏమి చేయాలో తెలియని స్థితిలో పెద్ద కూతురు స్రవంతి ఎంబిటి నేత అమ్జదుల్లాఖాన్‌ను ఆశ్రయించి జరిగిన విషయాన్ని వివరించింది. అతని సహకారంతో స్రవంతి సుష్మాస్వరాజ్‌కు లేఖ రాసింది. తన తల్లిని ప్రాణాలతో కాపాడి, స్వదేశీనికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే ఏజెంట్ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని తన లేఖలో కోరింది.

'కుంటాల'పర్యాటక రంగానికే తలమానికం

- అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి
- రెండవ కాశ్మీర్‌గా ఆదిలాబాద్
- కుంటలు, అటవీ ప్రాంతాలపై సమీక్షించిన మంత్రి



మన తెలంగాణ/హైదరాబాద్: ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల జలపాతం తెలంగాణ పర్యాటక రంగానికే తలమానికమని రాష్ట్ర ఆటవీ, పర్యావరణశాఖ మంత్రిజోగు రామన్న అన్నారు. సహజసిద్ధమైన ఈ జలపాతం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సహజ సౌందర్యం, ఆటవీ ప్రాంతం దెబ్బతినకుండా ఈ అభివృద్ధి పనులు జరగాలని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన కుంటాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి జోగు రామన్న బుధవారం ఆరణ్య భవన్‌లో నిర్వహించిన సమీక్షలో అధికారులకు స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లాను రెండవ కాశ్మీర్‌గా అభివర్ణించిన సీఎం కేసీఆర్ పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించారని, ఇందులో భాగంగానే జలపాతాల సందర్శనకు వచ్చేవారికి కనీస సౌకర్యాలను కల్పించడంతో పాటు వారు ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. విహారం కోసం వచ్చే యువత జలపాతం ఎగువన ఉన్న గుండంలో పడి చనిపోతున్నారని, ఇప్పటి వరకు 136 మంది చనిపోయారని, ఇది బాధకరమని ఆవేదన వెలిబుచ్చారు. ఇక ముందు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల బృందం త్వరలోనే మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేస్తుందని చెప్పారు. వేసవిలోనే ఈ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆటవీ సంరక్షణ ప్రధాన అధికారి పికె.ఝా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫార్మా సమస్యలకు ప్రత్యేక సెల్

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణలో ఫార్మా సంబంధ పరిశ్రమలు, వాటి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ మేరకు ఢిల్లీలోని ఎఫ్‌డిఏ భవన్‌లోని సెంట్రల్ డ్రగ్స్ కంట్రోల్ స్టాండర్డైజేషన్ కార్యాలయంలో తెలంగాణ ఫార్మా సెల్ ఏర్పాటైనట్లు భారత డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ డా. ఎస్. ఈశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంజయ్ అగర్వాల్ (డ్రగ్ ఇన్స్‌పెక్టర్) విభా శర్మ (సహాయ డ్రగ్ ఇన్స్‌పెక్టర్)లకు గానీ, లేదా నేరుగా డిసిజిఐకు గాను తమ సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు.

ముంచుకొస్తున్న బిజి-3 పత్తి విత్తనాలు!

- వ్యవసాయ శాఖ తనిఖీల్లో బట్టబయలు
- ప్రాసెసింగ్ ప్లాంట్‌ల పరిశీలనకు అధికారుల బృందాలు

మన తెలంగాణ/హైదరాబాద్ : జీవ వైవిధ్యాన్ని దెబ్బతీయడంతో పాటు.. రైతును నిలువునా ముంచే అనుమతి లేని బిజి-3(హెర్బిసైడ్ టాలెరెన్స్) పత్తి విత్తనాలు రాష్ట్రంలోకి విచ్చలవిడిగా వస్తున్నాయి. ఇప్పటికే వ్యవసాయ శాఖ తనిఖీల్లో పట్టుబడిన పత్తి విత్తనాలలో ఈ విషయం స్పష్టమైంది. ఆసిఫాబాద్‌లో సీజ్ చేసిన విత్తన నమూనాలను పరీక్షించగా బిజి-3 విత్తనమని తేలినట్లు వ్యవసాయ శాఖ అధికారి ఒకరు బుధవారం 'మన తెలంగాణ'కు చెప్పారు. బెల్లంపల్లి, మంచిర్యాల్ జిల్లాలో సీజ్ చేసిన విత్తనాల నమూనాలను పరీక్షలకు పంపినట్లు అధికారి పేర్కొన్నారు. ప్రతి ఏటా నకిలీ, అనుమతి లేని పత్తి విత్తనాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఈసారి కాస్త ముందుగానే పర్యవేక్షణ మొదలుపెట్టిన అధికారులు ఇప్పటి వరకు రూ. 68 లక్షల విలువ చేసే నకిలీ విత్తనాలను సీజ్ చేసినట్లు తెలిసింది. అత్యధికంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ఇవి పట్టుబడటం గమనార్హం. వీటిపై కంపెనీ పేరు లేకపోవడం, క్వింటాళ్ల కొద్ది పత్తి విత్తనాలు ప్యాక్ చేయకుండా సీల్ లేకుండా దొరికినట్లు అధికారులు చెబుతున్నారు. బిజి-3 విత్తనాలు సాగు చేస్తే నిషేధిత గ్లైఫోసేట్ కలుపు మందును వినియోగించాల్సి ఉంటుందని, దీని వాడకంతో రానున్న కాలంలో ఆ భూముల్లో ఇతర పంటలు పండవని చుట్టు పక్కల భూముల సారానికి కూడా ప్రమాదకరమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.



బిజి-3 గుట్టు తేల్చేందుకు అధికారుల పరిశీలన బృందాలు : బిజి-3 (హెచ్‌టి) పత్తి విత్తనాల గుట్టు తేల్చేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అధికారులతో 7 పరిశీలన బృందాలను నియమించింది. ఈ బృందాలు ప్రాసెసింగ్ ప్లాంట్లు, జిన్నింగ్ మిల్లులు అధికంగా ఉన్న మహబూబ్‌నగర్, గద్వాల్, రంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ వంటి జిల్లాల్లో పర్యటించి తనిఖీలు చేపట్టనున్నారు. విత్తనాలు అనుమతి ఉన్నవో కాదో అక్కడే తేల్చేందుకు నమూనా పరీక్షలకు సంబంధించిన కిట్‌లను కూడా వారికి అందించారు. తనిఖీల ద్వారా కొంతమేరకైనా నకిలీ, అనుమతి లేని విత్తనాలను నివారించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

దేశానికి థర్డ్ ఫ్రంట్ అవసరం

- జనసేన ఆవిర్భావ సభలో భవిష్యత్తు ప్రణాళిక ప్రకటన
- హోదాపై ఆంధ్రా నాయకుల్లో నిబద్ధత లేదు : పవన్



మన తెలంగాణ/ హైదరాబాద్ :తన రాజకీయ వైఖరి, వచ్చే ఎన్నికల్లో పొత్తు, ప్రత్యేక హోదా తదితర అంశాలపై ఈ నెల 14న జరిగే జనసేన ఆవిర్భావ సభలో వెల్లడిస్తానని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజలు బిజెపికి వ్యతిరేకంగా ఉంటే, తాను ప్రజలకు అనుకూలంగా ఎన్నికల్లో వ్యవహరిస్తానని,తనకు మోడీతో, బిజెపితో ఎలాంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కేంద్రానికి ఎదురు తిరిగితే కేసులు ఉంటాయేమోనని ఎపి నాయకులకు భయాలు ఉన్నాయని, తనకు కూడా ఆదాయ పన్ను నోటీసులు ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం బలంగా ఉంటుందని, దానిని ఎదుర్కోవడం కష్టమని, అందుకే నిర్లక్ష్యానికి గురైన రాష్ట్రాలకు చెందిన ఎంపిలంతా ఒక ప్రెజర్ గ్రూప్‌గా ఉండాలని చెప్పారు. కేంద్రంపై వత్తిడి తీసుకురావాలనే భావన ఉందని, అదే ఇప్పుడు థర్డ్ ఫ్రంట్ రూపంలో బయటికి వచ్చిందని, భవిష్యత్తులో అది రాజకీయ అధికారం సాధించే దిశగా అడుగులు వేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఎక్కడో దూరంగా ఉన్న కేంద్రంతో సయోధ్యగా ఉండాలంటున్న చంద్రబాబు పొరుగున ఉన్న తెలంగాణ ప్రభుత్వంతో గొడవలను ఎం దుకు సర్దుబాటు చేసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో మీడియా ప్రతినిధులతో బుధవారం ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ సందర్భంగా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. దేశానికి థర్డ్ ఫ్రంట్ అవసరమని, అది ఫ్రంట్ స్వతంత్రంగా ఉండాలని, తమిళనాడులో చిదంబరంపై కేసులు పెడితే, వాటిని కక్షపూరితంగా పెట్టారని స్టాలిన్ నిలబడ్డారని, థర్డ్ ఫ్రంట్ కూడా అలా ఐక్యంగా, అండగా ఉండాలని సూచించారు. థర్డ్ ఫ్రంట్‌ను ప్రతిపాదించిన కెసిఆర్ ముఖ్యమంత్రి కాబట్టి ఆయన అందరి దగ్గరకు ఆ స్థాయిలో వెళ్ళవచ్చని, కాని తనకు పరిధులు ఉంటాయని చెప్పారు. సిఎంగా ఆయన మమతాబెనర్జీ దగ్గరకు వెళ్ళి మాట్లాడొచ్చని, తాను వెళ్తే నేనెవరో కూడా ఆమెకు తెలియదన్నారు. గత ఎన్నికల సమయంలో దేశానికి బలమైన నాయకత్వం కావాలనే ఉద్దేశ్యం తో తాను బిజెపికి మద్దతిచ్చానని, అప్పుడు మోడీ పక్కన కూర్చున్నందుకు తనను సెక్యులర్ కాదని విమర్శించినా వెరవలేదన్నారు. అయితే, ఇప్పుడు తాను నిరాశకు గురయ్యాయని చెప్పారు. ఎన్నికల సమయంలో తాను బిజెపి, టిడిపిలకు ప్రచారం చేశానని, అప్పుడు ఎన్‌డిఏ భాగస్వామి అన్నారని, తరువాత ఆయన మాతో ఉన్నాడా? అని ప్రశ్నించారని, తనను వాడుకొని వదిలాశారా? అనేది తెలియదన్నారు. ఆంధ్రాలో రాజకీయ నాయకులెవ్వరూ ప్రత్యేక హోదా కోసం నిబద్ధతతో లేరని, ఎవరికి తోచిన విధంగా వారు చేస్తున్నారని, నిర్దిష్టంగా ఎవరు చేయడం లేదన్నారు. తాను సిఎం కావాలనుకుంటే అయిపోతానా? అని ప్రశ్నించారు. తనకు అత్యధిక పారితోషికం తీసుకునే నటుడవ్వాలని,తన సినిమా రూ.4-5వేలకోట్లు వసూలు చేయాలని ఉండేదని,అయ్యిందా?అని ప్రశ్నించారు.

హౌసింగ్‌బోర్డు, రాంకీకి ధిక్కార నోటీసులు

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిత్రారామచంద్రన్, భవన నిర్మాణ సంస్థ రాంకీ ఇన్‌ఫ్రా ప్రతినిధి శ్రీధర్‌రెడ్డిలకు హైకోర్టు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. వారిద్దరూ ఏప్రిల్ 6న జరిగే విచారణకు స్వయంగా హాజరుకావాలని న్యాయమూర్తి ఎస్.వి.భట్ ఆదేశించారు.

రాంకీ టవర్స్‌లో ఫ్లాట్లకు డబ్బు పూర్తిగా చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్లు చేస్తామని గత విచారణ సమయంలో వారిద్దరూ హైకోర్టుకు తేల్చి చెప్పారని బాధిత పిటిషనర్లు గాయత్రి శేఖర్, మనోజ్‌కుమార్‌లు కోర్టు ధిక్కార రిట్లు వేశారు. కావాలనే వారు కోర్టుకిచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. గత విచారణ సమయంలో వారిద్దరూ హామీ ఇచ్చాక హైకోర్టు.. రెండు వారాల్లో పిటిషనర్లతో వివాదాన్ని పరిష్కరించుకుని, నాలుగు వారాల్లోగా వారికి ఫ్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించిన విషయాన్ని పిటిషనర్లు కోర్టుకు చెప్పారు. దాంతో మీపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలని ఇద్దరినీ బెంచ్ న్యాయమూర్తి ఆదేశించారు.

ఎడిట్ పేజీ


“ఆదర్శాన్ని ఎంచుకోవడంలోనే మన గొప్పతనం ఆధారపడి ఉంటుంది.
– వివేకానంద”

విగ్రహాల ధ్వంసం విపరీత బుద్ధి

సంపాదకీయం

‘‘నేడు త్రిపురలో లెనిన్ విగ్రహం కూల్చారు. రేపు తమిళనాడులో కులోన్మాది పెరియార్ విగ్రహం...’’ఇది ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో తమిళనాడుకు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు హెచ్.రాజా కవ్వింపు పోస్టింగ్. ‘‘విదేశీ నాయకుల విగ్రహాలకు భారత్‌లో స్థానం లేదు’’ – దక్షిణ త్రిపురలోని బెలోనియా పట్టణంలో బిజెపి ఉన్మాదులు లెనిన్ విగ్రహాన్ని కూల్చివేశాక కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ ఉవాచ. త్రిపురలో అధికార మదోన్మత్తులు మరో లెనిన్ విగ్రహం కూల్చారు. ఈ విధ్వంస కృత్యాలకు ప్రతీకారంగా కోల్‌కతాలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు భారతీయ జనసంఘ్ సిద్ధాంత పురుషుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. వారు వామపక్ష వాదులని కచ్చితంగా చెప్పవచ్చు. కాగా తమిళనాడులో బ్రాహ్మణీకవాదంపై తిరుగుబాటు ప్రకటించిన సంఘ సంస్కర్త, ద్రావిడ ఉద్యమం ఆద్యుడైన పెరియార్ ఇ.వి.రామస్వామి విగ్రహాలను రెండుచోట్ల దుండగులు ధ్వంసం చేశారు. డిఎంకె, ఇతర రాజకీయ పార్టీలు ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తూ హింసను ప్రేరేపించిన బిజెపి నాయకుడు రాజాను అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. త్రిపురలో సిపిఐ(ఎం) కార్యకర్తలపైన, కార్యాలయాలపైన దాడులను, లెనిన్ విగ్రహాల ధ్వంసాన్ని బిజెపి దుందుడుకుతనం, అధికార మదానికి నిదర్శనంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఖండించారు. త్రిపుర, తమిళనాడులో బిజెపి కార్యకర్తల హింస, విధ్వంసకృత్యాల పట్ల దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్న నిరసన దృష్ట్యా ప్రధానమంత్రి నరేంద్రమోడీ వాటిని ఖండించగా, అటువంటి వాటిలో పాల్గొనే బిజెపి వారిపై చర్యలు తప్పవని పార్టీ అధ్యక్షుడు అమిత్ షా హెచ్చరిక జారీ చేశారు. ఇది గుడ్డితనం కన్నా మెల్ల మేలన్న సామెతను గుర్తు చేస్తున్నది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల్లో ఒక పార్టీ గెలవటం, మరోపార్టీ ఓడటం సహజం. కాని త్రిపురలో సిపిఐ(ఎం) నాయకత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్‌ను అధికారంనుండి తొలగించటం కమ్యూనిజాన్ని తుడిచివేశామన్నంతగా వెర్రి ఆవేశం నింపుకున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు రెచ్చిపోయి దాడులకు పాల్పడుతున్నారు. కాగా సిపిఐ(ఎం) వారే తమపై దాడులు చేస్తున్నట్లు బిజెపి నాయకులు దుష్ప్రచారం సాగిస్తున్నారు. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కోల్‌కతాలో మంగళవారం వెల్లడించిన ప్రకారం, ‘ఇప్పటివరకు 514 మంది మా కామ్రేడ్స్‌పై దాడులు చేశారు. మా కామ్రేడ్స్‌కు చెందిన 1539 ఇళ్లపై దాడులు జరిగాయి. వాటిలో 196 ఇళ్లు తగలబెట్టారు. 132 పార్టీ ఆఫీసులపై దాడి చేశారు. వాటిలో 62 తగలబెట్టారు. 208 పార్టీ ఆఫీసులు, 90 ప్రజాసంఘాల ఆఫీసులు ఆక్రమించుకున్నారు’.

ఏ రాష్ట్రంలోనైనా అధికారం చేయి మారినపుడు కొన్ని ఉద్రిక్తత ప్రాంతాల్లో చెదురుమదురు ఘర్షణలు జరగటం రివాజు. అయితే త్రిపురలో పెద్ద ఎత్తున బిజెపి వారి హింసాకృత్యాలు అసహనానికి పరాకాష్ట. త్రిపురలో బిజెపి విజయం వామపక్ష భావజాలంపై విజయంగా ప్రధాని అభివర్ణించటం, దాని పర్యవసానప్రభావం భావజాలరంగంలో దేశం మొత్తంపై ఉంటుందని వ్యాఖ్యానించటం గమనార్హం. అయితే త్రిపురలోని బిజెపివారు కమ్యూనిస్టు భావజాలానికి ప్రతీక అయిన లెనిన్ విగ్రహాలపై విరుచుకుపడ్డారు. లెనిన్ ఒక దేశానికి చెందిన వ్యక్తికాదు. దోపిడీ శక్తులనుంచి దోపిడీకి గురవుతున్న ప్రపంచవ్యాప్త పీడిత వర్గాలకు ఆశాజ్యోతి. విగ్రహాలు ధ్వంసం చేసినంత మాత్రాన ఆ శాస్త్రీయ భావజాలం మరుగుకాదు. ఎందుకంటే అది పీడిత ప్రజల మనసుల్లో గూడుకట్టుకుని ఉంటుంది. ప్రపంచ పరిణామాలను ప్రభావితం చేసిన ప్రపంచ నాయకులుంటారని, వారు దేశం, ప్రాంతంతో నిమిత్తం లేకుండా ప్రపంచమంతటా గౌరవించబడుతుంటారని కూపస్థమండూకం లాంటి కేంద్రమంత్రి అహిర్‌కు తెలియకపోవచ్చు. అహింసా సిద్ధాంతకర్త మహాత్మాగాంధీ విగ్రహాలు అనేక దేశాల్లో ఉన్నాయని ఈ మంత్రి గుర్తు చేసుకోవటం అవసరం. ఏమైనా, ఎన్నికల విజయోన్మాదంతో త్రిపురలో, ద్రవిడ ఉద్యమ వ్యతిరేకులను కూడగట్టే దుర్వ్యూహంతో తమిళనాడులో జరిగిన హింసాయుత, విధ్వంస సంఘటనలు బిజెపి వారు ఒక పథకం ప్రకారం సాగించిన నేరకృత్యాలు. త్రిపురలో అధికారం కోల్పోయినా 45శాతం ఓట్లు లభించిన వామపక్షాన్ని దౌర్జన్యంతో అణచివేయటం సాధ్యంకాదు.

హోదా గోదాలో ఎపి రాజకీయం

చూపు

ప్రజల విషయంలో నచ్చచెప్పడం కన్నా భ్రమల్లో ముంచడం చాలా తేలిక. మార్క్ ట్వయిన్ ఈ మాట చెప్పాడంటారు. ఎవరు చెప్పారో ఖచ్చితంగా తెలియదు. అయితే బిజెపి దాని మిత్రపక్షాలు ఈ మాటలను మనస్ఫూర్తిగా నమ్ముతున్నట్లు కనబడుతున్నాయి. ఎన్నికల్లో ధారాళంగా హామీలు వాగ్దానాలు చేసేస్తున్నాయి. అమలు సాధ్యం కాని హామీలు లేదా అమలు చేయాలన్న ఆలోచనే లేని హామీలు చాలా ఉదారంగా చేసేస్తున్నాయి. ఇచ్చిన వాగ్దానాల సంగతేంటని ప్రజలు నిలదీయడం మొదలు పెడితే అప్పుడు మరో అబ్సర్డ్ డ్రామా మొదలవుతోంది (ఒక్కోసారి చునావీ జుమ్లా అని తప్పించుకుంటారు). పార్లమెంటు బడ్జెటు సమావేశాల్లో ఇదే జరిగింది. అనేక అంశాలపై ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. రానున్న కాలంలో ఎలాంటి కల్లోలాలున్నాయో దీన్నిబట్టి అర్థమవుతోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై గొంతెత్తి నిరసన తెలియజేశారు.



ఈ వివాదానికి మూలకారణం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014. ఈ చట్టాన్ని చేసింది కాంగ్రెసు నాయకత్వంలోని యుపిఏ ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్ విభజనకు అప్పట్లో తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెసు రెండుపార్టీలు రాష్ట్రపతికి లేఖల ద్వారా మద్దతిచ్చాయి. కాని ఈ చట్టాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకించాయి. కాని, ఇప్పుడు రెండు పార్టీలు ఇదే చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలని పోరాడుతున్నాయి. ఇదే అబ్సర్డ్ డ్రామా అంటే. బిజెపి మాత్రం ప్రజలను భ్రమల్లో ముంచే కార్యక్రమాన్ని నిరవధికంగా కొనసాగిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకహోదా విషయంలో గోడమీది పిల్లివాటం మానలేదు. యుపిఏ కాలంలో మాజీప్రధాని మన్మోహన్ సింగ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 5 సం॥ల ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పినప్పుడు బిజెపి అరివీరభయంకరంగా10సం॥లు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసింది. అంతేకాదు 2014 ఎన్నికల్లో బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తానని వాగ్దానం చేసింది. కాని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం అనేక ఇతర వాగ్దానాల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అమలు చేయడంలో జాప్యం చేస్తూ వస్తోంది. దీనిపై నిలదీసి అడగడం ప్రారంభమైన తర్వాత ప్రభుత్వం సాకులు చెప్పడం ప్రారంభించింది. ఈ హామీ నిలబెట్టుకోవడం సాధ్యం కాదని, ప్రత్యేకహోదా ఇవ్వడానికి చట్టంలో ఉన్న సాంకేతిక సమస్యల వల్ల ఇవ్వలేమని కొత్త రాగం అందుకుంది. చట్టంలో సాంకేతిక సమస్య ఉంటే దాన్ని పరిష్కరించడం చేతకాని ప్రభుత్వమా ఇది. ఒక రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని సాంకేతిక సమస్య అంటూ దాటేస్తే నోర్మూసుకుని పడి ఉంటారని బిజెపి భావిస్తుందంటే ఎంత అహంకారం ఉండాలి. ఆంధ్రుల పట్ల ఎంత చులకనభావం ఉంది.

కాని ఆంధ్రప్రజల్లో ఆగ్రహావేశాలను చూసిన తర్వాత వాటిని చల్లార్చడానికి 2016లో ప్రత్యేక ప్యాకేజి ఒకటి ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. ఆ ప్రకటన కోసమే కాచుక్కూచున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వెంటనే కేంద్రానికి హృదయపూర్వక ధన్యవాదాలతో ఆ ప్రకటనను స్వాగతించారు. మీడియాలో ఒక్కరు కూడా ఈ వైఖరిని ప్రశ్నించింది లేదు. సాంకేతిక సమస్య వల్ల అమలు సాధ్యం కాని వాగ్దానం ఎందుకు చేశారని నిలదీయలేదు. సాంకేతిక సమస్యను పరిష్కరించడం ఎందుకు సాధ్యం కాదని చర్చించలేదు. ఎన్నికల్లో నోటికొచ్చిన వాగ్దానాలు ఇష్టం వచ్చినట్లు చేసి ప్రజలను మోసగించడాన్ని నిలదీయనూ లేదు. ఇది మన మీడియా పరిస్థితి. ఇంతకు ముందే చెప్పుకున్నట్లు ప్రజలను మభ్యపుచ్చి మోసగించడం చాలా తేలికని నమ్మే పార్టీ బిజెపి. అందుకే ప్రత్యేక ప్యాకేజి అని ప్రకటన చేసింది కాని ప్యాకేజి లేదు ఏమీ లేదు అంతా తూచ్ .. ఉత్తినే అని తర్వాత తేలిపోయింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఈ విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి గట్టిగా నిలదీసింది లేదు. అమరావతి భ్రమరావతిగా మారిపోవడం అందరూ చూస్తూనే ఉన్నారు. అధికారం పోగొట్టుకున్న కాంగ్రెసు పార్టీ పోరాటానికి కావలసిన సమస్యల అన్వేషణలో ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా అలాంటి సమస్యే. కాబట్టి సహజంగానే కాంగ్రెసుపార్టీ ఎపికి ప్రత్యేకహోదా అమలుచేయాలని డిమాండ్ చేస్తూంది.

రాహుల్ గాంధీ 2017లో రాష్ట్రాన్ని సందర్శించారు. కాంగ్రెసు నాయకత్వంలో ప్రత్యేకహోదా భరోసా సభ జరిగింది. ఈ సభకు 14 పార్టీలు మద్దతిచ్చాయి. గుంటూరులో ఈ సభ జరిగింది. విచిత్రంగా ప్రత్యేకహోదా కోసం డిమాండ్ చేస్తున్న కాంగ్రెసు నాయకుడు రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా తెలుగుదేశం నల్లజెండాల ప్రదర్శన చేసింది. ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చిన మూడేళ్ళ వరకు ప్రత్యేకహోదాపై ఏమీ చేయని స్థితిలో రాష్ట్రంలో పాలకపక్షంగా టిడిపి కూడా బిజెపిని నిలదీయవలసింది. కాని నిలదీస్తున్న వాళ్ళను వ్యతిరేకించడమే రాజకీయంగా భావించింది. ఇది పార్టీ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను బలి పెట్టడమే. ఈ నిరసన ప్రదర్శన తర్వాత సంవత్సరం తిరగలేదు, ఇప్పుడు అదే తెలుగుదేశం ప్రత్యేకహోదా అంటూ కాంగ్రెసు పార్టీ మాదిరి నిరసనలు మొదలెట్టింది. ఇదే అబ్సర్డ్ డ్రామా అంటే. ఇప్పుడు బిజెపి మరోరకంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసగించే కొత్త నాటకం ప్రారంభించింది. ప్రత్యేకహోదా సాధ్యం కాదని స్పష్టంగా చెప్పిన పార్టీయే మరోసారి అదే ప్రత్యేకహోదా రాగం అందుకుంది. కాంగ్రెసు నుంచి పార్టీ ఫిరాయింపు నేతలను ఆకర్షించడానికి కావచ్చు. ఆంధ్రప్రదేశ్ బిజెపి నేత హరిబాబు కాంగ్రెసు ప్రత్యేక హోదా సమస్యను ప్రస్తావించడాన్న అపహసిస్తూ మాట్లాడ్డమే కాదు, ఢిల్లీలో మార్చి 6–8 వరకు జరిపిన నిరసన ప్రదర్శనలను కూడా పరిహసిస్తూ వ్యాఖ్యానించారు. కాని ఈయన కూడా ఆంధ్రప్రదేశ్ కోసం ప్రత్యేకహోదా కావాలని డిమాండ్ చేస్తామన్నారు. ఎవరితో డిమాండ్ చేస్తారు? కేంద్రంలో అధికారమంతా మీ పార్టీదే కదా. డిమాండ్ చేస్తామని చెబితే చాలు ప్రజలు నమ్మేసి మోసపోతారన్న అహంకారం తప్ప ఇందులో మరేమీ లేదు. టిడిపి గోడమీది పిల్లివాటాన్ని కొనసాగిస్తూనే ఉంది. ప్రత్యేకహోదా కోసం పోరాడుతామని, అయితే బిజెపితో సంబంధం కూడా కొనసాగిస్తామని అంటోంది. చెప్పే మాటలకు, చేసే పనులకు ఎక్కడా పొంతనలేదు. మన రాజకీయ వ్యవస్థలో పార్టీల అదృష్టమేమంటే, ఇచ్చిన హామీల అమలు విషయంలో నిలదీసి అడిగే వ్యవస్థ ఏర్పాటు ఏదీ లేదు. ఎవడిష్టం వచ్చినట్లు వాడు హామీలిచ్చేసి తర్వాత సాధ్యంకాదని సాంకేతిక కారణాలతో లేక చునావీ జుమ్లాలో చెప్పుకోవచ్చు. ప్రజలను మోసగించేలా హామీలిచ్చేసి ఓట్లు దండుకోవచ్చు. త్రిపురలో బిజెపి ఇచ్చిన ఎన్ని హామీలను నిలబెట్టుకుంటుందో వేచి చూద్దాం. ఎపికి ప్రత్యేకహోదా ఇస్తామని వాగ్దానం చేసిన తర్వాత ఆ వాగ్దానానికే కట్టుబడాలి. సాంకేతిక కారణాల వల్ల సాధ్యం కాకపోతే, సాంకేతిక లోపాలను సవరించడానికి తగిన ప్రయత్నాలు చేయాలి. అందుకు అవసరమైన బలం కూడా చట్టసభల్లో ఉంది. ఇతర పార్టీలు మద్దతివ్వకుండా వ్యతిరేకించే వాతావరణం లేదు. కాని కేంద్రం ప్రత్యేక హోదాకు ఒప్పుకోదు. ఆంధ్రులను మోసగించడం చాలా తేలికన్న అభిప్రాయమే దానికి కారణం. ఎన్నికల్లో ఇష్టమొచ్చిన హామీలను ఇచ్చే పార్టీలను కట్టడి చేయడమెలాగన్నది ఇప్పుడు ఆలోచించవలసిన ప్రశ్న. ఆర్థిక బాధ్యతలు, బడ్జెట్ మేనేజిమెంటు వగైరా విషయాల పరంగా కట్టడి చేస్తూ ఒక చట్టం చేయాలి. ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తారో, బడ్జెటు మేనేజిమెంటు ఎలా చేస్తారో, ఆర్థికభారాన్ని ఎలా మోస్తారో ఖచ్చితంగా చెప్పేలా చట్టం చేయాలి.గాల్లో మాటల్లాంటి వాగ్దానాలను అడ్డుకోకపోతే ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసం అంతరించే ప్రమాదం ఉంది. అమలు చేసే ఆలోచనే లేకుండా ఎన్నికల్లో ఇష్టమొచ్చిన హామీ లిచ్చే ధోరణికి అప్పుడే బ్రేకు పడుతుంది. దురదృష్టమేమంటే, పౌరసమాజం ఇలాంటి చట్టం కావాలని పోరినా, పార్టీలన్నీ మాటవరసకు ఒప్పుకున్నా, అది చట్టంగా అమల్లోకి రావడం సాధ్యపడదు. మహిళల రిజర్వేషను బిల్లుపై కాదన్న పార్టీ ఏదీ లేదు. కాని చట్టం కాలేదు. లోక్‌పాల్ విషయంలో కాదన్న పార్టీ ఏదీ లేదు. కాని చట్టం లోపాల పుట్ట. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపార్టీ రాష్ట్రానికి ప్రత్యేకహోదాను బల్లగుద్ది మరీ సమర్థిస్తాయి. కాని ప్రత్యేకహోదా రాదు. ఎందుకంటే సాంకేతిక సమస్య అనేది పెద్దది అని నమ్మమంటాయి. ప్రజలు కూడా నమ్ముతున్నట్లే కనిపిస్తున్నారు.

* మాధురి దంతాల

(డైలీ ఓ నుంచి)

బిజెపి వ్యూహానికి చిత్తయిన మాణిక్ సర్కార్



ఆర్వీ రామారావ్
9676999856

రాజకీయాల్లో గెలుపు, ఓటమి సర్వ సామాన్యం. కాని త్రిపుర శాసన సభ ఎన్నికలలో బిజెపి ఓటమి ఓ అద్భుతం. ఓడినా గెలిచినంత పని చేసిన మాణిక్ సర్కార్ నాయకత్వంలోని సిపిఐఎం సాధించిన ఫలితాలూ గణనీయమైనవే. బెంగాల్ లో మూడున్నర దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న సిపిఐఎం నాయకత్వంలోని వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం 2011లో ఓడిపోయిన సందర్భానికీ ప్రస్తుతం త్రిపురలో వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం ఓటమికి చాలా తేడా ఉంది. ఆ తర్వాత 2016లో జరిగిన ఎన్నికలలో వామపక్షాల అస్తిత్వం మరింత ప్రశ్నార్థకం అయింది. బెంగాల్ లో వామపక్షాలు ఓడిపోయినప్పుడు స్వయంకృతాపరాధం లేకపోలేదు. సింగూరు, నందిగ్రాం ఘటనలు వామపక్ష ప్రభుత్వం పాలిట శాపాలుగా మారాయి. బెంగాల్‌లో వామపక్ష పరిపాలనా పద్ధతులు, వ్యవహారశైలి మీద కూడా విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వంపై అసమ్మతి పెరగడానికి తగిన కారణాలు కనిపించాయి. త్రిపురలో ఈ పరిస్థితి లేకపోయ్యా మాణిక్ సర్కార్ ప్రభుత్వం గద్దె దిగాల్సి వచ్చింది. 2011లో బెంగాల్‌లో ఓటమి పాలైన వామపక్ష ఫ్రంట్ మహాద్భుతం ఏదైనా జరిగితే తప్ప సమీప భవిష్యత్తులో కోలుకునే అవకాశం కనిపించడం లేదు. కానీ త్రిపురలో ఆ అవకాశం అడుగంటలేదు.

గెలిచిన బిజెపికీ, ఓడిపోయిన సిపిఐఎం కు ఓట్ల శాతంలో ఉన్న తేడా కేవలం 0.3 శాతమే. అంటే సిపిఐఎం ఓట్లు ఘోరంగా తగ్గలేదు. బిజెపి విజయానికి ఎన్ని కారణాలైనా చూపవచ్చు. ఓడినా త్రిపురలో సిపిఐఎం అస్తిత్వానికి భంగం కలగలేదనడానికి అంతకన్నా ఎక్కువ కారణాలే ఉన్నాయి. దుష్పరిపాలన కారణంగా సిపిఐఎం ఓడలేదు. సాధారణంగా పోలింగ్ శాతం తగ్గినప్పుడు అనూహ్యమైన ఫలితాలు వస్తుంటాయి. అయితే ఎప్పటిలాగానే త్రిపురలో పోలింగ్ శాతం 85.7 ఉంది. మాణిక్ సర్కార్ 1998 నుంచి 20ఏళ్లు నిరంతరం అధికారంలో ఉన్నారు. అంతకు ముందు దశరథ్ దేవ్ నాయకత్వంలో వామపక్ష ఫ్రంటే అధికారంలో ఉంది. అంతకన్నా ముందు 1978 నుంచి 1988 వరకూ నృపేన్ చక్రవర్తి నాయకత్వంలో వామపక్షాల నాయకత్వంలోనే త్రిపుర ప్రభుత్వం సాగింది.

2013లో కేవలం 1.54 శాతం ఓట్లు మాత్రమే సాధించి ఒక్క సీటు కూడా సంపాదించని బిజెపి అయిదేళ్ల తిరిగే సరికి బిజెపి 35సీట్లు, ఆ పార్టీ పొత్తు పెట్టుకున్న ఇండిజెనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐ.పి.ఎఫ్.టి.) 8 స్థానాలూ సంపాదించడం అనూహ్యంగా అనిపించవచ్చు. ఇంతకు ముందు ఒక్క సీటు కూడా లేని ఐ.పి.ఎఫ్.టి. ఎనిమిది స్థానాలు సాధించింది. గమనించవలసిన అంశం ఏమిటంటే బిజెపి గెలుపు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌కు అస్తిత్వమే లేకుండా చేసింది. కాంగ్రెస్ నిష్క్రియాపరత్వం బిజెపికి వరప్రసాదమైంది. ప్రతిపక్షానికి ఉన్న ఓట్లన్నీ బిజెపి ఖాతాలో పడిపోయాయి. అధికారంలో ఉన్న సిపిఐఎం ఓట్లకు గండి కొట్టకపోయినా బిజెపి అఖండ విజయం సాధించడం త్రిపుర ఎన్నికల ఫలితాల విశిష్టత. ఓటమి మాట ఎలా ఉన్నా వామపక్షంపై ప్రజలకు నమ్మకం పోలేదనడానికి గెలిచిన పార్టీకీ ఓడిన పార్టీకి మధ్య ఓట్ల తేడా అత్యంత స్వల్పంగా ఉండడమే రుజువు. కాంగ్రెస్ తెరమరుగై పోవడం బిజెపికి సిద్ధాన్నమైంది. ఐ.పి.ఎఫ్.టి.తో పొత్తు బిజెపి విజయాన్ని మరింత సునాయాసం చేసింది. వామపక్ష వ్యతిరేక ఓట్లను కూడగట్టడం ద్వారా బిజెపికి అధికారం దక్కింది. వామపక్ష వ్యతిరేక ఓట్లు గతంలో కాంగ్రెస్‌ను ప్రధాన ప్రతిపక్షంగా ఉంచితే ఇప్పుడు అవే ఓట్లు బిజెపిని అధికారంలో కూర్చోపెట్టాయి.

అనేక రాష్ట్రాల్లో అధికార పక్షాలు కూలిపోవడానికి దోహదం చేసిన కారణాలు ఉంటాయి. అక్రమాలు, అన్యాయాలు, అవినీతి, అధికార దాహం, ప్రజా సంక్షేమాన్ని ఖాతరు చేయకపోవడం వంటి అనేక కారణాలు ఉండవచ్చు. కాని మాణిక్ సర్కార్ ప్రభుత్వం ఓటమికి ఇవేవీ కారణాలు కావు. ఎంత మంచి ప్రభుత్వానికైనా వ్యతిరేకత అనివార్యం. మాణిక్ సర్కార్ వైఫల్యాలు ఉండి ఉండొచ్చు. కాని అదే ఓటమికి దారి తీయలేదు. సకల సమస్యలను పరిష్కరించే ప్రభుత్వం ఇప్పటికీ అనుభవంలోకి రానే లేదు. రెండు విడతలుగా మొత్తం 35ఏళ్ల కాలంలో వామపక్ష ప్రభుత్వాలు అనేక విజయాలు సాధించాయి. రాష్ట్ర నిర్మాణానికి కృషి చేశాయి. మిగతా ఈశాన్య రాష్ట్రాలు ఒక వేపు వేర్పాటువాద ధోరణులు, విద్రోహకర కార్యకలాపాలతో సతమతమవుతూ, మరో వేపు రాజ్యహింసతోనూ అట్టుడికిపోతున్న సమయంలో సమాజంలో సామరస్యం నెలకొల్పడంలో వామపక్షాలు అనితర సాధ్యమైన పాత్ర పోషించాయి. ఇతర ఈశాన్య రాష్ట్రాలు అనేకానేక సమస్యలలో ఉన్న సమయంలో త్రిపురలో విద్య, ఆరోగ్యం, భద్రత మీద దృష్టి నిలిపారు. త్రిపురలో అక్షరాస్యతా శాతం 94.65 శాతం ఉండడానికి కారణం వామపక్ష ప్రభుత్వమే. ఈ విషయంలో త్రిపుర దేశంలో కెల్లా అగ్రస్థానంలో ఉంది. 2005నాటికి త్రిపురలో 18 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న మహిళలు 50 శాతం నిరక్షరాస్యులుగా ఉంటే 2016 కల్లా ఇది ఏడు శాతానికి తగ్గడం మరే రాష్ట్రమూ సాధించని విజయం. శిశు మరణాల సంఖ్య ప్రతి వెయ్యిమందికి 2005లో 51 ఉంటే 2016 నాటికి సగానికి తగ్గింది. లింగనిష్పత్తిలో కూడా త్రిపుర మెరుగైన స్థానంలో ఉంది. సామాజిక జీవనాన్ని మెరుగుపరచడానికి ప్రయత్నించి ఉండకపోతే ఇవి సాధ్యమయ్యేవే కాదు. త్రిపురలో అవినీతి మాటే వినిపించదు. మాణిక్ సర్కార్ నిరాడంబరతను మెచ్చుకునే వారికి కొదవ లేదు. అయితే వామపక్ష శాసనసభ్యుల మీద అక్రమ సంపాదనాపరులన్న ఆరోపణలు లేకపోవడం మరో విశేషం.

మరి సకల సద్గుణ రాశి లాంటి మాణిక్ సర్కార్ ప్రభుత్వం ఎందుకు పదవీచ్యుతమైంది అన్న ప్రశ్న తలెత్తడం సహజమే. బెంగాల్ వామపక్ష ఫ్రంట్ పాలన కన్నా త్రిపుర భిన్నమైంది. సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగడం వల్ల కొంత అలసత్వం సహజమే. త్రిపుర జనాభాలో 31శాతం మంది గిరిజనులే. ఐ.పి.టి.ఎఫ్. గిరిజనులకు ప్రాతినిధ్యం వహించేదే. నిజానికి ఆ పార్టీ ప్రత్యేక రాష్ట్రం కోరుతోంది. సహజంగానే అసలే చిన్న రాష్ట్రాన్ని విడగొట్టడంలో అనౌచిత్యం కారణంగా సిపిఎం అంగీకరించలేదు. కాని కాంగ్రెస్ వేర్పాటు వాద గిరిజన శక్తులకు అంటకాగింది. ఇప్పుడు బిజెపి ఏకంగా పొత్తు పెట్టుకోవడం విజయసోపానం అయింది. సిపిఎం కు గిరిజనుల మద్దతు ఉండేది. వారి సమస్యలను మాత్రం పరిష్కరించలేదు. మతోన్మాద సంఘ్ పరివార్ శక్తుల వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టడంలో కూడా విఫలమైంది.

బిజెపి ఎప్పుడూ దీర్ఘ కాలిక ప్రణాళికలనే అనుసరిస్తుంది. ఈశాన్య రాష్ట్రాలు ఒక వైపున బంగ్లాదేశ్, మరో వేపున చైనా సరిహద్దు లో ఉండడం, ఈశాన్య రాష్ట్రాలలో క్రైస్తవ మతంలోకి మారేవారు ఎక్కువగా ఉండడంవల్ల అక్కడ పట్టు సంపాదించాలని బిజెపి కనీసం పదిహేనేళ్ల నుంచి ప్రయత్నిస్తోంది. ఎన్నికల సమరాంగణంలో బిజెపికి మార్గాన్ని సుగమం చేయడానికి ఆర్.ఎస్.ఎస్.తగిన నేపథ్యం సమకూర్చింది. అనేక ఆర్.ఎస్.ఎస్. అనుబంధ సంఘాలు ఉధృతంగా పని చేశాయి. త్రిపురలో రెండేళ్లకాలంలో ఆర్.ఎస్.ఎస్., బిజెపి కలిసి లక్ష్యసాధన దిశగా పథకం ప్రకారం కచ్చితమైన వ్యూహం అనుసరించాయి. ఈ విషయంలో సీపీఐఎం ఎందుకూ కొరగాలేదు.పైగా బిజెపికి వనరుల కొరత లేదు.

2013 ఎన్నికలలో 50 మంది బిజెపి అభ్యర్థులు 49 మంది ధరావతు కోల్పోయారు. 2008ఎన్నికలలో కూడా ఒక్క బిజెపి అభ్యర్థికీ డిపాజిట్ దక్కలేదు. ప్రస్తుతం సాధించిన విజయానికంటే ముందు బిజెపి సాధించిందల్లా 2016లో జరిగిన పంచాయతీ ఎన్నికలలో మొత్తం 6,111 స్థానాలు ఉంటే 121 సీట్లు సంపాదించడమే. మూడు పంచాయతీలు దక్కించుకుంది. 2014 ఎన్నికల సమయంలో మోదీ ఎన్నికల ప్రచార సభకు కేవలం ఆరువేల మందే వచ్చారు. మోదీ సభలకు దేశంలో అంత తక్కువ మంది మరెక్కడా హాజరు కాలేదు. కానీ బిజెపి పట్టు వదలకుండా ఒక్కొక్క అడుగే ముందుకేసింది.

గత రెండేళ్ల కాలంలో బిజెపి అనేకమంది కాంగ్రెస్ నాయకులను తన వేపు తిప్పుకోగలిగింది. కొంతమంది తృణమూల్ కాంగ్రెస్ నాయకుల మద్దతు కూడా కూడగట్టింది. గత మూడవ తేదీన వెలువడిన ఎన్నికల ఫలితాలలో బిజెపి అభ్యర్థులుగా గెలిచిన వారిలో ఏడుగురు ఇలా పార్టీ ఫిరాయించిన వారే. వామపక్షాన్ని వ్యతిరేకించే వారి ఓట్లు సంపాదించడం కోసం అనేక వ్యూహాలు అనుసరించింది. ఎన్నికల జాబితాలో ఒక్కో పేజీలో 60మంది ఓటర్లు ఉంటారు. వీరి కోసం 42,000 మంది పన్నా (పేజీ) ప్రముఖులను ఏర్పాటు చేసింది. మోదీ దూతలను నియమించింది. వీరు మోదీ టీ షర్టులు వేసుకుని రైళ్లల్లో ప్రయాణించి కరపత్రాలు, లఘు పుస్తకాలు పంచడంతో పాటు ప్రయాణికులతో చర్చించేవారు. వారి కష్ట సుఖాలు వాకబు చేసేవారు. మంచి నీళ్లు, గ్యాస్ వంటివి అందుతున్నాయో లేదో కనుక్కునేవారు. ప్రయాణికుల ఫోన్ నెంబర్లు కూడా తీసుకునేవారు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో మాణిక్ సర్కార్ ప్రభుత్వ అశక్తతను బిజెపి బాగా ఉపయోగించుకుంది. ‘మార్పు కోసం ఓటేయండి’ నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేసింది. త్రిపురలో ఇప్పటికీ ప్రభుత్వోద్యోగులకు ఏడో వేతన సంఘం సిఫార్సుల ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదు. నాల్గవ వేతన సంఘం సూచించిన జీతాలే ఇస్తున్నారు. బిజెపి అధికారంలోకి వస్తే ఏడవ వేతన సంఘం సిఫార్సులు అమలు చేస్తామని ప్రధాని మోదీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ భరోసా ఇచ్చారు. ప్రభుత్వోద్యోగుల్లో 60 శాతం మంది బిజెపికి ఓటువేసి ఉంటారని వామపక్ష నాయకులే అంటున్నారు.

ఈశాన్యంలో క్రైస్తవమతం స్వీకరించే వారిని ఆపడానికి ఆర్.ఎస్.ఎస్. ఒక్కో రాష్ట్రాన్ని మరో రాష్ట్రానికి దత్తత ఇచ్చింది. త్రిపుర బాధ్యత పశ్చిమ బెంగాల్‌కు అప్పగించింది. 2014 నాటికి త్రిపురలో 60 ఆర్.ఎస్.ఎస్. శాఖలు ఉంటే ఇప్పుడు 265శాఖలున్నాయి. ఎన్నికల రాజకీయాలతో తమకు ఏమాత్రం సంబంధం లేదని, తాము ప్రజలతో మాత్రమే సంబంధాలు పెట్టుకుంటున్నామని నమ్మబలికే ఆర్.ఎస్. ఎస్. బిజెపి విజయానికి సోపానంగా మారింది. 50,000 మందికి పైగా ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలు త్రిపుర మీద దృష్టి కేంద్రీకరించారు. ఒక్కో నియోజక వర్గానికి ఒక ‘విస్తారక్’ను నియమించారు.అయిదేసి పోలింగ్ కేంద్రాలకు ఒక్కో ‘శక్తి కేంద్ర విస్తారక్’ను రంగంలోకి దించారు. ఈ కార్యకర్తలందరికీ సంఘ్ పరివార్ సిద్ధాంతం, జాతీయత, భారత సంస్కృతి గురించి శిక్షణ ఇచ్చారు. ఎన్నికలు దగ్గరపడినప్పుడు అస్సాం నుంచి 400 మంది ‘విస్తారక్’లను దిగుమతి చేశారు.

ఈ ఎన్నికలలో మోదీ నాలుగు బహిరంగ సభలలో ప్రచారం చేశారు. అంత చిన్న రాష్ట్రంలో ప్రధాని ఇంత విస్తారంగా ప్రచారం చేయడం అపూర్వం. సీనియర్ బిజెపి నాయకులు అనేకసార్లు ఆ రాష్ట్రంలో పర్యటించారు. గత మూడేళ్ల కాలంలో 52 మంది మంత్రులు పర్యటించారు. సామాజిక మాధ్యమాల ద్వారా యువతను ఆకట్టుకున్నారు. త్రిపుర ఎన్నికల ప్రచార బాధ్యత స్వీకరించిన సునీల్ దేవధర్ మొత్తం 60నియోజకవర్గాలను కనీసం మూడు సార్లు చుట్టబెట్టారు.

వామపక్షాలు ముఖాముఖి బిజెపితో తలపడింది త్రిపురలోనే. బిజెపి వ్యూహానికి సిపిఐఎం ఏ రకంగానూ సాటి రాలేదు. ‘కమ్యూనిస్టుల నడ్డి విరిచేసి విజయం సాధించాం’ అని సునీల్ దేవధర్ అందుకే గర్వంగా ప్రకటించారు. జె.ఎన్.యు. నుంచి కేరళ దాకా ఈ పని చేయడం తప్పనిసరి అని ఆయన అంటారు. త్రిపురలో విజయం కేవలం ఆ రాష్ట్రానికే పరిమితమైంది కాదన్నది ఆయన వాదన. బిజెపి ప్రచారోధృతి ఆ పార్టీ కార్యకర్తల్లోనే కాకుండా ప్రజల్లో సైతం ఆకాంక్షలను విపరీతంగా పెంచేసింది. సిపిఐఎం పరాజయం బెంగాల్‌లో ఓటమి లాంటిది కాదు అన్న వాస్తవాన్ని బిజెపి గుర్తించక తప్పదు.

మళ్ళోకసారి మార్చి 8ని తలచుకుంటూ..




కొండవీటి సత్యవతి,
ఎడిటర్
స్త్రీవాద పత్రిక భూమిక
9618771565

మార్చి ఎనిమిది సమీపిస్తుందంటే ఒక ఉత్సాహం, ఒక సంతోషం మనసంతా కమ్ముకుంటుంది. అంతర్జాతీయ మహిళా దినాన్ని పురస్కరించుకుని రాష్ట్రమంతా ఎన్నో సమావేశాలు. రాష్ట్రం నలుమూలల నుండి అసంఖ్యాకంగా ఆహ్వానాలు. నగరంలో కూడ లెక్కలేనన్ని మీటింగులు జరుగుతాయి. మొత్తానికి దేశవ్యాప్తంగా మార్చి ఎనిమిదిన మహిళల అంశాలపై, మహిళల సమస్యలపై చర్చోపచర్చలు జరుగుతాయి.

కొందరు పోరాట దినంగా జరిపితే, కొందరు ఉత్సవంలా, ఉల్లాసంగా జరుపుతారు. వందేళ్ళచరిత్ర కలిగిన మార్చి ఎనిమిది ఎన్నో పోరాటాల్ని, మహిళల ఆరాటాల్ని, ఆర్తనాదాల్ని తనలో ఇముడ్చుకుంది. వాటన్నింటినీ గుర్తు చేసుకోవడానికి, గురి తప్పిన గమ్యాలను పునర్‌నిర్మించుకోడానికి, మహిళా ఉద్యమానికి పునరంకిత మవ్వడానికి మార్చి ఎనిమిదిని మించిన రోజు మరోటి లేదు.

అయితే కొన్ని ముఖ్యమైన అంశాలు ఈ సందర్భంగా ముందుకొస్తున్నాయి. బీజింగ్ సదస్సు స్ఫూర్తితో మహిళలపై అన్ని రకాల వివక్షతను వ్యతిరేకంగా జరిగిన ఒప్పందం (సీడా) నేపథ్యంలో భారతదేశం మహిళల రక్షణ కోసం చాలా చర్యలను తీసుకుంది. కొత్త చట్టాలను చేసింది. స్థానిక సంస్థల్లో 33శాతం రిజర్వేషన్లు (73,74 రాజ్యాంగ సవరణ) గృహహింస నిరోధక చట్టం 2005, లాంటివి వచ్చాయి. అయితే అసెంబ్లీ, పార్లమెంటుల్లో రిజర్వేషన్ కల్పించే బిల్లు మొద్దు నిద్రలోనే జోగుతోంది. గృహహింస నిరోధక చట్టం కూడా దేశమంతా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలులోకి వచ్చినప్పటికి ఇంటర్న ల్ కంప్లైంట్ కమిటీల ఏర్పాటులో చాలా అలసత్వం ఉంది. పనిచేసే చోట మహిళల భద్రత కోసం



ఈ కమిటీల ఏర్పాటు తప్పనిసరి అయినప్పటికీ ఎన్నో ప్రభు త్వ విభాగాల్లో ఇవి ఏర్పడలేదు.

హింసల నెదుర్కునే మహిళలు, పిల్ల కోసం ఇటీవల ఏర్పాటైన ‘సఖి సెంటర్లు’ పూర్తిస్థాయిలో పనిచేయాలనే ఆశయంతో వీటి అమలులో స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రభుత్వంలో భాగమవ్వడం మంచి పరిణామం. కొత్త చట్టాలొస్తున్నాయి. కొత్త కొత్త సపోర్ట్ సిస్టమ్స్ వెలుస్తున్నాయి. అయినాగానీ స్త్రీల మీద హింస ఏ మాత్రం తగ్గడం లేదు. స్త్రీలపై నేరాలు పెరుగుతున్నాయని సాక్షాత్తు జాతీయ నేర నిరోధక సంస్థ గణాంకాలు చెబుతున్నాయి. నేరాలు పెరుగుతున్నాయని లెక్కలేసి చెబుతున్నారు గానీ వాటి తగ్గుదల కోసం ఏమి చర్యలు తీసుకుంటున్నారో చెప్పడం లేదు. చట్టాలు చేసాం కదా అని చేతులు దులిపేసుకునే బండవైఖరి కన్పిస్తోంది కానీ చట్టాల సక్రమ అమలుకోసం జండర్ స్పృహతో ఆలోచిస్తున్న దాఖలాలు లేవు. చట్టాల అమలు, ప్రభుత్వ పథకాలతోనే మహిళా సాధికారత సిద్ధిస్తుందనుకుంటే అంతకు మించిన భ్రమ మరోటి ఉండదు.

భారతీయ సమాజంలో వేళ్ళూనుకుని పోయిన పితృస్వామ్య భావజాలం మహిళలని పురోగమనం వైపు అడుగులేయకుండా అడ్డుపడుతోంది. అమలులో ఉన్న చట్టాలను ఉపయోగించుకోనీయడం లేదు. మహిళలపై పురుషుడి సర్వ హింసలకి కారణమైన పురుషాధిక్యాన్ని, పితృస్వామ్య భావజాలాన్ని ప్రశ్నిచకుండా స్త్రీ విముక్తి జరగదు. పురుషులు కూడా పితృస్వామ్య బాధితులు కాబట్టి స్త్రీ పురుషులిరువురూ కలిసి పోరాడాలి. స్త్రీ, పురుష సమానత్వం కోసం ఉద్యమించాలి. ముఖ్యంగా ఇటీవల ప్రమాదకరంగా పెరుగుతున్న మతవిద్వేషం,మతోన్మాద రాజకీయం మహిళల భద్రతకే కాక లౌకికస్ఫూర్తికి భంగకరంగా తయారైంది. దీని పట్ల అందరం జాగరూకం కావాల్సిన అవసరం ఉంది. దీనికి మంచి ఉదాహరణ గౌరీ లంకేష్, కల్బుర్గి, దబోల్కర్‌ల హత్యలు.. ఇది చాలా ప్రమాదకర ధోరణి. మార్చి ఎనిమిదికి జేజేలు పలుకుతూ, మహిళా అంశాలను సమీక్షించుకోవడానికి మార్చి ఎనిమిది సమావేశ వేదికలు ఉపయోగపడాలని ఆకాంక్షిస్తూ..

మన తెలంగాణ
5
హైదరాబాద్
గురువారం
8 మార్చి, 2018
www.manatelangana.news



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



అఖిల

ఆమెతో ఎన్నడూ సమానం కాదు

ఆలోచనా విధానం విస్తృతం కావాలి...

నెమ్మదిగా ఇప్పుడిప్పుడే సమాజంలో ఆడవారి పట్ల ధోరణి మారుతోంది. సహనం, శాంతం, సరైన నిర్ణయాధికారం ఏదైనా స్త్రీకే ఎక్కువగా ఉంటుంది. మా తర్వాతే మీరు అనే అహంకారం మగవారికి ఎక్కువగానే ఉంటుంది. అణువణువునా ప్రేమనింపుకున్న మహిళ మాతృస్వభావంతోనే భర్తను కూడా చూస్తుంది. అది అణిగిమణిగి ఉన్నట్లు కాదు. ఆమె ఎదురుతిరిగితే మగవాడికి మనుగడే ఉండదు. అందుకే ఆమె ఆచితూచి వ్యవహరిస్తుంది. నిర్ణయాలు తీసుకుంటుంది. మహిళతో ఎప్పటికీ సమానం కాదు పురుషుడు. ఆమె ఎప్పుడూ ఒక మెట్టు పైనే ఉంటుంది. ఇగో ఉన్న భర్తలను, కుటుంబీకులను తన ప్రేమతో మార్చుకోవడానికి ప్రయత్నిస్తుంది. స్త్రీ పురుషులకైనా ఎదుటివారిలో మంచిని మాత్రమే చూసే ధోరణి అలవడాలి.అర్థం చేసుకునే తత్వం పెరగాలి. ఎదుటివారి నుంచి ఆశించడమనేది పెట్టుకుంటే అశాంతి మాత్రమే మిగులుతుంది. మహిళల ఆలోచనావిధానం విస్తృతి కావాలి. జ్ఞానం పెంచుకోవాలి. పుస్తకాలు బాగా చదవాలి. మహిళలకు దారుణ పరిస్థితులు ఎదురైతే మాత్రం చట్టాలను ఆశ్రయించాలి. ఇక్కడ సర్దుకుపోవడం నేరం. తన ఉనికి తాను కాపాడుకోవాలి. ఎవర్నీ భరించాల్సిన అవసరం లేదు. సామదాన బేధదం డోపాయాలను ఎందుకుపెట్టారంటే.. ఇన్ని రకాలుగా మనిషిని మార్చొచ్చని.

ఒక తల్లి కొడుకుని నిర్లక్ష్యంగా పెంచితే, అప్పుడే మరో స్త్రీ ఆగమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. పిల్లల పెంపకంలో మహిళ పాత్ర ఎక్కువ. భార్యాభర్తల మధ్య సమన్వయం లోపిస్తే, అక్కడ క్రమశిక్షణ లోపిస్తుంది. స్త్రీ మనసు ఎప్పుడు కూడా పనిచేస్తూనే ఉంటుంది. వెంటవెంటనే ఆడపిల్లల్ని కనడం వల్ల కూడా మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇంట్లో పోరు తప్పడం లేదు. నావరకు తీసుకుంటే బయట అధికారిణిగా ఉంటూ ఇంట్లో వచ్చేసరికి మైండ్‌సెట్ మార్చుకోవాల్సి ఉంటుంది. భార్యగా, తల్లిగా ఆలోచించాల్సి ఉంటుంది. ఇంట్లో పనంతా నేనే చేసుకుంటాను. దాంట్లో ఓ ఆనందం ఉంటుంది. ఒకరిపై ఆధారపడి ఉండటం అంతగా ఇష్టం ఉండదు.

బండ అరుణారెడ్డి,
హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్, రచయిత్రి



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఘట్‌కేసర్ మండలంలోని చౌదరిగూడ గ్రామం, వెంకటసాయినగర్‌కు చెందిన మహిళలు మనతెలంగాణ అఖిలతో తమ మనోభావాలను పంచుకున్నారు. ఇంటాబయటా మహిళలకు నిర్ణయాధికారం ఉందా లేదా, మహిళలపై టీవీ సీరియళ్ల ప్రభావం, వారికి కూడా విశ్రాంతి అవసరమా లేదా..బిడ్డలను తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర, సమాజంలో లైంగిక వేధింపులకు గురవుతున్న స్త్రీలు, మహిళల వస్త్రధారణ, ఆడపిల్ల అని తెలియగానే గర్భంలో ఉండగానే చంపేయడం.. ఇలాంటి పలు అంశాలను చర్చించారు. సీరియల్స్‌లో ఆడవారి పాత్రల ద్వారా సమాజానికి ఏం చెప్పదల్చుకున్నారో అర్థం కావట్లేదన్నారు. ఇలాంటి సీరియళ్లు కుటుంబానికి స్లోపాయిజిన్ లాంటివని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. తమ అభిప్రాయాలను పంచుకున్నవారిలో హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ బండ అరుణారెడ్డి, కె.రూతమ్మ, ఎస్. కమలశ్రీ, మన్నె లలిత, తోట సునీత, కె. సంగీతలక్ష్మి, కె.హేమలత, శ్రీలక్ష్మి మోర, అనిత పోరిక, రాణి మహంకాళి ఎమ్, అరుణ డి, ఎమ్. ఉమ, నసీమలున్నారు.

అక్షరాయుధమై.. నీ వెంట

అబల నుంచి సబలగా ఎదుగుతున్న జననీ... నీకు వందనం.. నీ కోసం నీ వెత్తిన గళమే నేడు నిన్ను సమున్నత స్థానంలో నిలుపుతోంది... వంటింటికే కాదు విహంగం వలే ఎగురగలవని నిరూపించిన నీ ఘనత వేనోళ్లా ప్రతిధ్వనిస్తోంది. వివక్షకు గురైన నీవే.. నీ బానిస సంకెళ్లు తెంచుకుంటున్నావు.. నేను అర్ధరాత్రి నిర్భయంగా తిరగగలనని నిరూపించుకున్న నాడే నీకు విముక్తి... మహిళా దినోత్సవాన ఆ శపథం.. తీసుకుంటావని ఆకాంక్షిస్తూ నీ బాధల గాథలన్నీ ప్రపంచానికి చాటి చెప్పేందుకు అక్షరం సాక్షిగా నీ వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నానని సగర్వంగా చాటుతూ నీవు మరిన్ని సాహసాలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ''మన తెలంగాణ'' మరోమారు శతసహస్ర వందనాలర్పిస్తుంది..



ఆత్మరక్షణ ముఖ్యం..

ఆడపిల్లలకు చదువుతోపాటు కరాటే లాంటివి నేర్పించాలి. ఆత్మరక్షణకోసం ఇలాంటివి ఈ రోజుల్లో తప్పనిసరి. ఎవరో రక్షిస్తారని అనుకునే పరిస్థితి లేదు. అన్నిరంగాల్లో ముందుకు దూసుకుపోతున్నా రక్షణ విషయంలో మాత్రం బేల ఎందుకవ్వాలి. అపరకాళిలా విజృంభించి ఈ సమాజానికి పట్టిన జాడ్యాన్ని వదిలించేలా తయారవ్వాలి మహిళ.

లలిత మన్నె(పిన్నక), కవయిత్రి



టీవీ సీరియళ్ల పోకడ మారాలి..

ఇంట్లో ఎప్పుడూ పనిచేస్తుండేది ఆడది. ఆమెకు విశ్రాంతి ఉండనే ఉండదు. ఇది చేయమని ఎవ్వరూ చెప్పరు. ఓపిక ఉన్నంతవరకు కుటుంబం కోసం పనిచేస్తూనే ఉంటుంది. మన పిల్లలకు స్వేచ్ఛ, విచ్చలవిడిదనానికి ఉన్న భేదాన్ని తెలియజేయాలి. ఈ మధ్య భార్యాభర్తలు ఒకరినొకరు చంపుకోవడాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఒకరినొకరికి పడకపోతే చట్టప్రకారం విడిపోవాలి గానీ చంపుకొనే హక్కు ఎవరిచ్చారు వీరికి. ఓర్పు, సర్దుబాటు లేకపోవడం లాంటివి వీటికి కారణాలు. అదేవిధంగా మీడియా ప్రభావం కూడా ఎక్కువగా ఉంది. స్మార్ట్‌ఫోన్‌లు, ఇంటర్‌నెట్‌లు వచ్చాక మహిళలపై అత్యాచారాలు మరింత ఎక్కువయ్యాయి. మరి వీటిని తీస్తున్నవారు సమాజానికి ఏం మెసేజ్ ఇస్తున్నారో తెలియదు. వారికి సామాజిక బాధ్యత లేదా? ఇలాంటి విలువల్లేని టీవీ సీరియళ్ల వల్ల ఏం నేర్పించాలనుకుంటున్నారు. మీరెందుకు చూస్తుంటారు అంటే ఏదో కాసేపు వినోదం కోసమే కదా!

సునీత తోట, గృహిణి



సంస్కారం ఇంటి నుంచే రావాలి...

పిల్లల పెంపకంలో చాలా మార్పులొచ్చాయి. ఉద్యోగం చేసే అమ్మనాన్నలు పిల్లల్ని నిర్లక్ష్యం చేస్తున్నారు వారికి తెలియకుండానే. ఏది కరెక్టో ఏది కాదో చెప్పగలిగే సమయం దొరకడం లేదు. నా కూతురి జీవితాన్ని నేను నిలబెట్టాను. అమ్మాయిని అపురూపంగా పెంచుకున్నాను. పెళ్లి చేశాను. అష్టకష్టాలు పెట్టాడు. ఆమెకు తల్లిగా అండగా నిలబడ్డాను. విడాకులు ఇప్పించి మళ్లీ పెళ్లి చేశాను. నేను పోయేవరకు నా కూతురు వెంట ఉంటాను. అసలు మన వ్యవస్థ చాలా అస్తవ్యస్తంగా ఉంది. ఇంటి నుంచే సంస్కారం మొదలవ్వాలి. ఆడపిల్లలకే అన్ని నీతులు, నియమనిబంధనలు. మగపిల్లవాడికి విపరీతమైన స్వేచ్ఛ ఇవ్వడంతోనే సమస్య మొదలవుతుది. ఆడమగ అనే తేడాలేకుండా పెంచడం తల్లి చేతుల్లోనే ఉంది. మగపిల్లల్ని, ఆడపిల్లల్ని పెంచడంలో తల్లిదండ్రులు సమన్వయంతో ఉండాలి.

ఎస్. కమలశ్రీ



ఆడపిల్లలకు చదువు తప్పనిసరి..

నాకు మావారికి పాతికేళ్ల వయసు తేడా. ఆ రోజుల్లో నేను చదువుకోవడానికి చాలా కష్టాలు పడ్డాను. దొంగచాటుగా చదువుకున్నాను. అన్నీ భరించి చదువుకుని ప్రభుత్వ టీచర్ ఉద్యోగం సంపాదించుకున్నాను. ఆత్మవిశ్వాసం ఉండబట్టే ఇదంతా నావల్లయింది. నా ముగ్గురు కోడళ్లకు నా అనుభవాల దృష్ట్యా నేను వాళ్లను చాలా గౌరవిస్తుంటాను. స్వతంత్రంగా ఆలోచించమని చెప్తుంటాను. ఆడపిల్లలు ఎవరిపై ఆధారపడకూడదు. అందుకోసం చదువుకోవాలి. చదువుకుంటే ఎవరికీ తలొంచక్కర్లేదు. నా మాటలు చాలా మంది పాటించి ఇప్పటికీ నాదగ్గరకు వచ్చి కృతజ్ఞతలు చెప్తుంటారు.

-కె. రూతమ్మ,
క్రిస్టియన్ అసోసియేషన్ ఉమెన్ ఎడ్యుకేటర్



ఆడది ఎలా ఉండాలంటే...

ఆమె ఓ అగ్నికెరటం. తుంటరులున్న ఒంటరిలోకంలో తనను తానుగా నిలబెట్టుకున్న ఓ సమత సమరం. ఆమె ఓ శాంత స్వరూపం. రగులుతున్న గుండెల్లోని ఆవేశాలను చల్లార్చి మానవతా విలువలను అందించగల అనురాగం.ఆమె ఓ భరోసా. ఏ దిక్కూలేక ఆవేదన చెందే నిస్సావర జీవులకు ఆశ్రయాన్ని అందించే ప్రయత్నం. ఆమె ఓ నిర్భీతి. నీతి నిజాయితీ ఊపిరిగా ముందుకుసాగుతూ తప్పుడు వ్యక్తిత్వాల ముందు తలవంచక ముందుకుసాగే సంభవం. ఆమె ఓ త్యాగశీలి. తనకంటూ ఏమీ మిగుల్చుకోక తనకు తానే కానిలోకాన్ని సృష్టించుకున్న చదరని మనస్తత్వం.

నసీమ , స్వీకార్ స్పెషల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్



ఆడవారే మారాలి..

అమ్మాయిలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయంటూ గగ్గోలు పెడుతున్నాం. ఇక్కడ ఓ సున్నితమైన అంశాన్ని గమనించడం లేదు. అమ్మాయిల డ్రెస్సింగ్ కూడా కారణమే. మోడ్రన్ డ్రెస్ వేస్తేనే అందంగా కనిపిస్తుందా. అది రోడ్డుపై కనిపించాలా. అబ్బాయిల్ని రెచ్చగొట్టేలా వేసుకోవడం ఎందుకు. హుందాతనంగా ఉంటే మన జోలికి వచ్చే ధైర్యం ఎవరికుంటుంది. సమయ సందర్భాన్ని బట్టి డ్రెస్సింగ్ ఉంటే మంచిది. మరి చిన్నపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయంటారు. ఇక్కడ చూసినది వాడు వాళ్లపై ఘోరాలు చేయడానికి కారణమౌతుంది.

కె. సంగీత లక్ష్మి , మ్యూజిక్ టీచర్, గాయకురాలు.

మల్లీశ్వరి వారణాసి, ఫొటోలు: బాష

హక్కుల పోరాటాల ప్రతిఫలం..

దాదాపు వందేళ్ల కిత్రం భారతదేశపు మహిళలు చదువులకు ప్రపంచ విజ్ఞానానికి దూరంగా ఉన్న విషయం తెలిసిందే. అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, జర్మనీలాంటి పెద్ద దేశాల్లోని మహిళలు కూడా ఇంటి నిర్వహణ మొదలుకొని చదువు, శిక్షణ, ఉద్యోగ ఎంపిక, పనిగంటలూ, వేతనాలు ..ఇలా అన్నింటా తీవ్ర వివక్షకు గురయ్యారు. ఎంత చదువుకున్నా మహిళ అనగానే చిన్నచూపు చూస్తున్నారనే బాధ వాళ్లను వెన్నాడింది. ఆర్థికంగా నిలదొక్కుకుంటే సమాజంలో గౌరవం లభిస్తుందనే విషయాన్ని గ్రహించారు. పంతంతో పోరాడి పెద్ద పదవులు అందకపోయినా చిన్నాచితకా పనుల్లో, పరిశ్రమల్లో కార్మికులుగా చేరారు. అలా 1908లో న్యూయార్క్‌లోని బట్టల మిల్లుల్లో పెద్దసంఖ్యలో మహిళా కార్మికులు పనిచేయడం మొదలుపెట్టారు. కానీ అక్కడి పరిస్థితులేవీ వారికి అనుకూలంగా లేవు. పనిగంటలూ ఎక్కువగా ఉండేవి. మరుగుదొడ్లులాంటి కనీస అవసరాలు ఉండేవికావు. అన్నీ సమస్యలే. ఎంత కష్టపడి పనిచేసినా వేతనాల్లో పురుషులతో పోలిస్తే ఎంతో తేడా ఉండేది. దీంతో మహిళా కార్మికులంతా నిరసనలు మొదలుపెట్టారు. దాదాపు 15000 మంది మహిళా కార్మికులు సరైన పనిగంటలూ, వేతనాలు, మహిళల ఓటు హక్కు అనే నినాదంతో న్యూయార్క్ రోడ్లపై మార్చ్ నిర్వహించారు. 1909లో అమెరికన్ సోషలిస్ట్ పార్టీ ఫిబ్రవరి 28న జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది.

అమెరికాలో జరిగిన ఈ ఉద్యమాల ప్రభావం చుట్టుపక్కల దేశాలకూ తాకింది. 1910లో కోపెన్‌హాగెన్‌లో జరిగిన సోషలిస్టు మీటింగుకు 17 దేశాల నుంచి 100 మందికి పైగా మహిళా ప్రతినిధులు హాజరయ్యారు. మహిళా సమానత్వం, అనుకూలమైన పని పరిస్థితులు, ప్రపంచవ్యాప్తంగా మహిళలకు ఓటు హక్కు.. అనే లక్ష్యాలతో ఏర్పడిందీ సదస్సు. మహిళల శక్తిని సంఘటితం చేయాలని, అందుకోసం ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన ఆవశ్యకత ఉందనీ గుర్తించిన తొలి సదస్సు ఇది. ఈ స్ఫూర్తితో మరుసటి ఏడాది డెన్మార్క్, ఆస్ట్రేలియా, జర్మనీ, స్విట్జర్లాండ్‌లలో మార్చి 19న మహిళా దినోత్సవాన్ని జరిపారు. దాదాపు పది లక్షల మంది స్త్రీపురుషులు మహిళా హక్కుల కోసం ర్యాలీలు నిర్వహించారు. ఓటుహక్కుతోపాటు చట్టసభల్లో స్థానం, ఉద్యోగాల్లో వివక్షను నిర్మూలించడం, అన్నింట్లో సమానావకాశాలను కల్పించాలని నినదించారు.

మహిళా కార్మికుల హక్కుల కోసం ఇండియాలోనూ 1914 నుంచే అనసూయా సారాభాయ్ నేతృత్వంలో ఉద్యమాలు ఊపందుకున్నాయి. మరోపక్క మొదటి ప్రపంచయుద్ధ సమయం కావడంలో..అక్కడి సైనికులంతా రణరంగానికి చేరడం మొదలుపెట్టారు. అలా 1913–14 సంవత్సరాల్లో యుద్ధానికి వ్యతిరేకంగా శాంతి నినాదాలతో రష్యాదేశంలోని ఆడవాళ్లంతా ర్యాలీలు చేపట్టారు. అప్పటికి అక్కడి మహిళలకు ఓటు లేదు. ప్రభుత్వాన్ని వాళ్లెవరూ ప్రశ్నించలేకపోయారు. యుద్ధం జరిగింది. 20 లక్షల మంది సైనికులు బలయ్యారు. రష్యా మహిళలు శాంతికోసం ఉద్యమం బాటపట్టారు. 1917 లో బ్రెడ్ అండ్ పీస్ పేరిట ఆహారం, శాంతి అంటూ నినదించారు. అది ఫిబ్రవరి చివరి ఆదివారం. ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా అక్కడి మహిళలంతా ఉద్యమించారు. నాలుగు రోజుల పాటు సమ్మె నిర్వహించారు. చివరికి ప్రభుత్వం దిగి వచ్చి, వాళ్ల డిమాండ్‌లను పరిష్కరించడంతోపాటు స్త్రీలకు ఓటుహక్కు ఇస్తున్నట్లు ప్రకటించింది. అప్పుడు జూలియస్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 23. మనం అనుసరించే గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం మార్చి 8. ఆ తరువాత దశాబ్దాల తరబడి ప్రపంచవ్యాప్తంగా మహిళా సాధికారత కోసం ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయి. వాటి ప్రభావ ఫలితంగా ఐక్య రాజ్యసమితి 1975 ను అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించింది. ప్రస్తుతం భారత్, అమెరికా, జపాన్, జర్మనీ, ఆస్ట్రేలియా లాంటి పెద్ద దేశాలు మొదలు ఉక్రెయిన్, ఉగాండా, కజకిస్తాన్‌లాంటి చిన్న దేశాలు కూడా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళాదినోత్సవం థీమ్ 'ప్రెస్‌ఫర్ ప్రోగ్రెస్'. అంటే మహిళలకు లింగ సమానత్వం కల్పించడం.



బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీద్దాం

మన తెలంగాణ/హైదరాబాద్ : ఈ నెల 12 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని తెలుగుదేశం శాసనసభాపక్షం నిర్ణయించింది. అసెంబ్లీలోని టిడిఎల్‌పి కార్యాలయంలో బుధవారం ఎంఎల్‌ఎలు సండ్ర వెంకటవీరయ్య, ఆర్.కృష్ణయ్య పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు ఎం. అమర్‌నాథ్ బాబులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతుల, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు, రిజర్వేషన్లు, దళితులు, బిసిలు, ఇతర కులవృత్తులు ఎదుర్కొంటున్న సమస్యలు, భూకుంభకోణాలు మొదలైన వాటిపై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించారు. ఈ విషయాలపై తప్పనిసరిగా సభలో చర్చలకు అనుమతించాలని, ప్రతిపక్షాలకు తగినంత సమయం కేటాయించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెవాలని ఈ విషయమై బిఎసి సమావేశంలో పట్టుబట్టాలని నిర్ణయించారు. భేటీ అనంతరం ఎంఎల్‌ఎ సండ్రవెంకటవీరయ్య మీడియాతో మాట్లాడుతూ రుణమాఫీ వడ్డీ భారం దరఖాస్తులు స్పీకర్‌కు సమర్పించామని ఇంతవరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. అలాగే పంట రుణాలు తీసుకున్న రైతులకు ఇవ్వాల్సిన వడ్డీ రూ. 500 కోట్లు ఇంతవరకు చెల్లించలేదని విమర్శించారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న బడ్జెట్‌లో కేటాయింపులు ఎంత ఉంటే ఏం లాభం అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ పనితీరును ఎండగడుతామన్నారు. ఈ సమావేశానికి ముందు మాజీ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి 18వ వర్ధంతి సందర్భంగా బషీర్‌బాగ్‌లోని ఆయన విగ్రహానికి టిడిపి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్‌భవన్‌లో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుచ్చిలింగం ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.



భార్గవి హంతకుడికి కఠిన శిక్ష



మన తెలంగాణ/ హైదరాబాద్ : యాదాద్రి జిల్లా మోత్కూర్ మండలం బుజిలాపురంలో రజక కులానికి చెందిన భార్గవిని హత్య చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ హోం మంత్రి నాయని నర్సింహారెడ్డికి రజక సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు సచివాలయంలో హోంమంత్రిని బుధవారం కలిసి వినతి పత్రం సమర్పించాయి. భార్గవి కుటుంబానికి రూ. పది లక్షల ఎక్స్ గ్రేషియా, ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని ప్రభుత్వం ఇవ్వాలని రజక సంఘం నేతలు కోరారు. హోం మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ రజక సంఘాల రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, ఏల్చల దత్తాత్రేయ, కలుకూరి రాములు,కోట్ల శ్రీనివాస్,చిలకరాజు చెన్నయ్య, సత్తు నాగయ్య, రఘుపతి, బాతరాజు శంకర్ తదితరులు ఉన్నారు.

'బిసి' తీర్మానాలకు ఆమోదం

మన తెలంగాణ / హైదరాబాద్: బిసి ప్రజాప్రతినిధుల సమావేశంలో రూపొందించిన 210 డిమాండ్లకు సంబంధించిన ముసాయిదా తీర్మానాలను వెంటనే ఆమోదించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వై.సత్యనారాయణ, గుజ్జకృష్ణ నేతృత్వంలో బుధవారం జరిగిన తెలంగాణ బిసి సంక్షేమ సంఘం కోర్‌గ్రూప్ సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బిసి శాసన సభ్యులు, ఎంపిల సమావేశంలో విస్తృతంగా చర్చించి ఈ డిమాండ్లను రూపొందించినట్లు తెలిపారు. విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక, కులవృత్తుల, రిజర్వేషన్ల అంశాలపై ఈసందర్భంగా చర్చ జరిపామని, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన శాసనసభ్యులు ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారని కృష్ణయ్య తెలిపారు. ఆర్థిక పరమైన అంశాలకు పరిమితి ఉన్నా రాజకీయ, సామాజికపరమైన అంశాలపై ముఖ్యమంత్రి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. బిసిలకు 50 శాతం రిజర్వేషన్లకు సంబంధించి కేంద్రంపై వత్తిడి తేవడానికి ముఖ్యమంత్రి కెసిఆర్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరారు ఈ సమావేశంలో బిసి నాయకులు ఎన్.వెంకటేశ్, కె.నర్సింహాగౌడ్, సి.రాజేందర్, భూపేష్ సాగర్, అనంతయ్య, జి.కృష్ణ, పి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మంత్రుల గుడ్ బై

(మొదటిపేజీ తరువాయి)

సాధ్యం కాదని తేలిపోవడంతో మంత్రులుగా కొనసాగడంలో అర్థం లేదన్న నిర్ణయంతోనే తమ పార్టీకి చెందిన ఇద్దరూ కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా చేస్తారని తెలిపారు. ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తేల్చి చెప్పడంతో పార్టీలోని అన్ని వర్గాలతో చర్చించి ఇక మంత్రివర్గంలో కొనసాగరాదన్న నిర్ణయం తీసుకున్నట్లు అమరావతిలో చంద్రబాబు పాత్రికేయుల సమావేశంలో బుధవారం రాత్రి స్పష్టం చేశారు. రాజీనామా విషయాన్ని ప్రధాని నరేంద్రమోడీకి ఫోన్ ద్వారా తెలియజేద్దామని ప్రయత్నం చేసినా అందుబాటులోకి రాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేంద్ర మంత్రివర్గంలో చేరామని, రాజకీయ ప్రయోజనాలు ముఖ్యం కాదని తేల్చి చెప్పారు. ప్రత్యేక హోదాతో పాటు రెవిన్యూ లోటును పూడ్చే విధంగా కేంద్రం ఆర్థిక సాయం ఇవ్వాలని తాను స్వయంగా 29 సార్లు ఢిల్లీ వెళ్ళి విజ్ఞప్తి చేశానని, మూడుసార్లు ప్రధానికి వివరంగా చెప్పానని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యేక హోదా అనేది ఉనికిలోనే లేదని, ఇప్పుడు మారిన పరిస్థితుల్లో ఇవ్వడం సాధ్యం కాదని అరుణ్‌జైట్లీ వ్యాఖ్యానిస్తూ ఒక రాష్ట్రానికి ఇస్తే మిగిలిన రాష్ట్రాలు కూడా డిమాండ్ చేస్తాయని పోలిక పెట్టడం సమంజసం కాదని, ఇది ఒక రకంగా అవమానించడమేనని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో కొనసాగుతున్న ఇద్దరు బిజెపి సభ్యులు రాజీనామా చేసే అంశాన్ని వారికే వదిలేస్తున్నానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అన్ని ప్రయత్నాలు చేసిన తర్వాత తమ విజ్ఞప్తుల్లోని యదార్థాన్ని గమనించి కేంద్రం న్యాయం చేస్తుందని ఇంతకాలం భావించామని, అది సాధ్యం కాదని బుధవారం సాయంత్రం జైట్లీ ప్రకటనతో స్పష్టం కావడంతో విధిలేని పరిస్థితుల్లోనే మంత్రివర్గం నుంచి వైదొలగాలని నిర్ణయించామని, తనకు ఎవ్వరిపైనా వ్యక్తిగత అసంతృప్తి లేదన్నారు. హేతుబద్ధత లేకుండా బలవంతంగా రాష్ట్ర విభజన జరిగిందని, అన్యాయానికి గురైన ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని కోరానని, తామేమీ గొంతెమ్మ కోర్కెలను కోరలేదని, అయినా కేంద్రం విచిత్రపు వాదనలతో తమ విజ్ఞప్తులను పెడచెవిన పెట్టిందని వ్యాఖ్యానించారు. కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు ఆదాయం తక్కువని, ఏ అవసరానికి ఏ మేరకు ఆర్థిక సాయం అవసరమో చాలా విపులంగా కేంద్రానికి చెప్పామని, అయినా 'ఇంతే ఇస్తాం' అంటూ జైట్లీ వ్యాఖ్యానించడం బాధాకరం మాత్రమే కాక రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని అన్నారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను గౌరవించకుండా 'సెంటిమెంట్లతో హోదా రాదు' అని జైట్లీ వ్యాఖ్యానించడం మరింత బాధేసిందన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వడం కేంద్రం హక్కు అని, తమ హక్కుల కోసమే నాలుగేళ్ళుగా నినదించామని, రెండు రోజులుగా పార్లమెంటు ఉభయ సభల్లో ఆందోళన చేస్తున్నామని తెలిపారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో బిజెపి భాగస్వామ్యం కూడా ఉన్నదని అన్నారు. మంత్రి పదవులు తమకు గొప్ప కాదని వ్యాఖ్యానించారు. కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం మంచిది కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసమనే కేంద్ర మంత్రివర్గంలో చేరామని, కానీ అది నెరవేరనందువల్లనే బైటకు రావాల్సి వస్తోందన్నారు. ఎన్నోసార్లు కేంద్రానికి నచ్చచెప్పే ప్రయత్నం చేశామని, చివరికి గౌరవప్రదంగా బైటకు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రత్యేక హోదాను, ఆర్థిక సాయాన్ని ఇతర రాష్ట్రాలతో పోల్చడం సరికాదన్నారు. ప్రత్యేక హోదా గురించి, విభజన చట్టం ప్రకారం ఇవ్వాల్సిన రాయితీల గురించి మాట్లాడకుండా సింపుల్‌గా తేల్చేయడం, 'రక్షణ రంగానికి నిధులు హెచ్చుమొత్తంలో కేటాయిస్తున్నందువల్ల ..' అంటూ జైట్లీ వ్యాఖ్యానించడం బాధేసిందన్నారు. రక్షణ రంగానికి కేటాయించిన నిధుల్ని తాము డిమాండ్ చేస్తున్నట్లుగా వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. పోలవరం ప్రాజెక్టు, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, రెవిన్యూ లోటు... ఇలా అనేక అంశాల్లో కేంద్రం నుంచి నిధులు అందాల్సి ఉన్నదని, వినియోగ ధృవీకరణ పత్రాలను సమర్పించినా నిధుల్ని మంజూరు చేయడానికి కేంద్రం ముందుకు రాలేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. టిడిపి కేంద్ర మంత్రుల రాజీనామా నిర్ణయంతో ఏపి కేబినెట్ నుంచి వైదొలగాలని బిజెపి నిర్ణయించింది. ఆ పార్టీ మంత్రులు మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస రావు గురువారం పదవులకు రాజీనామా చేస్తారని ఆ పార్టీ వెల్లడించింది.

కేంద్ర సిబ్బందికి 7% డిఎ

(మొదటిపేజీ తరువాయి)

అధికారిక ప్రకటన పేర్కొంది. పెంచిన ఈ కరువు భత్యం వల్ల 48.41 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 61.17 లక్షల పింఛనుదారులు ప్రయోజనం పొందనున్నారని ఆ ప్రకటన తెలిపింది. పెంచిన ఈ డిఎ, డిఆర్‌ల భారం భారత ప్రభుత్వ ఖజానాపై సంవత్సరానికి రూ. 60772.72 కోట్లు, 2018–19(జనవరి 2018 నుంచి ఫిబ్రవరి 2019 వరకున్న 14 నెలలకు) రూ. 7090.68 కోట్లు పడనున్నది. ఆమోదించిన ఫార్మూలా ఆధారంగానే ఈ పెంపుదల చేపట్టారు. 7వ వేతన సంఘమే ఈ ఫార్మూలాను సిఫార్సు చేసింది.

అప్పులు మీరిన రాష్ట్రం

- 2 లక్షల కోట్లు రుణం తీసుకున్న టిఆర్ఎస్ ప్రభుత్వం
- పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మనతెలంగాణ/సిరిసిల్ల: రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు డిసెంబర్‌లో నిర్వహించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలని పిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్సు యాత్ర సిరిసిల్లకు చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడారు. 70 యేళ్ల ప్రజాస్వామిక పాలనలో రాష్ట్రానికి 69 వేల కోట్ల రూపాయలు అప్పులు ఉంటే సిఎం కెసిఆర్ నాలుగేళ్ల పాలనలోనే 2 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి అప్పుల తెలంగాణ చేశారని విమర్శించారు. ఇసుక మైనింగ్ మంత్రిగా కెటిఆర్‌కు పగ్గాలిచ్చి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇసుకరీచ్‌ల కాంట్రాక్టులన్నీ కెసిఆర్ బంధువులకే ఇచ్చారన్నారు. ఒక్కో పర్మిట్ పై వందల ట్రిప్పుల ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని మీడియాలో కూడా వార్తలు వచ్చాయన్నారు. నేరెళ్లలో ఎరుకల భూమయ్య ఇసుక లారీ కింద పడి చనిపోతే స్థానికులు నిరసన వ్యక్తం చేస్తే ఎస్పీ స్వయంగా దళితులను అరెస్ట్ చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించాడని విమర్శించారు.అధికార యంత్రాంగం అంతా టిఆర్ఎస్ తొత్తులుగా మారారన్నారు. కెటిఆర్‌కు ఇసుక అక్రమ రవాణాలో వాటా ఉందని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ 2019లో అధికారంలోకి వస్తుందని టిఆర్ఎస్ నేతలు ఇప్పుడు కాంగ్రెస్‌తో వ్యవహరిస్తున్న మాదిరిగానే అధికారంలోకి వచ్చాక వారితో కూడా తాము అలాగే వ్యవహరిస్తామని హెచ్చరించారు. మంత్రి, జిల్లా ఎస్పీకి కూడా ప్రజల బాధలేమిటో తెలియజేస్తామన్నారు. సిరిసిల్ల ప్రజల సహకారంతో కెటిఆర్ శాసనసభ్యునిగా ఎన్నికై సిరిసిల్ల ప్రజలను పోలీసుల చేత చిత్రహింసలు పెట్టించడం సిరిసిల్ల ప్రజలకే కాక యావత్తు తెలంగాణ ప్రజలకు అవమానకరం అన్నారు. దీనికి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 40 వేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చి ఆంధ్రా కాంట్రాక్టర్ల దగ్గర 6 శాతం కమీషన్లు తీసుకుని వారికి కాంట్రాక్టులను అప్పగించడం నిజం కాదా అని నిలదీశారు. ప్రజా చైతన్యానికే కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్సు యాత్రను చేపట్టిందన్నారు. సిరిసిల్లలో కెటిఆర్‌ను ఓడించాలని కాంగ్రెస్ అభ్యర్థినే గెలిపించాలని పిలుపునిచ్చారు. కెటిఆర్ మంత్రి అయ్యాక 5 వేల పరిశ్రమలు మూతపడ్డాయని, ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కరువయ్యాయన్నారు. నెలా రూ. 3 వేల భృతి చెల్లిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ఆరు లక్షల మహిళా డ్వాక్రా సంఘాల్లో 70 లక్షల మంది సభ్యులున్నారని మహిళా సంఘాలకు తెరాస ప్రభుత్వం సహకరించడం లేదని 2000 కోట్ల రూపాయల నిధులు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు చెల్లించాల్సి ఉందన్నారు. అభయ హస్తం పెన్షన్‌ను రద్దు చేశారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభయహస్తాన్ని పునరుద్ధరిస్తామన్నారు. ప్రతి మహిళా సంఘానికి లక్ష రూపాయల రివాల్వింగ్ ఫండ్‌ను అందిస్తామన్నారు. ప్రతి మహిళా సంఘానికి రూ. 10 లక్షలు బ్యాంకుల నుండి రుణంగా ఇప్పించి వాటి వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. అభయహస్తం కింద ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల పెన్షన్ అందేలా చూస్తామన్నారు. రాష్ట్రంలోని 4200 మంది సెర్ప్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్సు యాత్ర ప్రారంభించగానే మంత్రి కెటిఆర్ కోదాడకు వెళ్లి తనపై అనేక అబద్ధాలు మాట్లాడారన్నారు. దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి పోరాటం చేసిన వాడినని మరోసారి తనపై అవాకులు చవాకులు పేలితే గట్టిగా స్పందిస్తానన్నారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి 22 నిమిషాల పాటు ప్రసంగించారు. అంతకుముందు చంద్రంపేట గ్రామం నుండి సుమారు 4 కిలోమీటర్ల మేర భారీ ర్యాలీని కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించాయి. బహిరంగ సభలో కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి వి హన్మంతరావు, శాసనమండలి కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్ అలీ, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ పార్లమెంట్ సభ్యులు పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్, శాసనసభాపక్ష కాంగ్రెస్ ఉపనేత టి జీవనరెడ్డి, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మన తెలంగాణ / హైదరాబాద్ : రైల్వేలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ (ఎస్‌సిఆర్‌ఇఎస్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.రాఘవయ్య డిమాండ్ చేశారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన కాచిగూడ రైల్వే స్టేషన్ ఎలక్ట్రిషియన్ ఎస్.మోహన్ కుటుంబానికి సంఘ్ తరపున రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని డాక్టర్ రాఘవయ్య బుధవారం అందజేశారు.ఈ కార్యక్రమంలోఎస్‌సిఆర్‌ఇఎస్ అధ్యక్షులు జి.ప్రభాకర్‌అంద్రూ, అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.భరణి భానుప్రసాద్, హైదరాబాద్ డివిజన్ అధ్యక్షులు కె.వి.ఆర్.ప్రసాద్, కార్యదర్శి కె.భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ రాఘవయ్య మాట్లాడుతూ రైల్వే శాఖ ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల ఉన్న ఉద్యోగులు అదనపు పనిభారంతో శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.మరోవైపుఉద్యోగులలో అభద్రతాభావాన్ని కలిగిస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై రైల్వే మంత్రిత్వ శాఖ కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలను నెలలు గడుస్తున్నా అమలు చేయకపోవడం అన్యాయమన్నారు.

అధికారులతో ఎర్రోళ్ల సమావేశం

మన తెలంగాణ/ హైదరాబాద్ : బాధ్యతలు స్వీకరించిన వెంటనే తెలంగాణ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పనిలో నిమగ్నమయ్యారు. దళిత, గిరిజన సంక్షేమాలకు సంబంధించిన వివిధ శాఖల కార్యదర్శులు, డైరెక్టర్లతో కమిషన్ బుధవారం సమావేశమైంది. బషీర్‌బాగ్ పరిశ్రమల భవన్‌లో బుధవారం జరిగిన సమీక్షలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాల కోసం అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అధికారులు సుదీర్ఘంగా వివరించారు.

మూడవ రోజూ కోటా పోరు

(మొదటిపేజీ తరువాయి)

విఫలమయ్యాయి. లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి, ఉపనేత వినోద్‌కుమార్,ఎంపీ కవిత, బాల్కసుమన్ తదితరులు పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. ఇదే సమయంలో కావేరీ జల వివాదంపై తమిళనాడు ఎంపీలు, ఏపీకి ప్రత్యేక హోదాకోసం ఆ రాష్ట్ర ఎంపీలు నిరసనలతో హోరెత్తించారు. అనంతరం సభను వాయిదా వేసిన స్పీకర్ సభకార్యక్రమాలు సజావుగా జరిగేందుకు అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి టీఆర్ఎస్ పార్టీ తరపున ఎంపి జితేందర్ రెడ్డి హాజరయ్యారు. రాజ్యసభ ఎంపి కె.కేశవరావు మీడియాతో మాట్లాడుతూ ఒక రాష్ట్రంలో ఎవరికి ఎంత రిజర్వేషన్లు ఇవ్వాలనేది ఆయా రాష్ట్రాలకు మాత్రమే తెలుసని, రాష్ట్ర అవసరాలు కేంద్రానికి తెలియవని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల విషయంలో దేశమంతటా ఒకే న్యాయం ఉండాలని, ఒక రాష్ట్రంలో 50శాతం కంటే ఎక్కువ, మరో రాష్ట్రంలో 50శాతం మాత్రమే ఉండడం న్యాయం కాదని అన్నారు. తెలంగాణాలో రిజర్వేషన్ల శాతం 50శాతానికి మించడానికి కేంద్రం అంగీకరించకపోడానికి కారణాలు ఏంటనే విషయం కేంద్రం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల శాతాన్ని రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా పెంచడానికి రాజ్యాంగ సవరణ చేయాల్సి వస్తే దానికి టీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. ఎంపీ వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ఉద్యోగాల నియామకాలలో 50శాతానికి మించి రిజర్వేషన్లను సుప్రీంకోర్టు అనుమతించిన దాఖలాలున్నాయని గుర్తుచేశారు. ఎం నాగరాజు, ఇతరులకు, కేంద్రం మధ్య కేసులో, అదేవిధంగా అశోక్‌కుమార్ అనే వ్యక్తికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య కేసులో 50శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వవచ్చని సుప్రీంకోర్టు తీర్పులిచ్చిన విషయాన్ని వివరించారు. ఈ తీర్పులను దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ రెండు ప్రత్యేక కమిటీలను నియమించారని తెలిపారు. షెడ్యూల్ తెగల రిజర్వేషన్లపై అధ్యయనానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్ చెల్లప్ప ఆధ్వర్యంలో, ముస్లింల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీ సుధీర్ ఆధ్వర్యంలో కమిటీలను నియమించారని చెప్పారు. అనంతరం ఎంపి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ...... బుధవారం మధ్యాహ్నం లోక్ సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ఆధ్వర్యంలో జరిగిన ఫ్లోర్ లీడర్ల సమావేశంలో తమ సమస్యపై చర్చించేందుకు అంగీకరించనంత వరకు సభా కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు సహకరించే ప్రసక్తి లేదని స్పష్టం చేసినట్లు తెలిపారు. సమగ్ర అధ్యయనం తర్వాత చెల్లప్ప కమిటీ ఎస్టీల రిజర్వేషన్‌ను 6% నుంచి 9.08 శాతానికి పెంచాలని సిఫారసు చేసిందన్నారు. సుధీర్ కమిటీ బీసీఈ గ్రూపులో ముస్లింలకు ప్రస్తుతమున్న రిజర్వేషన్‌కు అదనంగా 6% పెంచాలని సిఫారసు చేసిందని వెల్లడించారు. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితికి, తెలంగాణలో పరిస్థితికి మధ్య తేడా ఉందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీ జనాభా మొత్తంగా 7.11% ఉంటే తెలంగాణలో వారి జనాభా 9.08శాతంగా ఉందని వివరించారు.

వెనుకబడిన ముస్లింల జనాభా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 9.56% ఉంటే తెలంగాణలో 12.68% ఉందని పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఆర్థికంగా, సామాజికంగా అణగారిన వర్గాలకు సముచిత న్యాయం చేయడానికి సీఎం కేసీఆర్ రిజర్వేషన్లను 50% నుంచి 62 శాతానికి పెంచడానికి నిర్ణయించారని వివరించారు. దీనికి రాష్ట్ర చట్టసభలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో ఆమోదించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రిజర్వేషన్ల పెంపు, విభజన చట్టంలోని హామీలపై తాము కేంద్రంతో రాజీలేని పోరాటం చేస్తామని ఎంపీ జితేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఒక రాష్ట్రంలో రిజర్వేషన్లు 50శాతానికి మించరాదని రాజ్యాంగంలో ఎక్కడాలేదని ఎంపీ కవిత స్పష్టంచేశారు. సుప్రీంకోర్టు మాత్రమే ఒక తీర్పులో చెప్పిందని, పైగా అవసరమైనచోట 50శాతానికి మించి ఇవ్వవచ్చని తీర్పులు ఇచ్చిందని గుర్తుచేశారు. మైనార్టీలు అన్ని వర్గాల కంటే వెనుకబడి ఉన్నారని సచార్ కమిటీ నివేదిక వెల్లడించిందన్నారు.తమ రాష్ట్రంలో ప్రతిపాదించినవి మతపరమైన రిజర్వేషన్లు కావని, సామాజిక ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఇవ్వాలని నిర్ణయించినవేనని కవిత స్పష్టంచేశారు రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 ప్రకారం రిజర్వేషన్లపై కేంద్రానికి అధికారం ఉందని, దీన్ని సవరించి, రాష్ట్రాలకే రిజర్వేషన్లను నిర్ణయించే అధికారాన్నివ్వాలని ఆమె డిమాండ్ చేశారు. విభజనచట్టంలో తెలంగాణకు పారిశ్రామిక రాయితీలు కల్పించే విషయాన్ని కవిత ప్రస్తావించారు. విభజన చట్టంలోని హామీలు, రిజర్వేషన్ల పెంపు అంశాలపై తమ పోరాటం కొనసాగుతుందని ఆమె తేల్చిచెప్పారు.

గోప్యత

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తికి తెలియకుండా స్వయంగా కెసిఆర్ చూసుకుంటున్నారని అత్యంత సన్నిహితంగా ఉండే ఒకరు వివరించారు. ప్రత్యామ్నాయ ఫ్రంట్‌పై కెసిఆర్ ప్రకటన చేయడానికి నిమిషాల ముందు జరిగిన టిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సైతం ఈ అంశం ప్రస్తావనకు రాలేదని, ఒక్కసారిగా మీడియా సమావేశంలో ప్రధాన దృష్టిని ఈ అంశంపై కేంద్రీకరించడం చూసి తామే ఆశ్చర్యపోయాయమని పలువురు ఎంపిలు వ్యాఖ్యానించారు. కాంగ్రెసేతర, బిజియేతర పార్టీలను ఒక్క వేదిక మీదకు తీసుకురావాలన్న ఈ ప్రయత్నంలో మద్దతు పలికే విషయం బైటకు పొక్కుతుండడంతో ఆ రెండు పార్టీలు విచ్ఛిన్న కుట్రలకు పాల్పడతున్నాయనే అనుమానంతో పాటు ప్రలోభాలకు గురిచేసి ఫ్రంట్ ఆలోచన ఒక విఫల ప్రయోగం అని రుజువుచేసే తీరులో వ్యవహరించే ప్రమాదం లేకపోలేదన్న కారణాలతోనే ఈ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కావడానికి ఒక రోజు ముందు ఈ సంచలన ప్రకటన చేయడాన్ని పరిశీలిస్తే స్పష్టమైన అవగాహనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అర్థమవుతోందని ఆయన తెలిపారు. లోతైన అధ్యయనం తర్వాతనే ఇంతటి సంచలన నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నప్పుడు చేదోడువాదోడుగా ఉండాల్సిన కేంద్రం అనేక అంశాల్లో సానుకూలంగా స్పందించలేదని, కేంద్రం దయాదాక్షిణ్యాలపైనే రాష్ట్రాలు మనుగడ సాగించాలన్న ధోరణి కనిపించిందని, ఇది ఆరోగ్యకరం కాదని పలుమార్లు సిఎం వ్యాఖ్యానించారని ఆయన గుర్తుచేశారు. ఫ్రంట్ ఏర్పాటుకు వీలైనన్ని ఎక్కువ ప్రాంతీయ పార్టీల మద్దతును కూడగట్టి సంప్రదింపులన్నీ ఒక కొలిక్కి వచ్చేంతవరకు గోప్యంగానే ఉంచాలని భావిస్తున్నారు. ఫ్రంట్‌పై జాతీయ పార్టీలు ఎన్ని విమర్శలు చేసినా పట్టించుకోవాల్సిన అవసరం లేదనే తీరులో ప్రాంతీయ పార్టీలతో విస్తృతంగా చర్చలు జరిపి ఒక్క తాటిమీదకు తీసుకురావాలనే సిఎం భావిస్తున్నారని, రాష్ట్ర బడ్జెట్ సమావేశాల అనంతరం పూర్తిస్థాయి దృష్టి సారిస్తారని ఆ సన్నిహితుడు వ్యాఖ్యానించారు. అనేక ప్రాంతీయ పార్టీల్లో కేంద్ర ప్రభుత్వంపైనా, జాతీయ పార్టీలపైనా అసంతృప్తి, అసమ్మతి ఉన్నదని, కానీ ధైర్యం చేసి నోరు విప్పలేదని, సరిగ్గా ఇలాంటి సమయంలో కెసిఆర్ చేసిన సంచలన ప్రకటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని, దాన్నిబట్టి ఈ ఫ్రంట్ ఏ రకంగా ప్రకంపనలు సృష్టించిందో అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనేక ప్రాంతీయ పార్టీల మద్దతును కూడగట్టే క్రమంలో ఆ పార్టీల నాయకుల గురించి కెసిఆర్‌కు స్పష్టమైన అవగాహన ఉన్నదని, రాష్ట్రాన్ని సాకారం చేసుకున్న తెగువ ఇప్పుడు ఫ్రంట్ ఏర్పాటులోనూ ప్రతిబింబిస్తుందన్న నమ్మకం ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఒకవైపు ఫ్రంట్ రాజకీయాలతో పాటు మరోవైపు రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి రావడం, ఎమ్ఎల్ఎ, ఎంపి అభ్యర్థుల ఎంపికపై కూడా కెసిఆర్ దృష్టి ఉందని తెలిపారు. గతంలోలాగానే ఈసారి కూడా లోక్‌సభ, శాసనసభకు కెసిఆర్ పోటీచేస్తారని ధృవీకరించారు.

హోదా అనేదే లేదు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇష్టం లేకుండానే రాష్ట్ర విభజన జరిగిందని, దీంతో ఏపీ ఆదాయాన్ని కోల్పోయిందన్నారు. కొన్ని రోజుల పాటు రెవెన్యూ లోటును భర్తీ చేస్తామన్నారు. కొన్ని పరిణామాల వల్ల ప్రత్యేక హోదా అనే అంశం మనుగడలో లేదని, ప్రసుత్తం ప్రత్యేకహోదా ఉన్న రాష్ట్రాలు దేశంలో ఏవీ లేవన్నారు. రెవెన్యూ లోటు పూడ్చాలని విభజన చట్టంలో ఉందని, ఆంధ్రప్రదేశ్‌కు 90:10 నిష్పత్తిలో నిధులు సమీకరించాలని నిర్ణయించినట్టు చెప్పారు. రాష్ట్రం తీసుకొనే విదేశీ రుణాల్లోనూ 90శాతం కేంద్రమే చెల్లిస్తుందని చెప్పారు. పైన పేర్కొన్న నిష్పత్తిలోనే నిధులు ఇచ్చేందుకు కేంద్రం ఇప్పటికీ కట్టుబడి ఉందని తెలిపారు. ఏపీ కోసం ఎస్పీవీ లాంటి సంస్థలను ఏర్పాటు చేయాలని సూచించినట్టు తెలిపారు. తాము ఇస్తామన్న వాటితో పోలిస్తే ప్రత్యేక హోదా వల్ల ఏపీకి వచ్చేది చాలా తక్కువగా ఉంటుందని, హోదాతో సమకూరే ప్రయోజనాలు ప్యాకేజీలో ఇవ్వడానికి కేంద్రం నిరాకరించలేదని వివరించారు. 2014 నుంచి 2016 వరకు ఉన్న రెవెన్యూ లోటును లెక్కించాలని, దానికి మరో 10 నెలలు అదనంగా కలిపి లెక్కించాలని సూచించారు. ఇప్పటికే దాదాపు రూ.4వేల కోట్లు చెల్లించామని, ఇంకా అవసరమైన నిధులు చెల్లిస్తామని చెప్పారు. ఇంకా రెవెన్యూ లోటు కింద రూ.138 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. మొత్తం నిధులు లెక్కలు చేసే ఓపిక ఉండాలని సూచించారు. రాజకీయ లాభాలతో నిధుల కేటాయింపులు జరగవంటూ వ్యాఖ్యానించారు. 90: 10 నిష్పత్తికి ఆంధ్రప్రదేశ్ నూటికి నూరుపాళ్లు అర్హమైందేనని, ప్రత్యేక హోదా పేరు లేదు తప్ప దానితో వచ్చే ప్రతీ ప్రయోజనాన్ని కల్పిస్తున్నట్టు చెప్పారు. చట్టంలో చెప్పిన ప్రతి అంశానికీ తాము కట్టుబడి ఉన్నామని జైట్లీ మరోసారి స్పష్టం చేశారు. కేంద్రానికి 29 రాష్ట్రాలపైనా బాధ్యత ఉంటుందని, కేంద్రానికి అన్ని రాష్ట్రాలు సమానమేనన్నారు. పోలవరానికి ఇప్పటికే రూ.5వేల కోట్లు ఇచ్చినట్టు జైట్లీ మీడియాకు తెలిపారు.

కందిపోయిన రైతు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా అంతటికీ లక్షెట్టిపేట యార్డునే కేటాయించినందున మార్కెట్‌పై ఒత్తిడి విపరీతంగా పెరిగింది. దీంతో నిల్వలు తీసుకు వచ్చిన వాహనాలు మార్కెట్ యార్డు నుండి అటు ఊత్కూర్ చౌరస్తా, ఇటి ఐబి చౌరస్తా వరకు రోడ్డుకు ఇరు ప్రక్కన నిలిపారు. రోడ్డుపై వెళ్తున్న వాహనాలకు ఇబ్బంది కలుగటంతో పోలీసులు ట్రాఫిక్ జామ్ అదుపు చేశారు. మార్కెట్ కార్యదర్శి నెంబరింగ్ ఇవ్వని ఏ వాహనాన్ని కూడా పోలీసులు మార్కెట్‌లోకి అనుమతించకుండి చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా మండుటెండలో రైతులు ఉండటం ఇంకా కనీసం రెండు రోజులైనా కొనుగోళ్ల సమయం పెంచాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మార్కెట్ కార్యదర్శి సానియాని మీడియా వివరణ కోరగాఉన్నతాధికారులకు ఇక్కడి పరిస్థితి చెప్పామని వారి సూచన మేరకు నడుచుకోనున్నట్లు తెలిపారు. కొనుగోలు సమయం పెంచమని ఆదేశాలు వస్తే పెంచుతామన్నారు.

విగ్రహాగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

ధ్వంసం చేయడమంటే దేశాన్ని, ముఖ్యంగా పేదలను అవమానించినట్లేనని లోక్‌సభ కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ప్రజాస్వామ్యంలో అన్ని రకాల సిద్ధాంతాలు నమ్మే ప్రజలు ఉంటారు. కానీ బిజెపి వారు అసహనులుగా మారుతున్నారు అని ఆయన పార్లమెంటు బయట విలేకరులతో అన్నారు. పెరియార్‌గా ప్రసిద్ధులైన ఇవి రామస్వామి దళితుల, అణగారిన వర్గాల,దక్షిణాది రాష్ట్రం మహిళల అభ్యున్నతికి కృషి చేశారని, సామాజిక న్యాయం కోసం పోరాడారని ఆయన కీర్తించారు. ప్రభుత్వం తమ చేతిలో ఉందని బిజెపివారు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం సరికాదని ఆయన అన్నారు.తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన డెరెక్ ఓబ్రిన్ బిజెపిపై ధ్వజమెత్తుతూ వారు థర్డ్ క్లాస్ చేష్టలకు పాల్పడుతున్నారన్నారు. తదుపరి దేశంలోని ఇతర ప్రాంతాల్లోని విగ్రహాలను కూడా వారు విధ్వంసం చేసే అవకాశముందని ఆరోపించారు. సిపిఐ నాయకుడు డి. రాజా మాట్లాడుతూ పెరియార్ తమిళనాడుకే కాక, ప్రపంచానికి కూడా గొప్ప నాయకుడు, ఆత్మగౌరవం, హేతు ఉద్యమ వ్యవస్థాపకుడని, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడన్నారు. తమిళనాడులో శాంతిభద్రతలు సంఘ్, ఫాసిస్టు శక్తుల చేతుల్లోకి వెళుతోందని హెచ్చరించారు. బిజెపి జాతీయ కార్యదర్శి హెచ్. రాజా వ్యాఖ్యలపై బిజెపి అధిష్టానం వివరణ ఇవ్వాలని కూడా ఆయన కోరారు. ఇదిలా ఉండగా విగ్రహాల విధ్వంసంపై ప్రధాని మోడీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా అసంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే హెచ్. రాజాపై ఎలాంటి చర్య తీసుకోబోమని అమిత్ షా పార్లమెంటు బయట విలేకరులకు చెప్పారు.

కొనసాగుతున్న విగ్రహాల విధ్వంసం : త్రిపురలో లెనిన్ విగ్రహం, తమిళనాడులో పెరియార్ విగ్రహాల నుంచి మొదలైన విధ్వంస చర్యలు క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని మావానాలో రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కొందరు గుర్తు తెలియని దుండుగులు ధ్వంసం చేశారు. దీన్ని గుర్తించిన దళిత వర్గానికి చెందిన వారు నల్లజెండాలు చేతపట్టుకొని రోడ్లపైకి వచ్చారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని, అప్పటి వరకు నిరసన విరమిచేంది లేదని భీష్మించడతో అధికార వర్గాలు రంగంలోకి దిగాయి.వారితో చర్చలు జరిపి ఆ విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని నెలకొల్పుతామని హామీనివ్వడంతో వారు ఆందోళన విరమించుకున్నారు. కోల్‌కతాలో జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని కొందరు విద్యార్థులు ధ్వంసం చేశారు.జాదవ్‌పూర్ యూనివర్శిటీకి చెందిన విద్యార్థులుగా గుర్తించి ఆరుగురిని అరెస్ట్ చేశారు.విగ్రహానికి వెంటనే మరమ్మతు పను లు చేయ డం మొదలు పెట్టారు. కోయంబత్తూరులో పలువురుగుర్తు తెలియనవ్య క్తులు బిజెపి కార్యాలయంపై పెట్రోబాంబు దాడులకు పాల్పడ్డారు.ఈ ఘటనలో ఎవరికీ అపాయం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

ప్రధాని సహా ప్రముఖుల ఖండన : దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరుగుతున్న విగ్రహాల విధ్వంసపు చర్యలను ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రభుత్వం తరపున ఖండించారు. త్రిపుర, పశ్చిమబెంగాల్, తమిళనాడులలో జరిగిన ఘటనలు సిగ్గుచేటని వెంకయ్యానాయుడు అన్నారు. విగ్రహాలను ధ్వంసం చేస్తున్నవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధాని ఆదేశించారు. ఆయా ఘటనలపై మోడీ హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్రాల ప్రభుత్వాలకు హోంశాఖ సూచించింది. విగ్రహాల విధ్వంసం జరిగితే ఆయా జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిల బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఇలాంటి సున్నితమైన విషయాల్లో అన్ని రాజకీయ పార్టీలు సంయమనంతో వ్యవహరించాలని రాజ్‌నాథ్ సూచించారు. మరోవైపు పెరియార్ విగ్రహాలను కూల్చివేతపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన బిజెపి నేత హెచ్.రాజా విచారం వ్యక్తం చేశారు. తాను ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టును వెనక్కి తీసుకుంటున్నట్టు చెప్పారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మనతెలంగాణ/తిమ్మాపూర్: మహిళలు వంట ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. మహిళా అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండికాలనీలోని చాకలి ఐలమ్మ ప్రాంగణంలో బుధవారం మానకొండూర్ నియోజకవర్గ స్థాయిలో స్థానిక ఎంఎల్‌ఏ రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మగౌరవ సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్ , ఎంపి వినోద్ కుమార్, ఎంఎల్‌సి నారదాస్ లక్ష్మణ్ రావు, జడ్‌పి చైర్మన్ తుల ఉమ, మహిళా కార్పొరేషన్ చైర్మన్ గుండు సుధారాణి, కరీంనగర్ రూరల్ ఎసిపి ఉషారాణిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడారు. మహిళలు మహిళలకే శత్రువు అని నానుడు ఉందని అది మారాలన్నారు. మహిళా సార్థకత అంటే మనల్ని మనం సంస్కరించుకోవడమే అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు గౌరవంగా బతకడానికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని అవే షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలు అని వాటి గురించి వివరించారు. అలాగే ఆడ పిల్లలు భ్రూణ హత్యలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని అందుకు ప్రతి ఒక్క మహిళ కృషి చేయాలని కోరారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

మనస్తాపంతో జగిత్యాల యువకుడి ఆత్మహత్య




మనతెలంగాణ/జగిత్యాల టౌన్ : జగిత్యాల పట్టణం విద్యానగర్‌కు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉద్యోగం ఇప్పిస్తామని ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన వ్యక్తులు డబ్బులు తీసుకొని మోసగించడంతో మనస్తాపం చెందిన ఆ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాలకు చెందిన మేడిశెట్టి గంగామహేష్ (22) అనే యువకుడు ఎంబిఎ పూర్తి చేసి బెంగుళూర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆరు నెలలుగా ఆ కంపెనీ జీతాలు సరిగా చెల్లించకపోవడంతో ఇటీవలే హైదరాబాద్‌కు వచ్చాడు. హైదరాబాద్‌లో తన స్నేహితుల గదిలో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. అయితే ఆ కంపెనీకి చెందిన కొంత మంది వ్యక్తులు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పడంతో అందినకాడికి అప్పు చేసిన మహేష్ వారికి రూ.3,20,000 అందజేశాడు. డబ్బులు ముట్టజెప్పి ఆరు నెలలు గడుస్తున్నా సదరు కంపెనీకి చెందిన వ్యక్తులు ఉద్యోగం ఇప్పించకుండా రేపు, మాపు అంటూ మహేష్‌ను తిప్పుతుండడంతో తీవ్ర మనస్థాపానికి గురైతాను ఉంటున్న గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేష్ మృతి చెందిన వార్త తెలుసుకున్న తల్లి పద్మ మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చేందుకు ప్రయత్నించగా ఇంటి యజమాని మహేష్ మృతదేహాన్ని ఇంటికి తెచ్చేందుకు అనుమతించలేదు. దీంతో మహేష్ మృతదేహాన్ని నేరుగా స్మశానానికి తీసుకెళ్ళి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా మహేష్ తండ్రి రవీందర్ నాలుగు సంవత్సరాల క్రితం ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడగా తమ్ముడు అనూష్ ఓ బట్టల దుకాణంలో పని చేస్తున్నాడు. కాగా మహేష్ మృతి చెందిన వార్త తెలుసుకున్న బంధువులు స్మశానం వద్దకు వచ్చి రోధించడం అందరిని కలిచి వేసింది.

ఎంపిటిసి భర్త దారుణ హత్య



మనతెలంగాణ/గంభీరావుపేట: పాత కక్షలు భగ్గుమన్నాయి. ఏకంగా ఓ ఎంపిటిసి భర్తనే కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. కొత్తపల్లి ఎంపిటిసి బీనవేని చంద్రకళ భర్త దేవయ్య (42) గ్రామంలో టిఆర్‌ఎస్ నాయకుడిగా పేరు తెచ్చుకున్నాడు. సంఘటన రోజు దేవయ్య అదే గ్రామంలో ఓ విందుకు హాజరయ్యాడు. అదే విందుకు స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి కొడుకు సందీప్‌రెడ్డి సైతం హాజరయ్యాడు.విందులో దేవయ్యకు సందీప్‌కు మధ్య మాటామాటా పెరిగింది.దీంతో ఒక్కసారిగా సందీప్ ముందుగానే తన వెంట తెచ్చుకున్న కత్తితో దేవయ్య దాడి చేశారు.దేవయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా సందీప్ తండ్రి శ్రీనివాస్‌రెడ్డికి దేవయ్యకు మధ్య గతంలో కొన్ని వ్యక్తిగత వివాదాలు ఉన్నట్లు స్థానిక సమాచారం.తన తండ్రికి మృతునికి మధ్య ఉన్న పాతకక్షల మూలంగానే ఈ హత్య జరిగినట్లు తెలియ వచ్చింది. కాగా ఇది కక్ష్యతో చేసిన హత్యగా భావించిన కుటుంబ సభ్యులు తమకు న్యాయం జరిగేంత వరకు శవాన్ని పోస్టుమార్టంకు తరలించేది లేదని భీష్మించుకుకూర్చున్నారు. సమాచారం అందుకున్న ఎల్లారెడ్డిపేట సిఐ రవీందర్, గంభీరావుపేట ఎఎస్‌ఐ జాఫర్ షరీఫ్‌లు సంఘటనా స్థలంలో పరిశీలించి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు తల్లిదండ్రులు ఉన్నారు.

బాసరలో తండ్రీ, కొడుకుల హత్య



హత్యకు గురైన గోపీనాథ్, రతీశ్(ఫైల్)

మన తెలంగాణ/బాసర : నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని మంగళవారం అర్థరాత్రి గుర్తు తెలియని దుండగులు మారణాయుధాలతో తండ్రీకొడుకులను అతి కిరాతంగా హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది. బుధవారం ఉదయం సంఘటన స్థలానికి జిల్లా ఎస్‌పి విష్ణువారియర్ చేరుకొని విలేకర్ల సమావేశంలోమాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని వర్నపల్లి గ్రామానికి చెందిన రతీశ్(45), తండ్రి గోపినాథ్ (57) లు స్టార్ ఇన్ హోటల్‌ను నడిపిస్తున్నారు. మంగళవారం అర్థరాత్రివరకు హోటల్‌లోను నడిపించారు. హోటల్‌లో పనిచేస్తున్న మాధవ్ అనే యువకుడు కూడా తన పనిని ముగించుకొని ఇంటి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో హోటల్‌కు చేరుకోగా రక్తపు మడుగుల్లో ఉన్న హోటల్ యాజమని గోపినాథ్, రతీశ్‌లను చూసి బాసర ఎస్‌ఐ మహేశ్‌కి సమాచారం అందజేశాడు. దీంతో సంఘటన స్థలానికి చేరుకొని ఎస్‌ఐ, ముథోల్ సిఐ రఘుపతి మృతదేహాలను పరిశీలించారు. హోటల్‌లో ఉన్న సామాగ్రిని క్షుణ్ణంగా పరిశీలించి హోటల్‌లో అమర్చిన సీసీ కెమెరా, హార్డ్ డిస్క్‌లను తీసుకెళ్లారు. హోటల్‌లో ఉన్న కుక్క బోనులో బంధించి, తండ్రీకొడుకులిద్దరినీ కత్తులు, కొడవళ్లతో దాడి చేసి చంపారు.

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు ...

బాసర మండల కేంద్రంలో తండ్రి, కొడులను జంట హత్య చేసిన దుండగులను పట్టుకొనేందుకు నిర్మల్ జిల్లాకు చెందిన డాగ్ స్క్వాడ్ బృందం, క్లూస్ టీం పరిశీలించగా డాగ్‌స్క్వాడ్ దాదాపు మూడు కిలోమీటర్ల ట్రిపుల్‌ఐటి వరకు పరుగెత్తిన అనంతరం రైల్వే స్టేషన్ సమీపాన శివాజీ చౌక్‌లో అమర్చిన సీసీ కెమెరాలు సైతం వారి ఆధారాల మేరకు పరిశీలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నిర్మల్ డిఎస్‌పి దక్షిణమూర్తి, తానూరు, ముథోల్ ఎస్‌ఐ రాజన్న, రాజు ఉన్నారు.

దుండగులను త్వరలోనే పట్టుకుంటాం : ఎస్‌పి విష్ణు ఎస్ వారియర్

బాసరలో జరిగిన జంట హత్యల నేపథ్యంలో బాసర మండల కేంద్రంలో రైల్వే స్టేషన్ సమీపాన గల స్టార్ ఇన్ హోటల్‌లో తండ్రి, కొడుకుల హత్య పాతకక్షలా, ప్రేమ వ్యవహారమా అనే కోణంలో పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి విష్ణువారియర్ విలేకర్ల సమావేశంలో తెలిపారు. హత్య చేసినది ఎంతటి వారైన కఠినంగా శిక్షించే విధంగా చూస్తామన్నారు.

డాక్టర్ నిర్లక్ష్యంతో పసిపాప మృతి

మన తెలంగాణ/చెన్నూర్ : మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని కొత్త బస్టాండు ఏరియాలో గల ఒక ప్రైవేటు పిల్లల ఆసుపత్రిలో బుధవారం రాత్రి డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూడు నెలల వయసు గల పసిపాప మృతి చెందింది. కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన దాసరి మొండేష్, సౌజన్య దంపతుల రెండవ సంతానం మూడు నెలల పసిపాపకు గొంతులో నంజు రాగా బుధవారం సాయంత్రం ఆసుపత్రికి తీసుకొచ్చారు. కాగా పసిపాపకు ఇంజక్షన్ చేసిన అనంతరం గ్రామానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఈ విషయమై పసిపాప తండ్రి మొండేష్ విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ ఇంజక్షన్ చేసిన కొద్దిసేపటికే ఇంటికి వెళ్లే ప్రయత్నంలో కొద్దిదూరం వెళ్లగా పాపం శరీరం చల్లబడిపోయిందని, తిరిగి మళ్లీ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ అప్పటికే చనిపోయిందని చెప్పాడని ఆరోపించారు. బంధువులు, గ్రామస్తులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేసేందుకు యత్నించగా చెన్నూరు సిఐ కిషోర్ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట బందోబస్తు ఏర్పాటు చేశారు.

జైపూర్ ప్లాంట్‌లో ఆందోళన

చెన్నూర్-మంచిర్యాల రహదారిపై భూనిర్వాసితుల రాస్తారోకో, టవరెక్కి నిరసన



మనతెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి: జైపూర్ పవర్‌ప్లాంట్ భూనిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికులు గత మూడు రోజులుగా చేస్తున్న ఆందోళన కార్యక్రమాలుబుధవారం నాడు ఉద్రిక్తత పరిస్థితులకు దారి తీశాయి. కార్మికులు భూ నిర్వాసితులు పలు డిమాండ్లతో పవర్‌ప్లాంట్ ఎదుట ఆందోళన చేస్తుండగా టిఎన్‌టియుసి నాయకులు దీక్షలు చేపట్టారు. దీనిలో భాగంగా పోలీసులు మంగళవారం రాత్రి దీక్షలను భగ్నం చేసి, 32 మంది నాయకులు,కార్మికులు, భూనిర్వాసితులను అరెస్టు చేసి, వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించగా బుధవారం కార్మికులు అరెస్టులపై ఆగ్రహించారు. సమీపంలోనే ఉన్న బిఎస్‌ఎన్‌ఎల్ టవర్‌పైకి ఇద్దరు కార్మికులు ఎక్కి నిరసన తెలపడంతో పెద్ద ఎత్తున నాలుగు గ్రామాల ప్రజలు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అరెస్టు చేసిన వారిపై కేసులు ఎత్తివేయాలని, వారిని ఇక్కడికి తీసుకురావాలని డిమాండ్ చేయగా ఏసిపి సీతారాములు వారిని బెయిల్‌పై విడుదల చేసి తీసుకువచ్చారు. తమ డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించాలని కోరగా యాజమాన్యం వద్ద జరిగిన చర్చలు విఫలం కాగా భూనిర్వాసితులు మళ్లీ చెన్నూర్ – మంచిర్యాల రహదారిపై ఆరు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. వందలాది సంఖ్యలో భూ నిర్వాసితులు రోడ్డుపై బైఠాయించగా వారిని పోలీసులు అదుపు చేయలేకపోయారు. తహసీల్దార్ కిషన్ అక్కడికి చేరుకొని భూ నిర్వాసితులను శాంతింపజేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

పవర్‌ప్లాంట్‌లో శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని, ఫిక్స్‌డ్ వేతనాలు చెల్లించాలని, 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని, అర్హతలను బట్టి ఉద్యోగాలు ఇవ్వాలని నిర్వాసితులు, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఏసిపి సీతారాములు పవర్‌ప్లాంట్ యాజమాన్యంతో మాట్లాడి డిమాండ్లను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో భూనిర్వాసితులు ఆందోళన కార్యక్రమాలను విరమించారు.

టైర్ల షోరూంలో దోపిడీ

మనతెలంగాణ/వలిగొండ : మండల కేంద్రంలోని భువనగిరి నల్లగొండ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఎంఆర్‌ఎఫ్ టైర్ల షోరూం (నర్సింహ్మ ట్రేడర్స్)లో మంగళవారం అర్ధరాత్రి ఆగంతకులు షాపు షటర్లను ఇనుపరాడ్లతో, గడ్డపారలతో తొలగించి షాపులోని 6 పెద్దటైర్లను 60 బైక్‌టైర్లను అపహరించుకుపోయినట్లు షాపు యజమాని నర్సింహ్మ స్థానిక స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన యాదాద్రి భువనగిరి డిసిపి రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ దోపిడీ దొంగలు పక్క ప్రణాళికతో రాత్రి షాపు షటర్‌ను తొలగించి దోపిడి చేసినట్లు అనుమానం వ్యక్తం చేసి శాస్త్రీయ పరిశోధన ద్వారా దొంగలను అతి త్వరలో పట్టుకుంటామన్నారు. నేరస్తులను పట్టు కోవడానికి ఘటన స్థలానికి క్లూస్ టీం బృందాలు,వేలి ముద్రల నిపుణులను రంగంలోనికి దించి వివరాలను సేకరించామని,డాగ్‌స్కాడ్‌ను రప్పించి తనిఖీ చేయించారు. ఈ ఘటన స్థలాన్ని ఏసిపి రమేష్, సిఐ శ్రీనివాస్ పరిశీలించారు.

మూడో ఫ్రంట్ సంచలనం ఖాయం



మనతెలంగాణ/ నిజామాబాద్: బిజెపి, కాంగ్రెస్‌ల పాలనతో ప్రజలు విసిగిపోయారని, సిఎం కెసిఆర్ సారథ్యంలో దేశ రాజకీయాల్లో మూడవ ఫ్రంట్ సంచలనం సృష్టించడం ఖామయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే అత్యుత్తమ పథకాలైన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, భూ పంపిణీ పథకాలను అమలు చేస్తూ దేశ ప్రజల చూపు మళ్లించిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కిందని అన్నారు. అన్ని రాష్ట్రాల ప్రజలు, నాయకులు కెసిఆర్ పాలనకు కితాబు ఇస్తున్నారని ఆయన గుర్తుచేశారు. దేశంలో 14 పంటలకే కనీస మద్దతు ధర ఉందని, వాణిజ్య పంటకు స్థానం కల్పించలేదని, ఎరువులపై సబ్సిడీ ఎత్తి వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి నిర్ణయాలతో రైతుల ఆదాయం ఏ విధంగా రెట్టింపు అవుతుందని ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజనలో అనేక లోపాలున్నాయని,రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని ఆయన అన్నారు. దేశంలో 40 కోట్ల ఎకరాల సాగు యోగ్యమైన భూమి ఉండగా 60శాతానికి భూముల్లో వర్షాధార పంటలు సాగవుతున్నాయని వివరించారు. 20శాతం భూముల్లో బోరుబావులు, 20శాతం భూముల్లో ప్రాజెక్టులపై ఆధారపడి పంటలు సాగవుతున్నాయని తెలిపారు. దేశంలో ప్రతియేటా 70వేల టిఎంసిల నీరు అందుబాటులో ఉండగా 45వేల టిఎంసిల నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నీటిని సద్వినియోగపర్చుకోవడంపై కేంద్రం దృష్టి సారించకపోవడం శోచనీయమని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నగర మేయర్ ఆకుల సుజాత, జడ్పి చైర్మన్ ధఫేదర్ రాజు,టిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి

10 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్



మన తెలంగాణ/పెన్‌పహాడ్ : విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో యువ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగులపాటి అన్నారంలో మంగళ వారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు దూబని నాగయ్య (పోచాలు) గ్రామంలో తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు వరి పొలం సాగు చేస్తున్నాడు. తన సొంత పొలానికి మోటార్ ద్వారా నీటిని పెట్టడానికి వెళ్లి మెటార్ పెట్టి వంకరగా ఉన్న మోటార్ పైపును సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కాగా పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. భార్య గణిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విద్యుత్‌షాక్ గురై మృతి చెందిన నాగయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తల్లీ, కూతురు ఆత్మహత్య

మరో కూతురి పరిస్థితి విషమం

మన తెలంగాణ/నల్లగొండ ప్రతినిధి : భర్త రెండవ పెళ్లి చేసుకొని, తమను నిర్లక్ష్యం చేస్తున్నాడని భావించిన తల్లీ, ఇద్దరు కుమార్తెలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఇద్దరు కూతుళ్లు మొదటి కూతురు లతమ్మ(14), రెండవ కూతురు ప్రియాంక (11), తల్లి రాములమ్మ(35) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తల్లీ, చిన్నకూతురు అక్కడిక్కడే మరణించగా అపస్మారక స్థితిలో ఉన్న పెద్ద కూతురును హైద్రాబాద్ ఆసుపత్రికి తరలించారు. సిపిఐ కార్యకర్త, మాజీ ఉప సర్పంచ్ బొమ్ము అచ్చయ్యతో రాములమ్మకు 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. గత నాలుగేళ్ల క్రితం అచ్చయ్య అదే గ్రామానికి చెందిన మరో మహిళను వివాహం చేసుకున్నారు. పిల్లల ఆలనా, పాలనా చూడకపోవడంతో వారిపెంపకం బాధ్యత రాములమ్మపైనే పడింది. భర్త ప్రవర్తనతో మానసికంగా కుంగిపోయిన రాములమ్మ మంగళవారం సిపిఐ కార్యాలయానికి వెళ్లి తాను పురుగుల మందు తాగి ఇద్దరి కుమార్తెల చేత తాగించింది. తల్లీ, చిన్న కూతురు అక్కడిక్కడే మరణించగా, పెద్ద కూతురును చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. రాములమ్మ బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రొఫెసర్ కోదండరామ్

మన తెలంగాణ/మెదక్(చిన్నశంకరంపేట) : రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలని, పంటకయ్యే ఖర్చును భరించాలని, రైతు కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ(టిజెఎసీ) చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ డిమాండ్ చేశారు. బుధవారం నిరుద్యోగ రైతాంగ సమస్యలపై ఉద్యమ కార్యాచరణ సదస్సులో ఆయన మాట్లాడుతూ, రైతు సమన్వయ కమిటీలను రద్దు చేయాలన్నారు. రైతు ఆత్మహత్యలను నివారించి రైతాంగ సమస్యల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అప్పులు ఊబిలో కూరుకుపోయిన రైతంగం వ్యవసాయం చేయలేని స్థితిలో ఉన్నదని, రైతుల బాగు కోసం పాటుపడని కేంద్ర, రాష్ట్రాల తీరువలన రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారన్నారు. గుట్కా, సిగరెట్లు, మత్తు పానీయాలు ఉత్పత్తి చేసే ఉత్పత్తిదారులు కోటీశ్వరులైతే కడుపుకు అన్నం పెట్టే రైతన్న బిచ్చగాడిగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాది తప్పుకాదు ప్రభుత్వాలదే తప్పు అంటూ అందరు తప్పించుకునే వారే కానీ రైతును ఆదుకునేవారు లేరన్నారు. అనంతరం రైతాంగ సమస్యల పట్ల పలు తీర్మాణాలు చేశారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే మెదక్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని రైతులకు, కార్మికులకు ఇచ్చిన హామీని నేటికి నెరవేర్చలేదని, వెంటనే ఫ్యాక్టరీని తెరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. సింగూరు జలాలను సంగారెడ్డి, మెదక్ జిల్లాలకే పూర్తిగా ఉపయోగించాలన్నారు. కౌలు రైతుకు కూడా ఎకరానికి 4వేలు చెల్లించాలన్నారు. రైతులకు కార్పోరేటు స్థాయి ఉచిత వైద్య, విద్యను కల్పించడంతో పాటు వారి పండించే పంటకు ఉచిత బీమా కల్పించాలని, రైతులు పంట అమ్మిన తర్వాతనే గిట్టుబాటు ధరలు పెరుగుతున్నాయని, దాని వల్ల వ్యాపారులే బాగుపడుతున్నారన్నారు. రైతులు పండించే అన్ని పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతాంగ సమస్యల పట్ల చిత్తశుద్ధితో ప్రభుత్వాలు పనిచేయడం లేదని, రైతాంగ సమస్యల పట్ల తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టిజెఎసి జిల్లా చైర్మన్ సడిమెల యాదగిరి, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలుకూరి జనార్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుప్రభాత్‌రావు, యాదేశ్వర్, బాల్‌రాజ్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి, రాంరెడ్డి, శ్రీమాన్‌రెడ్డి, విద్యార్థి జెఎసి నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దేశం కెసిఆర్ వైపు చూస్తోంది

మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి

మన తెలంగాణ/జడ్చర్ల : దేశంలో తెలంగాణ రాష్ట్రాభివృద్ధి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని రాష్ట్ర మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లి ,స్టేషన్ తండ,బాదేపల్లి పట్టణంలో బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ పోరాడిసాధించిన తెలంగాణ రాష్ట్రాభివృద్ధి గత మునుపెన్నడు లేనంతగా అభివృద్ధి చెందిందని , మూడున్నరేళ్లలోనే 70 ఏళ్ల అభి వృద్ధి జరిగిందని తెలిపారు. ఈక్రమంలోనే ఆరోగ్య తెలంగాణ దిశగా చర్యలు తీసు కోవడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్‌బిఎస్‌కె పథకం క్రింద విద్యార్థుల ఆరోగ్యం పట్ల ముందస్తు చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. అదే విధంగా జిల్లాలో సాగునీటి ప్రాజెక్టు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూ రు చేయడంతో పాటు సాగునీటి కార్యక్రమాలకు చేయుత నివ్వడం జరుగుతుం దని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా టీఆర్‌ఎస్ అధ్యక్షుడు బాద్మి శివకుమార్,ఉమ్మడి జిల్లా జడ్పీటీసీల సంఘం అధ్యక్షులు పట్ల ప్రభాకర్‌రెడ్డి,మండల టీఆర్‌ఎస్ అధ్యక్షులు కోడ్గల్ యాదయ్య ,ఎంపీపీ లక్ష్మి శంకర్‌నాయక్,జడ్పీటీసీ జయప్రధ,కోప్షన్ ఇంతియాజ్,యువజన నాయకులు ప్రణీల్ చందర్,శ్రీకాంత్, శివదర్శన్, కావలి సత్యం,కొండల్,పిట్టల మురళీ,పర్వత్‌రెడ్డి,శివకుమార్,జగదీశ్వర్,శంకర్‌నాయక్‌లు పాల్గొన్నారు.

ట్యాంకు బండ్ పనులకు శ్రీకారం

జడ్చర్ల మండలం కావేరమ్మపేట శివారులోని నల్లచెర్వు మరమ్మతులకు మంత్రి లక్ష్మారెడ్డి భూమి పూజ చేశారు.దీన్ని ట్యాంకు బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీఆర్‌ఎస్ నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

అర్చకులకు ఒకే విధమైన వేతనాలు

ఆలయ అర్చక ఉద్యోగుల సంఘం డిమాండ్

మన తెలంగాణ / హైదరాబాద్/ ముషీరాబాద్ : ప్రభుత్వం విడుదల చేసిన జీవో.577లో ఉన్న లొసుగులను సవరించి, దేవాలయంతో సంబంధంలేకుండా ఒకే వేతనం, ఒకే విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఆలయ, అర్చక ఉద్యోగుల సంఘం జెఎసి ఛైర్మన్ గంగు భానుమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ ముషీరాబాద్‌లోని భవాని శంకర దేవాలయ ప్రాంగణంలో ఆలయ అర్చక ఉద్యోగుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కాండూరి కృష్ణమాచారి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన గంగు భానుమూర్తి మాట్లాడుతూ గత సంవత్సరం సెప్టెంబరులో జి.ఒ.577ను విడుదల చేసి, 5635 మంది ఆలయ, అర్చక ఉద్యోగులకుగాను కేవలం 788 మందికే ఒకే వేతన విధానాన్ని వర్తింప చేశారన్నారు. మిగిలిన 4,847 మందిని వదిలేశారన్నారు. అందరికి సమానంగా న్యాయం చేయాలన్నారు. సీఎం కేసిఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. మార్చి నెల వరకు వేచి చూస్తామని, అప్పటికి సీఎం కేసిఆర్ స్పందించకపోతే ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ అర్చక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రంగారెడ్డి, రాష్ట్ర నాయకులు నరేంద్ర ఆచార్య, షమిరెడ్డి, వెంకటేశ్వర శర్మ, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

నాలుగు కార్లు ఢీ

ఒకరు మృతి, ఐదు మందికి గాయాలు



మన తెలంగాణ/శామీర్‌పేట (మేడ్చల్ జిల్లా) : శామీర్‌పేట్ మండలంలోని రింగురోడ్డు వద్ద ఒక కారు రిపేర్‌కు రాగా, మెకానిక్ మరో కారులో వచ్చి పక్కన నిలిపి రిపేర్ చేస్తున్నాడు. అంతలోనే మరో కారు వచ్చి నిలిపి ఉన్న రెండు కారులను ఢీకొట్టింది. అది చూడడానికి వెళ్లిన మండలంలోని లాల్‌గడిమలక్‌పేట గ్రామపరిధిలోని ఆనంద్‌నగర్‌కు చెందిన లాల్జీ యాదవ్(50) తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన రాజీరెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి శ్రీను, అశోక్‌రెడ్డిలు చూస్తుండగా ఓ కారు టిఎస్09 ఇఎ 2421 అజాగ్రత, అతి వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన వారిని అల్వాల్ లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా లాల్జీ యాదవ్ మృతి చెందగా మరో ఐదు మందికి గాయాలయ్యాయి. ఒకే చోట నాలుగు కార్లు ఢీకొనడంతో రాజీవ్ రహదారి రింగురోడ్డు సూచిక బోర్డులు లేని మలుపు వద్ద బీభత్సంగా మారింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఎయిర్‌పోర్టులో బుల్లెట్ల కలకలం

మనతెలంగాణ/శంషాబాద్ : ఓ ప్రజాప్రతినిధి బుల్లెట్లను కల్గి విమాన యానం చేయడానికి యత్నించడం బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తీవ్ర కలకలం రేపింది. ఆర్‌జిఐఎ ఎస్‌ఐ ధనుంజయ్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లడానికి రామచంద్రారెడ్డి అనే వ్యక్తి యత్నించాడు. అయితే సిఐఎస్‌ఎఫ్ అధికారులు స్కానింగ్‌లో అతని వద్ద ఐదు బులెట్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతని అదుపులోకి తీసుకొని విచారించగా లైసెన్స్ ఉన్నట్లు తెలింది. అయితే విమానయానం చేసే వ్యక్తులు ఎవరైన సరే బుల్లెట్లను కల్గి ఉండకూడదన్నారు. దీంతో అతని వద్ద ఉన్న బుల్లెట్లను స్వాధీనం చేసుకుని వదిలివేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

మన తెలంగాణ/కార్వాన్: విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ లేబర్ దుర్మరణం పాలైన సంఘటన గోల్కొండ పోలీస్‌స్టేష న్ పరిధి టోలిచౌకిలో బుధవారం జరిగింది. గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధి టోలిచౌకి ప్రాంతానికి చెందిన చిన్నా (30) విద్యుత్‌శాఖ కాంట్రాక్టర్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. టోలిచౌ కి ప్రాంతంలోని 11 కెవి విద్యుత్ స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడం తో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే దు ర్మరణం పాలయ్యా డు. సమాచారం అందుకున్న గోల్కొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చిన్నా మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ శాఖ కాంట్రాక్టర్‌పై గోల్కొండ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నలుగురు బర్మా దేశస్థుల అరెస్టు



మన తెలంగాణ/వనస్థలిపురం : అక్రమంగా నగరంలోకి చొరబడి నకిలీ గుర్తింపు కార్డులు, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ కార్డులను ఏర్పాటు చేసుకుని తిరుగుతున్న నలుగురు బర్మా దేశస్థుల్ని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఎసిపి రవీందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. 2016లో మహ్మద్ హుస్సెన్ (20), రుజినా అక్తార్ (20), అరున్ హమీన్(25), నూర్ అలమ్(22) బర్మా దేశం నుంచి భారతదేశ సరిహద్దుల్లోని జమ్ముకాశ్మీర్ మీదుగా నగరంలోకి ప్రవేశించారు. నగరంలోని బాలాపూర్ ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. నకిలీ పత్రాల్ని సృష్టించి 2 గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందారు. స్థానికంగా ఉన్న జబ్బార్ అనే వ్యక్తి వీరి నుంచి రూ.15వేలు తీసుకుని ఉత్తర్‌ప్రదేశ్ నుంచి నగరానికి వచ్చినట్లు పత్రాలు సృష్టించి నకిలీ కార్డుల్ని ఇప్పించాడు. హమీద్ హుస్సేన్, రుజినా అక్తార్‌లకు ఓటర్ గుర్తింపు కార్డులు, అరుణ్ అమీన్‌కు నబీల్ కాలనీ బాలాపూర్ అడ్రస్‌తో డ్రైవింగ్ లైసెన్స్, నూర్ అలమ్‌కు బాలాపూర్ నుంచి ఆధార్ కార్డును ఇప్పించారు. సమాచారం మేరకు ఎల్బీనగర్ ఎస్‌ఒటీ పోలీసులు తనిఖీలు చేపట్టగా అక్రమ చొరబాటుదారుల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నకిలీ పత్రాలతో వీరికి గుర్తింపు కార్డులు ఇప్పించిన జబ్బార్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సైనికుడి పాత్రలో సోనూసూద్



'అరుంధతి' సినిమాలో 'వదల బొమ్మాళి...' అంటూ కరడుగట్టిన ప్రతినాయకుడి పాత్రలో తన నటవిశ్వరూపం చూపించాడు సోనూసూద్. ఆతర్వాత తెలుగులో మరికొన్ని చిత్రాల్లో విలన్‌గా తన టాలెంట్‌తో ప్రేక్షకులను అలరించాడు. అయితే ఈమధ్య కాలంలో అతనికి టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలో విలన్‌గా పెద్దగా అవకాశాలు రావడం లేదు. కాకపోతే క్యారెక్టర్ ఆర్టిస్టుగా మాత్రం సోనూకు డిఫరెంట్ రోల్స్ వెతుక్కుంటూ వస్తున్నాయి. ఆమధ్య జాకీచాన్‌తో కలిసి 'కంగ్‌ఫూ యోగా' అనే హాలీవుడ్ సినిమా లో నటించాడు సోనూసూద్. ఆతర్వాత 'అభినేత్రి' సినిమాలోనూ ఓ ఫుల్‌లెంగ్త్ క్యారెక్టర్ చేశాడు. ప్రస్తుతం విలన్ పాత్రలు రాకపోయినా నటుడిగా నిరూపించుకునే అవకాశాలు వస్తుండటంతో అతను ఎంతో ఆనందపడిపోతున్నాడు. సోనూసూద్‌కు ఎప్పటినుంచో ఒక్క సినిమాలోనైనా సైనికుడి పాత్ర చేయాలనే కోరిక ఉండేది. యుద్ధం నేపథ్యంలో చక్కటి దేశభక్తి సినిమాలు తీసే జె.పి.దత్తా దర్శకత్వం వహిస్తున్న 'పల్టాన్' సినిమాలో అతనికి సైనికుడి పాత్ర దక్కడం విశేషం. దీంతోపాటు కంగనారనౌత్ హీరోయిన్‌గా నటిస్తున్న చారిత్రక చిత్రం 'మణికర్ణికః ద క్వీన్ ఆఫ్ ఝాన్సీ', కన్నడలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పౌరాణిక చిత్రం 'కురుక్షేత్ర'లోనూ సోనూసూద్ నటిస్తున్నాడు. బ్యాడ్మింటన్ స్టార్ పి.వి.సింధు జీవితగాథతో తెరకెక్కే సినిమాలోనూ అతను ఓ ప్రత్యేకమైన రోల్ చేస్తున్నాడు. ఇవన్నీ నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు కావడం విశేషం.

మురిపించనున్న 'రంగమ్మ మంగమ్మ..'



రామ్‌చరణ్, సమంత జంటగా నటిస్తున్న 'రంగస్థలం' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మొదటి టీజర్‌లో చెవిటివాడైన చిట్టిబాబు క్యారెక్టర్‌లో రామ్‌చరణ్ ప్రేక్షకులను అలరించాడు. ఇక రెండో టీజర్‌లో రామలక్ష్మిగా సమంత మురిపించేసింది. ప్రస్తుతం ఈ సినిమా గురించి ఏ వార్త అయినా అది సోషల్ మీడియాలో వైరల్ అయిపోతోంది. ఎంత సక్కాగున్నవే..., రంగ రంగ రంగస్థలాన... అంటూ ఇప్పటికే విడుదలైన రెండు పాటలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండగా ఇప్పుడు మూడో పాటను విడుదల చేయడానికి సిద్ధమైపోయారు. 'రంగమ్మ మంగమ్మ...' అని సాగే ఈ పాటను గురువారం సాయంత్రం 6 గంటలకు విడుదల చేస్తున్నట్టు ఓ పోస్టర్ ద్వారా ఫిల్మ్‌మేకర్స్ తెలియజేశారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరపరిచిన ఈ పాట కూడా అదే రేంజ్‌లో హిట్ అయ్యే అవకాశాలున్నాయి. ఇక ఈ పోస్టర్‌లో రామ్‌చరణ్, సమంతలు ఎంతగానో ఆకట్టుకుంటున్నారు. సమంత పల్లెటూరి అమ్మాయిగా లంగా వోణిలో... పల్లెటూరి మాస్ అబ్బాయిగా గోల్డ్ చైన్‌లు వేసుకొని చరణ్ అదరగొట్టేస్తున్నారు. ఈ చిత్రంలో సమంత తన ట్రేడ్‌మార్క్ వయ్యారాలతో కనువిందుచేయనుంది. సినిమాలో ఈ జంట కెమిస్ట్రీ ప్రేక్షకులను మైమరపించనుంది.

'కిర్రాక్ పార్టీ' కాంటెస్ట్



నిఖిల్, సిమ్రాన్ పరీన్జ, సంయుక్త హెగ్డే, అప్ప, జాన్, మౌర్య, రాకేందు మౌళి

నిఖిల్, సిమ్రాన్ పరీన్జ, సంయుక్త హెగ్డే హీరోహీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'కిర్రాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో ఏటివి సమర్పణలో ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 16న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో అనిల్ సుంకర మాట్లాడుతూ ''ఈనెల 15న ఇంటర్ పరీక్షలు పూర్తవుతాయి. తర్వాత రోజున మా సినిమా విడుదలవుతుండటం ఆనందంగా ఉంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ కాంటెస్ట్‌ను నిర్వహిస్తున్నాం. సినిమాలో ఉపయోగించిన కారును ఈ కాంటెస్ట్‌లో గెలిచిన వారికి ప్రథమ బహుమతిగా అందజేస్తాం. అలాగే గురువారం నుండి రెండు రాష్ట్రాల్లో టూర్‌ను నిర్వహిస్తున్నాం. ఈనెల 10న విజయవాడలో ఆడియో వేడుకను నిర్వహిస్తాం. అదేవిధంగా 13న ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను నిర్వహించబోతున్నాం. శివ, హ్యాపీడేస్ తరహాలో పూర్తిస్థాయి కాలేజ్ నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇలాంటి నేపథ్యంలో సినిమా వచ్చి చాలా రోజులైంది కాబట్టి 'కిర్రాక్ పార్టీ' తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది. శరణ్ సినిమాను చక్కగా తెరకెక్కించాడు. చందు మొండేటి, సుధీర్‌వర్మలు సినిమాకు తమ వంతు సహకారాన్ని అందించారు''అని అన్నారు. హీరో నిఖిల్ మాట్లాడుతూ ''నా తొలి సినిమా 'హ్యాపీడేస్' తర్వాత పూర్తిస్థాయిలో కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా ఇది. ఇది నా 15వ సినిమా. నా కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచిపోయే చిత్రమిది. ఈ యూత్‌ఫుల్ మూవీ అందరికీ నచ్చుతుంది''అని చెప్పారు. దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి మాట్లాడుతూ ''తెలుగు ప్రేక్షకులకు నచ్చేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఈనెల 16న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం''అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిమ్రాన్ పరిన్జ, సంయుక్తా హెగ్డే, అప్పు, జాన్, మౌర్య, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా..

'ఈగ' ఫేమ్ సుదీప్ హీరోగా నిత్యామీనన్ హీరోయిన్‌గా కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో కన్నడ, తమిళ్ భాషల్లో రూపొందిన చిత్రం 'కోటిగొబ్బ2'. ఈ చిత్రం ఇటీవల విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి రూ.120 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ చిత్రాన్ని దుహర మూవీస్ పతాకంపై యువ నిర్మాత కళ్యాణ్ ధూళిపాళ్ల 'కోటికొక్కడు' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ చిత్రం శుక్రవారం అత్యధిక థియేటర్లలో విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో చిత్ర నిర్మాత కళ్యాణ్ ధూళిపాళ్ల మాట్లాడుతూ ''డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఇటీవల 'రచయిత' సినిమాను నిర్మించాను. ఈ చిత్రం నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇప్పుడు మా దుహర మూవీస్ బ్యానర్‌లో రెండో చిత్రంగా 'కోటికొక్కడు' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం. శుక్రవారంనాడు మా చిత్రాన్ని 300కు పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నాం''అని అన్నారు. దర్శకుడు వి.సముద్ర మాట్లాడుతూ ''సుదీప్ నేషనల్ హీరో. అతను చేసిన బెస్ట్ సినిమాలలో 'కోటికొక్కడు' ఒక్కటి. కె.ఎస్.రవికుమార్ నాకు చాలా ఇష్టమైన దర్శకుడు. ఇటీవల అతను 'జై సింహా'తో సూపర్‌హిట్ కొట్టాడు. నిర్మాతగా కళ్యాణ్ రెండో సినిమా 'కోటికొక్కడు' హిట్ కావాలని కోరుకుంటున్నాను''అని తెలిపారు. ఎస్.వి.ఆర్. మీడియా శోభారాణి మాట్లాడుతూ ''మంచి ప్యాషన్ ఉన్న నిర్మాత కళ్యాణ్. తన రెండో చిత్రంగా 'కోటికొక్కడు' చిత్రాన్ని విడుదల చేస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. కె.ఎస్.రవికుమార్ తెరకెక్కించిన ఈ చిత్రంలోని ప్రతి సన్నివేశం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుంది. సుదీప్ తండ్రిగా ప్రకాష్‌రాజ్ అద్భుతంగా నటించారు. యాక్షన్ సన్నివేశాలు అబ్బురపరిచే విధంగా ఉంటాయి. తెలుగులో కూడా ఈ చిత్రం పెద్ద విజయాన్ని అందుకోవాలి''అని చెప్పారు.



నిత్యామీనన్, సుదీప్

'శీలవతి' నాకెంతో స్పెషల్

జీ స్టూడియోస్ సమర్పణలో సాయిరామ్ దాసరి దర్శకత్వంలో షకీలా నటిస్తున్న 250వ చిత్రం 'శీలవతి'. రాఘవ ఎం.గణేష్, వీరు బాసింశెట్టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కేరళలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా షకీలా మాట్లాడుతూ ''ఈ చిత్రం నాకు చాలా స్పెషల్. నా 250వ చిత్రం 'శీలవతి'లో ఎంతో ప్రాముఖ్యత ఉన్న పాత్రలో నటిస్తున్నాను. నెక్స్ట్ సీన్ ఏంటి అనేది నాకు కూడా తెలియకుండా స్క్రీన్‌ప్లేను ప్లాన్ చేశాడు దర్శకుడు. నిర్మాతలిద్దరూ సినిమా కోసం ఏం కావాలన్నా అది అందించారు. మే నెలలో సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అని చెప్పారు. గీతాంజలి మాట్లాడుతూ ''షకీలాతో నాకిది రెండవ చిత్రం. యంగ్ టీమ్‌తో కలిసి పనిచేసిన సినిమా కాబట్టి చాలా వేగంగా షూటింగ్ పూర్తయింది. సినిమా చాలా బాగొచ్చింది''అని అన్నారు. నిర్మాత గణేష్ మాట్లాడుతూ ''మా బ్యానర్‌లో వస్తున్న మొదటి సినిమా ఇది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి''అని పేర్కొన్నారు. మరో నిర్మాత వీరు బాసింశెట్టి మాట్లాడుతూ ''ఇంతకుముందు రెండు సినిమాలకు నిర్మాతగా వ్యవహ రించినా... నాకు పూర్తి సంతృప్తినిచ్చింది మాత్రం ఈ చిత్రమే. అందరికీ నచ్చే విధంగా సినిమా తెరకెక్కింది''అని తెలిపారు. దర్శకుడు సాయిరామ్ దాసరి మాట్లాడుతూ ''ఈ సినిమా చూశాక ఇంతకుముందు ఉన్న షకీలా వేరు... ఈ షకీలా వేరు అని అంటారు. ఆమెకు అంత మంచి పేరొస్తుంది. సినిమా కోసం నిర్మాతలు పూర్తి సహకారాన్ని అందించారు''అని అన్నారు. ఈ కార్యక్రమంలో కెమెరామెన్ తరుణ్ కరమ్‌తోత్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది.



వీరు బాసింశెట్టి, షకీలా, రాఘవ ఎం.గణేష్, గీతాంజలి, సాయిరామ్ దాసరి



మంచు లక్ష్మి

'తుమ్హారీ సులు' తమిళ్ రీమేక్‌లో..

మంచి కథలకే నా ఓటు అని మొదటి నుంచి చెబుతున్న మంచులక్ష్మి అందుకు తగ్గట్టే సినిమాలను ఎంపికచేసుకుంటోంది. ప్రస్తుతం 'వైఫ్ ఆఫ్ రామ్' అనే ఓ కొత్త తరహా కథా చిత్రంతో రాబోతున్న లక్ష్మికి మరో మంచి ఆఫర్ వచ్చింది. అది కూడా తమిళ్‌లో. బాలీవుడ్‌లో సూపర్‌హిట్ అయిన 'తుమ్హారీ సు లు' అనే చిత్రాన్ని తమిళంలో రీమేక్ చే యనున్నారు. బాలీవుడ్‌లో విద్యాబాలన్ పోషించిన పాత్రను తమిళంలో జ్యోతిక చేయనుంది. ఈ సినిమాలో నేహాధూపియా క్యారెక్టర్‌కు మంచు లక్ష్మిని ఎంపికచేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ''బాలీవుడ్‌లో వచ్చిన 'తుమ్హారీ సులు' చిత్రాన్ని నేను చూడలేదు. కానీ నేహాధూపియా పాత్ర గురించి తెలిసింది. ఆమె పాత్ర చాలా స్టైలిష్‌గా ఉంటుంది. అలా చేయడానికి నాకు ఏ ఇబ్బంది లే దు. ఇప్పటికే చాలా డీగ్లామర్ పాత్రలు చేసి బోర్ కొట్టేసింది. అందుకే ఈ పాత్ర చేసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఈ ప్రాజెక్టులో నన్ను ఎంపిక చేసినందుకు సూర్య, జ్యోతికలకు థాం క్స్''అని అన్నారు. ఈ తమిళ చిత్రం మే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనుంది. ఇక 'వైఫ్ ఆఫ్ రామ్' సినిమాలో నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా నమ్మే ఒక విచిత్రమైన పాత్రలో మంచు లక్ష్మీ కనిపించనుంది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది.

నీతోనే హాయ్.. హాయ్



వేడుకలో శ్రీకాంత్, శివాజీరాజా, అరుణ్‌తేజ్, ఛరిష్మా శ్రీకర్, బి.యన్.రెడ్డి అభినయ, డా.జి.పార్థసారథి రెడ్డి

అరుణ్‌తేజ్, ఛరిష్మా శ్రీకర్ హీరోహీరోయిన్లుగా బి.యన్.రెడ్డి అభినయ దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'నీతోనే హాయ్..హాయ్'. కెఎస్‌పి ప్రొడక్షన్స్ పతాకంపై యలమంచిలి ప్రవీణ్ సమర్పణలో డా.ఎస్.కీర్తి, డా.జి.పార్థసారథి రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం హైదరాబాద్‌లోని ఫిలింనగర్ దేవాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో శ్రీకాంత్ ము హూర్తపు సన్నివేశానికి క్లాప్ నివ్వగా.. 'మా' అధ్యక్షుడు శి వాజీరాజా కెమెరా స్విచ్చాన్ చేశారు. సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావు గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు బి.యన్.రెడ్డి అభినయ మాట్లాడుతూ ''బాగా డబ్బున్నవారి వ్యక్తిత్వం ఎలా ఉంటుంది? మధ్యతరగతి కుటుంబానికి చెందినవారి మానవత్వం ఎలా ఉంటుంది? అనేది మా చి త్రం ద్వారా చూపిస్తున్నాం. క్యూట్ లవ్‌స్టోరీకి కమర్షియ ల్ ఎలిమెంట్స్ జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తాం. మూడు షెడ్యూళ్లలో సినిమాను పూర్తిచేయడానికి ప్లాన్ చేశాం. విదేశాల్లో పాట లు చిత్రీకరించాలన్న ఆలోచనలో ఉన్నాం'' అని అన్నారు. చిత్ర నిర్మాతలు డా.ఎస్.కీర్తి, డా.జి.పార్థసారథి మాట్లాడుతూ ''ఏ విషయంలోనూ రాజీపడకుండా సినిమాను గ్రాండ్‌గా నిర్మించడానికి దర్శకుడికి అన్ని విధాలుగా సహకరిస్తున్నాం. సినిమా కోసం ఐదు అద్భుతమైన పాటలను రవికళ్యాణ్ కంపోజ్ చేశారు. మా తొలి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాం''అని చెప్పారు. హీరో అరుణ్‌తేజ్ మాట్లాడుతూ '' తమిళంలో నేను ఒక చిత్రంలో నటించాను. ఆతర్వాత తెలుగులో 'చంద్రుడిలో ఉండే కుందేలు' చిత్రం చేశాను. తెలుగులో నేను నటిస్తున్న రెండో చిత్రమిది''అని అన్నారు. హీరోయిన్ ఛరిష్మా శ్రీకర్ మాట్లాడుతూ క్యూట్ లవ్‌స్టోరీతో రూపొందుతున్న ఈ చిత్రంలో నేను క్యూట్ క్యారెక్టర్‌లో నటిస్తున్నానని చెప్పారు. ఈ సమావేశంలో యలమంచిలి ప్రవీణ్, ఏడిద శ్రీరామ్, బెనర్జీ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ఆనంద్, బెనర్జీ, ఏడిద శ్రీరామ్, జయచంద్ర, రత్నప్రభ, శ్రీప్రియ, జబర్దస్త్ రామ్‌ప్రసాద్ తదితరులు ముఖ్య తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరాః ఈదర ప్రసాద్, సాహిత్యంః వెంకట బాలగోని, ప్రవీణ్, ఎడిటర్ః ఆనంద్ పవన్, కొరియోగ్రఫీః సాయిరాజ్.

నా కల నెరవేరింది

గోలిసోడా ఫిల్మ్ పతాకంపై విజయ్‌దేవరకొండ, శివానీ సింగ్ హీరోహీరోయిన్లుగా శ్రీధర్ మర్రి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏ మంత్రం వేసావె'. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రై.లి. అధినేత మల్కాపురం శివకుమార్ సమర్పిస్తున్న ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక శివానీ సింగ్‌తో ఇంటర్వ్యూ...



శివానీ సింగ్

◆ **మోడలింగ్ నుంచి నటనా రంగంలోకి...**

మా స్వస్థలం ఢిల్లీ. నాన్న ఏరోనాటికల్ ఇంజనీర్ కాగా అమ్మ టీచర్. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన తర్వాత మోడలింగ్‌లోకి అడుగుపెట్టాను. చాలా బ్రాండ్స్‌కు ప్రచారకర్తగా వ్యవహరించాను. ప్రస్తుతం కొన్ని రియాలిటీ షోస్‌కు వ్యాఖ్యాతగా చేస్తున్నాను. రంగస్థల కళాకారిణిగా చేసిన నేను సినిమాలపై ఆసక్తితో ముంబయ్‌లో అడుగుపెట్టాను.

◆ **అదృష్టం కలిసి రావడంతో...**

వెండితెరపై కథానాయికగా నన్ను నేను చూసుకోవాలనే కల 'ఏ మంత్రం వేసావె' చిత్రంతో నెరవేరింది. అదృష్టం కలిసిరావడంతో తొలి ప్రయత్నంలోనే ఈ సినిమాలో నటించే అవకాశం లభించింది.

◆ **నవతరం అమ్మాయిగా...**

ఈ సినిమాలో నేను తెలివైన, ధైర్యవంతురాలైన అమ్మాయిగా కనిపిస్తాను. నిజాయితీ, మంచితనం కలగలిసిన నవతరం అమ్మాయిగా నా పాత్ర ఉంటుంది. నా పాత్రలోని భావోద్వేగాలతో ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతారనే నమ్మకం నాకుంది.

◆ **నన్ను ఆటపట్టించేవాడు...**

వీడియోగేమ్, సోషల్ మీడియాకు అలవాటుపడిన యువకుడిగా విజయ్ దేవరకొండ కనిపిస్తారు. దానివల్ల అతనికి ఎదురయ్యే సమస్యల నేపథ్యంలో సినిమా సాగుతుంది. విజయ్‌తో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. చిత్రీకరణ సమయంలో నన్ను చాలా ఆటపట్టించేవాడు.

◆ **అర్థం చేసుకొని నటించాను...**

నాకు తెలుగు రాకపోయినా విజయ్‌దేవరకొండతో సహా టీమ్‌లోని ప్రతి ఒక్కరూ చక్కటి సహకారాన్ని అందించారు. హిందీ, ఇంగ్లీష్‌లలో నా డైలాగ్స్ రాసుకొని ప్రాక్టీస్ చేశాను. నా పాత్ర తాలూకు సంభాషణల్ని అర్థం చేసుకొని సినిమాలో నటించాను.

◆ **మంచి సందేశంతో...**

భారీ స్థాయిలో ఈ సినిమా విడుదల కావడం ఆనందంగా ఉంది. ఇక నేటి ఆధునిక జీవన శైలిలో సోషల్ మీడియా వాడకం తప్పనిసరిగా మారింది. అయితే వాటికి బానిస కాకూడదనే సందేశంతో ఈ చిత్రం తెరకెక్కింది.

◆ **ఆ ధైర్యం మహిళల్లో రావాలి...**

చిత్ర పరిశ్రమలోనే కాకుండా అన్ని రంగాల్లో మహిళలపై అన్యాయాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయి. వాటిని ఎదురించే ధైర్యం మహిళల్లో రావాలి. సమాజంలో అందరూ సమానమేననే భావనను పెంపొందించాలి. అప్పుడే సమాజంలో మార్పు వస్తుంది.

◆ **మహేష్ అంటే ఇష్టం...**

స్టార్ హీరోలు మహేష్‌బాబు, అక్షయ్‌కుమార్, హృతిక్ రోషన్ అంటే చాలా ఇష్టం. రాజ్‌కుమార్‌రావ్ నటన నచ్చుతుంది. అక్షయ్ కొత్త సినిమాలో నటించే విషయమై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. త్వరలో ఆ వివరాలు తెలియజేస్తాను.

యూరప్ జనరిక్ కంపెనీ వైపు టొరెంట్ ఫార్మా చూపు

న్యూఢిల్లీ: దేశీయ ఔషధ దిగ్గజం టొరెంట్ ఫార్మా మరో యూరోపియన్ జనరిక్స్ బిజినెస్ యూనిట్ కొనుగోలు చేయాలని యోచిస్తోంది. ఇటీవల యూనికెమ్ ల్యాబోరేటరీస్‌ను కొనుగోలు చేసిన టొరెంట్ కంపెనీ.. ఇప్పుడు సానోఫికి చెందిన జనరిక్ వ్యాపారం జెంటివా ఎన్‌విని సొంతం చేసుకోవాలనుకుంటోంది. దేశీయ ఐదో ఫార్మా దిగ్గజంగా పేరు తెచ్చుకున్న టొరెంటో ఫార్మాస్యూటికల్స్ జెంటివాను రూ.16వేల కోట్లకు టొరెంటో కొనుగోలు చేస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఈ కొనుగోలులో టొరెంటో విజయం సాధిస్తే, కంపెనీకి అతిపెద్ద లావాదేవీ ఇదే కానుంది. ఫండింగ్ కోసం ఇప్పటికే టొరెంటో పలు దేశీయ, విదేశీ బ్యాంకులతో భాగస్వామ్యం కూడా ఏర్పరుచుకుంది. 28 మార్చి వరకు అన్ని ఫండింగ్ అరెంజ్‌మెంట్లు కూడా పూర్తి కానున్నాయి. జెంటీవా ప్రస్తుతం యూరప్‌లో మూడో అతిపెద్ద జనరిక్స్ కంపెనీగా ఉంది. 50 మార్కెట్లలో జెంటివా తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. జెంటివాను కొనుగోలు చేయడం ద్వారా టొరెంట్ ఫార్మా తమ మార్కెట్‌ను మరింతగా విస్తరించుకోవచ్చని చూస్తోంది. రిలయన్స్ జియో టెలికామ్ రంగంలోకి ప్రవేశించిన తర్వాత పలు టెలికామ్ సంస్థలు విలీనం, స్వాధీనాలు చేపట్టాయి. ఇదే రీతిలో ఫార్మా రంగంలో పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మహిళా సాధికారతకు $170 మిలియన్లు


బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ప్రకటన



వాషింగ్టన్: అంతర్జాతీయ మహిళల దినోత్సవం సందర్భంగా బిఎల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ 170 మిలియన్ డాలర్ల విరాళం ప్రకటించింది. అంటే భారతీయ కరెన్సీలో రూ.11,03 కోట్లు అన్నమాట.. భారత్‌తో సహా నాలుగు దేశాల్లో మహిళల ఆర్థిక సాధికారత లక్ష్యంగా ఈ విరాళాన్ని ప్రకటించినట్టు సంస్థ వెల్లడించింది. లింగ సమానత్వం పెంపు, డిజిటల్ ఆర్థిక సమ్మేళనం వ్యాప్తి, ఉపాధి అవకాశాల పెంపు, వ్యవసాయ రంగానికి తోడ్పాటు, మహిళకు మద్దతుగా నిలిచే బృందాలు లక్ష్యంగా భారత్, కెన్యా, టాంజానియా, ఉగాండా దేశాల్లో ఈ నిధులను వినియోగించనున్నారు. ఒక మహిళ తన జీవితాన్ని తనకు తానుగా మరింత మంచిగా రూపొందించుకోవాలని బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్ కోచైర్ మెలిండా గేట్స్ అన్నారు. మహిళలు పొదుపులో నేర్పరులు అని అన్నారు. చేతుల్లో డబ్బు ఉంటే దాన్ని ఎలా ఖర్చు పెట్టాలి అనే అంశంపై అవగాహం కలిగి ఉంటారని, దీంతో వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. పురుషుల కంటే మహిళలు తక్కువ అని అనాదిగా వస్తున్న నిబంధనలను వారు మారుస్తారని చెప్పారు. నగదు లేదా మొబైల్ మనీ వంటి ఆర్థిక వనరుల విషయంలో మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తే, ఆ నిర్ణయాలు ఆమెపై, తన కుటుంబ సభ్యులపై మంచి ప్రభావాన్ని చూపుతాయి. దీని ద్వారా మహిళలు సాధికారిత సాధిస్తారని ఫౌండేషన్ పేర్కొంది. ఈ పెట్టుబడులు మహిళలు పూర్తిస్థాయిలో ఆర్థికవ్యవస్థలో పాలుపంచుకునే విధంగా సాయం చేస్తాయన్నారు. అంతేకాకుండా ఎన్నో ఏళ్లుగా మహిళలు వెనుకబడి ఉన్న వాటిల్లో అడ్డంకులు తొలగించేలా చేయొచ్చని ఫౌండేషన్ తెలిపింది.

ఆరో రోజూ నష్టాలు

మార్కెట్లను కృంగదీస్తున్న బ్యాంకింగ్



న్యూఢిల్లీ: వరుసగా ఆరో రోజు దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాలను నమోదు చేశాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో కుంభకోణం, అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల పరిస్థితులు మార్కెట్‌ను కృంగదీశాయి. సూచీలు మూడు నెలల కనిష్టస్థాయికి పడిపోయాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 284.11 పాయింట్లు నష్టపోయి 33033.09 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 95.05 పాయింట్లు నష్టపోయి 10154.20 వద్ద స్థిరపడింది. గతేడాది డిసెంబర్ 7 తర్వాత స్టాక్ సూచీలు ఈ స్థాయిలో ముగియడం ఇదే. సెన్సెక్స్ 32,991 నుంచి 33,331 మధ్య శ్రేణిలో కదలాడింది. కీలకమైన నిఫ్టీ బ్యాంక్ సూచీ 314 పాయింట్లు నష్టపోయి 24,134 వద్ద ముగిసింది. ఇక రంగాల వారీగా చూస్తే ఒక్క ఎఫ్ఎంసిజి సూచీ 0.65 శాతం లాభపడగా.. మిగతా అన్ని సూచీలు నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్ షేర్ల పతనం మార్కెట్‌ను దెబ్బతీసింది. పిఎన్‌బి కుంభకోణం దర్యాప్తు వేగవంతం కావడంతో బ్యాంకింగ్ షేర్లు భారీగా పతనమయ్యాయి. ముఖ్యంగా బ్యాంకింగ్ దిగ్గజ షేర్లైన ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి, ఎస్‌బిఐ షేర్లు పతనం సూచీలపై ప్రభావాన్ని చూపాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్ స్టీలుపై దిగుమతి సుంకం పెంపు ప్రకటన దేశాల మధ్య వాణిజ్య యుద్ధానికి దారితీయనుందనే ఆందోళనలు నెలకొన్నాయి. ట్రంప్ ప్రధాన ఆర్థిక సలహాదారు రాజీనామా చేశారన్న వార్తలతో వాణిజ్య యుద్ధం ఉధృతమవుతున్న భయాలు మార్కెట్లో ఏర్పడ్డాయి. దీంతో ఆసియా సూచీలు నష్టాలతో ముగిసాయి. అలాగే యూరోపిన్ మార్కెట్ల నష్టాల ప్రారంభం మరింత దెబ్బతీసింది. చివర్లోనూ ఇన్వెస్టర్ల అమ్మకాల కొనసాగడంతో మార్కెట్ వరుసగా ఆరో రోజూ నష్టాలతోనే ముగిసింది. అయితే ఏసియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, జి లిమిటెడ్, ఐటిసి, హెచ్‌సిఎల్ షేర్లు లాభపడ్డాయి.

యువ బిలియనీర్

ఫోర్బ్స్ జాబితాలో పేటిఎం వ్యవస్థాపకుడు శేఖర్ శర్మకు చోటు



న్యూఢిల్లీ: డిజిటల్ వ్యాలెట్ సంస్థ పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్(39) శర్మ ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకున్నారు. భారత యువ కుబేరునిగా నిలిచారు.. అయితే దేశంలో అత్యంత వృద్ధ కుబేరునిగా ఎమెరిటస్ అల్కేమ్ లాబొరేటరీస్ ఛైర్మన్ సంప్రదాసింగ్(92) ఉన్నారు. ఫోర్బ్స్ వెల్లడించిన వివరాల ప్రకారం, 1.7 బిలియన్ డాలర్లతో పేటీఎం అధినేత 1,394వ ర్యాంక్‌లో నిలిచారు. ఇక భారత్ నుంచి 40 ఏళ్లలోపు వయసున్న బిలియనీర్ ఆయన ఒక్కరే కావడం విశేషం. భారత్‌లో పెద్దనోట్ల రద్దు అనంతరం పేటీఎం ఆధరణ పెరిగింది. డిజిటల్ లావాదేవీల కోసం ఎక్కువగా పేటీఎంను ఆశ్రయించడంతో కంపెనీ అత్యంతగా లాభపడింది. ఆ సమయంలో 250 మిలియన్ రిజిస్టర్ యూజర్లతో రోజుకు 7 మిలియన్ల లావాదేవీలు జరిగాయి. 2011 సంవత్సరంలో పేటీఎంను శర్మ స్థాపించారు. ఆ తర్వాత వ్యాపారాన్ని విస్తరించడంతో పెద్ద సంస్థగా అవతరించింది. పేటీఎం మాల్, ఇ–కామర్స్ బిజినెస్, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌లను సృష్టించారు. శర్మకు పేటీఎంలో 16 శాతం వాటా ఉంది. ఇప్పుడు పేటీఎం విలువ 9.4 బిలియన్ డాలర్లకు చేరింది అని ఫోర్బ్స్ వెల్లడించింది. ఫోరబ్స్ జాబితాలోని మొత్తం 2,208 బిలియనీర్లలో 40 ఏళ్ల లోపువారు కేవలం 63 మంది ఉన్నారు. వీరి మొత్తం సంపద 265 బిలియన్ డాలర్లుగా ఉంది. గత ఏడాది 208 బిలియన్‌డాలర్లతో పోల్చుకుంటే ఈసారి పెరిగింది. ఇక ఎమెరిటస్ అల్కేమ్ లాబొరేటరీస్ ఛైర్మన్ అయిన 92 ఏళ్ల సంప్రదాసింగ్ భారత్‌లో వృద్ధ బిలియనీర్‌గా నిలిచారు. ఆయన సంపద 1.2 బిలియన్ డాలర్లుగా ఉంది.

జెట్, ఇండిగో, స్పైస్‌జెట్‌లపై జరిమానా

కార్గో రవాణా చార్జీలను సవరించినందుకు సిసిఐ చర్యలు



న్యూఢిల్లీ: జెట్ ఎయిర్వేస్, ఇండిగో, స్పైస్‌జెట్ వంటి మూడు విమానయాన సంస్థలపై సిసిఐ(కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా) రూ.55 కోట్ల జరిమానా విధించింది. ఇంధన సర్‌చార్జీలను సవరించారనే ఆరోపణలు రావడంతో ఈ చర్యలు చేపట్టింది. ఎఫ్ఎస్‌సి(ఫ్యూయెల్ సర్‌ఛార్జీ) రేట్లలో తప్పుడు విధానాలు అవలంభించినందుకు గాను ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్(ఇండిగో పేరెంట్ కంపెనీ), స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా, గో ఎయిర్‌లైన్స్ సంస్థలపై ఇండియా ఎక్స్‌ప్రెస్ ఇండస్ట్రీస్ కౌన్సిల్ కేసు దాఖలు చేసింది. ఈమేరకు సిసిఐ ఆదేశాలు జారీ చేసింది. సిసిఐ పేర్కొన్న ప్రకారం, ఇండిగో, జెట్ ఎయిర్వేస్, స్పైస్‌జెట్‌లు రేట్ల విషయంలో తప్పుడు విధానాలను చేపట్టాయి. ఈమేరకు జెట్ ఎయిర్వేస్‌పై రూ.39.8 కోట్లు, ఇండిగోపై రూ.9.5 కోట్లు, స్పైస్‌జెట్‌పై 5.1 కోట్లు జరిమానా విధించినట్టు సిసిఐ ప్రకటించింది. అయితే సిసిఐ జరిమానాపై ఈ విమానయాన సంస్థలు ఎలాంటి ప్రకటన చేయలేదు.

అన్ని బ్యాంకుల్లో ఏకరీతి రుణ నిబంధనలు

జువెలరీ ఎక్స్‌పోర్ట్ బాడీ సూచనలు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) కుంభకోణం వంటి ఉదంతాలు పునరావృతం కాకుండా నిరోధించేందుకు జిజెఇపిసి(జెమ్స్ అండ్ జువెలరీ ఎగుమకి ప్రోత్సాహక మండలి) కొన్ని సూచనలు చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకుల్లో ఏకరీతి రుణ నిబంధనలు చేపట్టాలని సూచించింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ మండలి తాజాగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖకు సిఫారసులు చేసింది. ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి జిజెఇపిసి పంపిన లేఖలో.. జువెలరీ సంస్థలకు రుణాలను ఇవ్వడంలో ఏకరీతి నిబంధనలు పాటించాలని, అన్ని బ్యాంకుల చీఫ్‌లకు ఈమేరకు సూచనలు చేయాలని పేర్కొంది. దేశంలో 43 బిలియన్ డాలర్ల డైమెండ్ జువెలరీ వ్యాపారం అంటే 95 వ్యాపార సంస్థలకు జిజెఇపిసి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ సంస్థలో 6500 మంది సభ్యులు ఉన్నారు. నగల సంస్థలకు రుణాల నిబంధనల్లో బ్యాంకుల్లో తేడాలు ఉన్నాయని, పిఎన్‌బిలో మోసం నేపథ్యంలో ఈ నిబంధనల్లో తక్షణమే మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉందని మండలి సూచించింది. సిబిఐ, ఇడి ఏజెన్సీలు.. విదేశాలకు పారిపోయిన నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీలను ఎక్కడ ఉన్నారో గుర్తించే పనిలో ఉన్నాయి.

ఎస్ఎఫ్ఐఒ ఎదుట హాజరైన పిఎన్‌బి చీఫ్ సునీల్ మెహతా

న్యూఢిల్లీ: డైమండ్ వ్యాపారి నీరవ్ మోడీ కుంభకోణం కేసులో పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎండి సునీల్ మెహతా బుధవారం ఎస్ఎఫ్ఐఒ(సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్ట్‌గేషన్ ఆఫీస్) ఎదుట హాజరయ్యారు. ఆయనతో పాటు ఇప్పటికే యాక్సిస్ బ్యాంక్ , ఐసిఐసిఐ బ్యాంక్ సిఇఒలు కూడా ఎస్ఎఫ్ఐఒ వద్ద హాజరయ్యారు. రూ.12,636 కోట్ల పిఎన్‌బి మోసం కేసులో మెహతాకు ఎస్ఎఫ్ఐఒ సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో మరో 31 మంది బ్యాంకు అధికారులకు కూడా నోటీసులు జారీ చేయనున్నట్టు తెలుస్తోంది. ఈ బ్యాంకులు కూడా నీరవ్‌మోడీ, మెహుల్ చౌక్సీలకు భారీగా అవకాశాలను ఇచ్చినట్టు ఎస్ఎఫ్ఐఒ భావిస్తోంది. ఇప్పటికే ఈ కేసులకు సంబంధించి 12మందిని సిబిఐ అరెస్టు చేసింది.

రూ.1,000 కోట్లను రాబట్టుకోవడమే అసాధ్యం

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో భారీ రుణం మోసం కేసులో రూ.1,000 కోట్లను రాబట్టుకోవడమే అసాధ్యమని బ్యాంకింగ్ నిపుణులు తేల్చారు. ఈ కేసును ఎస్ఎఫ్ఐఒ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. సహకరించేందుకు గాను రెండు ప్రైవేటు బ్యాంకుల అధికారుల బృందాన్ని ఏర్పాటు చేశారు. నీరవ్ మోదీ, గీతాంజలి జ్యువెలర్స్‌కు సంబంధించిన పత్రాలను ఈ బృందం పరిశీలిస్తున్నారు. అయితే ఈ కుంభకోణంలో రూ.1,000 కోట్లను రాబట్టుకునే అవకాశమే లేదని తేల్చారు. నీరవ్ మోడీ సంస్థ ఫైర్‌స్టార్ డైమండ్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు విచారించి.. మార్చి 19లోపు సమాధానం ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కి నోటీసులు జారీ చేసింది. నీరవ్ మోడీకి చెందిన చరాస్తులను ఇడి స్వాధీనం చేసుకుని పిఎన్‌బికి అప్పగించిందని, సదరు ఆస్తులను మళ్లీ అప్పగించాలని కోరింది. ఇడి తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ సందీప్ సేత్, న్యాయవాది అమిత్ మహాజన్ హాజరయ్యారు. ఫైర్‌స్టార్ డైమండ్స్‌కు సంబంధించిన పత్రాలు, సెర్చివారెంట్ కాపీని తమకు ఇవ్వాలని ఈ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది.



టెలికామ్ రంగానికి రిలీఫ్ ప్యాకేజీ

ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్



న్యూఢిల్లీ: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న టెలికామ్ రంగానికి ఊరట లభించింది. కేంద్ర కేబినేట్ బుధవారం సమావేశమై టెలికామ్ రంగానికి రిలీఫ్ ప్యాకేజీని అందించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయి. వేలంలో స్పెక్ట్రమ్ కొనుగోలు చేసిన టెలికామ్ సంస్థలకు చెల్లింపులో మరికొంత సమయం ఇవ్వాలని నిర్ణయించాయి. తీవ్ర అప్పుల్లో కూరుకుపోయిన టెలికాం రంగాన్ని పునరుద్ధరించాలని అంతర్గత మంత్రిత్వ శాఖల బృందం(ఐఎంజి) ఇటీవల కేబినెట్‌కు సిఫారసు చేసింది. ఈమేరకు కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు అధికార వర్గాల సమాచారం. ఇందులో భాగంగా స్పెక్ట్రమ్ చెల్లింపుల గడువును పెంచాలని కేబినెట్ నిర్ణయించింది. ప్రస్తుతం వేలం ద్వారా స్పెక్ట్రమ్‌లను కొనుగోలు చేసిన టెలికాం ఆపరేటర్లు ఆ మొత్తాన్ని 10ఏళ్లలోగా చెల్లించాల్సి ఉంది. ఈ గడువును 16ఏళ్లకు పెంచాలని ఐఎంజి కేబినెట్‌కు సిఫారసు చేసింది. దీనికి టెలికాం శాఖ ఓకే చెప్పినట్టు తెలుస్తోంది.

ఎస్‌బిఐపై రూ.40 లక్షల జరిమానా



న్యూఢిల్లీ: నకిలీ నోట్ల తనిఖీ, స్వాధీనంపై ఆదేశాలను పాటించనందుకు గాను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాపై ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) రూ.40 లక్షల కోట్ల జరిమానా విధించింది. 2018 మార్చి 1న ఆర్‌బిఐ ఈ జరిమానా విధించింది. తాము జారీ చేసిన ఆదేశాల మేరకు ఎస్‌బిఐ నకిలీ నోట్ల తనిఖీ, స్వాధీనంపై చర్యలు చేపట్టలేదని ఆర్‌బిఐ పేర్కొంది. ఈమేరకే రిజర్వు బ్యాంక్ జరిమానా విధించినట్టు అధికారులు తెలిపారు.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33033.09	–284.11	–0.85%
నిఫ్టీ	10154.20	–95.05	–0.93%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29280	31315.51	0.65%
ముంబై	29920	32000.00	–0.27%
ఢిల్లీ	29700	31764.71	–0.34%
కోల్‌కతా	30080	32171.12	0%
కేరళ	28400	30374.33	0.53%
బెంగళూరు	28750	30748.66	0.35%
హైదరాబాద్	29280	31315.51	0.65%
గల్ఫ్	1402.97	1500.50	–0.63%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	41900.00	41400.00	1.21
ముంబై	41900.00	41400.00	1.21
ఢిల్లీ	41900.00	41400.00	1.21
కోల్‌కతా	41900.00	41400.00	1.21
హైదరాబాద్	41900.00	41400.00	1.21



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	345	విశాఖపట్నం	350
వరంగల్	347	చిత్తూరు	378
విజయవాడ	340	చెన్నై	385
గోదావరి	340	బెంగళూరు	375

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
హెచ్‌సిఎల్ టెక్	952.80	933.80	949.55	932.80	16.75	1.80
ఐటిసి	260.50	253.55	259.90	256.50	3.40	1.33
జీ ఎంటర్‌టైన్	568.70	556.00	565.10	559.50	5.60	1.00
మారుతి సుజుకి	8,713.85	8,552.00	8,679.10	8,616.50	62.60	0.73
ఎసియన్ పెయింట్స్	1,109.95	1,095.25	1,107.25	1,101.60	5.65	0.51
టాటామోటార్స్	355.30	343.25	347.80	346.50	1.30	0.38
కోటక్ మహీంద్ర	1,097.60	1,073.30	1,085.10	1,082.45	2.65	0.24
గెయిల్	442.70	433.25	440.75	439.95	0.80	0.18
బజాజ్ ఆటో	2,940.00	2,875.00	2,903.90	2,899.20	4.70	0.16
ఐచర్ మోటార్స్	27,655.00	27,305.60	27,528.15	27,488.45	39.70	0.14

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
అదానీ పోర్ట్స్	398.95	372.25	376.95	405.25	28.30	6.98
ఎస్‌బిఐ	255.35	246.05	246.65	256.55	9.90	3.86
ఇండియాబుల్స్	1,226.85	1,193.00	1,196.25	1,238.75	42.50	3.43
టాటాపవర్	81.70	79.00	79.20	81.75	2.55	3.12
ఐసిఐసిఐ బ్యాంకు	293.80	285.35	286.70	295.05	8.35	2.83
భారతి ఎయిర్‌టెల్	416.30	391.25	403.20	413.90	10.70	2.59
రిలయన్స్	909.25	888.05	889.75	910.85	21.10	2.32
అంబుజా సిమెంట్స్	240.00	234.45	235.20	240.65	5.45	2.26
హెచ్‌పిసిఎల్	366.60	355.10	357.80	365.60	7.80	2.13
అరబిందో ఫార్మా	610.00	588.30	593.45	606.20	12.75	2.10

నీట్ పరీక్షకు ఆధార్ తప్పనిసరి కాదు: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: నీట్–2018,ఇతర అఖిల భారత పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరి తమ 'ఆధార్'ను నమోదు చేసుకోవాలన్న ఆంక్ష పెట్టరాదని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెంకండరీ ఎడ్యుకేషన్(సిబిఎస్ఇ)ని సుప్రీం కోర్టు బుధవారం ఆదేశించింది. అంతేకాక తమ వెబ్‌సైట్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని సిబిఎస్ఇని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలో ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం ఆదేశించింది. దీనికి ఒక రోజు ముందు నీట్ 2018 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల నుంచి ఆధార్ సంఖ్యను తప్పనిసరి తీసుకునేలా సిబిఎస్ఇకి అధికారం ఇవ్వలేదని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యుఐడిఎఐ) సుప్రీం కోర్టుకు తెలిపింది. పరీక్షలకు విద్యార్థుల పేర్లు నమోదు చేసుకోడానికి సిబిఎస్ఇ జమ్మూకశ్మీర్, మేఘాలయ, అస్సాం వంటి రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ గుర్తింపు ఆధారంగా పాస్‌పోర్ట్, ఓటర్ కార్డు, రేషన్ కార్డు వంటివి ఉపయోగించుకోవచ్చని యుఐడిఎఐ నుంచి తనకు సూచనలు అందాయని అటార్నీజనరల్ కె.కె. వేణుగోపాల్ తెలిపారు. నీట్ 2018 పరీక్ష రాసే విద్యార్థుల నుంచి ఆధార్ సంఖ్యను నమోదు చేయడం లేక సిసిఎస్ఇ ఆధార్‌ను తప్పనిసరి చేయడాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు కావడంతో యుఐడిఎఐ ఈ వ్యాఖ్యలు చేసింది.ఆ పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు ఫిబ్రవరి 27న కొట్టేసింది.

రవాణా నౌకలో పెను అగ్నిప్రమాదం

నలుగురు గల్లంతు, సముద్రంలో దూకిన పలువురు

ముంబయి: అరేబియా సముద్రంలోని లక్షద్వీప్ తీరప్రాంతంలో బుధవారం మార్క్స్ లైన్ యాజమాన్యానికి చెందిన అతి పెద్ద రవాణా నౌక అగ్నిప్రమాదానికి గురైంది. ఆ నౌకకు చెందిన నలుగురు సిబ్బంది గల్లంతయ్యారు. వారిలో ఒకరు భారతీయ నావికుడు కూడా ఉన్నారు. సింగపూర్‌కు చెందిన మార్క్స్ హోనం అనేది అతి పెద్ద రవాణా నౌక. ఇది 330 మీటర్ల పొడవుంటుంది. సింగపూర్ నుంచి సూయెజ్‌కు వెళుతుండగా ఈ నౌక మంగళవారం రాత్రి 8.50 గంటలకు అగ్నిప్రమాదానికి గురైంది. దాంతో అందులో ఉన్న 27 మంది సిబ్బంది ప్రాణాలు కాపాడుకునేందుకు సముద్రంలో దూకేశారు. అయితే వారిలో 23 మందినే రక్షించగలిగారు. మిగతా నలుగురి ఆచూకీ లేదు. అలాంటి నావికా అగ్ని ప్రమాదంకు సాయపడే సామర్థ్యం ఉన్న ఇండియన్ కోస్ట్ గార్డ్(ఐసిజి) నౌకను వెంటనే ఘటనా స్థలికి పంపారు. భారతీయ నావికా దళం సిబ్బంది తమిళనాడు నుంచి కదలి వెళ్లి గల్లంతైన సిబ్బంది కోసం గాలింపు చర్యలు చేపట్టారని నావికా ప్రతినిధి తెలిపారు. గల్లంతైన వారిలో భారతీయ నావికుడు సకిం హెగ్డే ఉన్నట్లు గుర్తించారు. 7860 కంటైనర్లలోని ఒకదాంట్లో అగ్ని రాజుకుని ఉంటుందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్(డిజిఎస్) అధికారులు అనుమానిస్తున్నారు. రక్షక సిబ్బంది అగ్ని ప్రమాదానికి గురైన ఆ మర్చెంట్ షిప్‌ను దగ్గరలో ఉన్న కొలంబో రేవుకు తరలించారు. ఆ నౌకలో ఉన్న 27 మంది సిబ్బందిలో కెప్టెన్ సహా 13 మంది భారతీయులున్నారు.

777 చొరబాటు ఘటనలు : రిజిజు



న్యూఢిల్లీ : గత రెండేళ్లల్లో జమ్మూకశీర్మలోకి ఉగ్రవాదులు చొరబడే ఘటనలు 777 జరిగాయని, ఈ ఘటనల్లో మొత్తం 94 మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు హతమార్చినట్లు బుధవారం రాజ్యసభకు కేంద్రం వెల్లడించింది. అదే విధంగా పంజాబ్‌లోకి చొరబడే ఘటనలు 17 చోటు చేసుకున్నాయని, ఈ ఘటనల్లో ఏడుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. మరో11 మంది పట్టుబడ్డారన్నారు.2017లో 406 చొరబాటు కేసులు నమోదు కాగా, 59 మంది ఉగ్రవాదులు మృతి చెందారని రిజిజు రాజ్యసభకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2016లో 371 ఘటనలు జరిగితే 35 మంది తీవ్రవాదులు హతం కాగా, ముగ్గురు అరెస్టు అయ్యారని ఆయన చెప్పారు. అంతర్జాతీయ సరిహద్దుల్లో చోటు చేసుకుంటున్న మెరుపుదాడుల్లో, గస్తీకాయడంలో, 24 గంటల పాటు నిఘా పెట్టడంలో మన భద్రతా బలగాలు ముందంజలో ఉంటాయన్నారు. అలాగే సరిహద్దుల్లో నదీ విభాగాల్లో బిఎస్ఎఫ్‌కు చెందిన నీటి విభాగం దళాలు వాటర్ క్రాఫ్ట్స్, సీడ్ పోస్ట్స్ సహాయంతో గస్తీ కాస్తున్నట్లు రిజిజు పేర్కొన్నారు. సరిహద్దుల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయడంలో భాగంగా రాత్రి,పగలు పనిచేసే హైటెక్ నిఘా పరికరాలను బలగాలకు అందిస్తామన్నారు.

తొగాడియాపై హత్యాయత్నం?



సూరత్ : విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) అంతర్జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడుప్రవీణ్ తొగాడియాకు పెనుప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న వాహనాన్ని సూరత్ జిల్లాలోని కామ్రేజ్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఓ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదం నుంచి తొగాడియా సురక్షితంగాబయటపడ్డారు. తనది బుల్లెట్ ప్రూఫ్ వాహ నం కాకుంటే తాను ఈ ఘటనలో మృతి చెంది ఉండేవాడిని తొగాడి యా పేర్కొన్నారు. గుజరాత్ ప్రభుత్వం వ్యూహాత్మకంగా తన జెడ్ ప్లస్ భద్రతను తగిస్తోందని ఆయన ఆరోపించారు. మొదటిసారిగా తన వాహనం పోలీస్ వాహనంతోనే అనుసరించేలా చేశారని, ప్రభుత్వ ఆదేశానుసారమే తనకు పైలెట్ వాహనాన్ని సమకూర్చలేదన్నారు. కాగా, తొగాడియా, మరో వ్యక్తి ప్రయాణిస్తున్న వాహనాన్ని కామ్రేజ్ పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఓ ట్రక్కు ఢీకొట్టిందని సూరత్ రూరల్ ఎస్‌పి ఎంకె నాయక్ తెలిపారు. ఆయన సూరత్‌లో జరిగే ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు వెళ్తుండగా ఘటన జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో తొగాడియాకు ఎలాంటి గాయాలు కాలేదని, ట్రక్కును సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్టు చేశామన్నారు.

ఏడాదిలో 77 రైలు ప్రమాదాలు

న్యూఢిల్లీ : దేశంలో ఏప్రిల్ 1, 2017 నుంచి ఫిబ్రవరి 28, 2018 మధ్యకాలంలో 70 రైలు ప్రమాదాలు సంభవించినట్టు ప్రభుత్వం పార్లమెంట్‌లో నివేదించింది. బుధవారం లోక్‌సభలో ఒక లిఖితపూర్వ ప్రశ్నకు సమాధానంగా రైల్వే సహాయమంత్రి రాజేన్ గోహెన్ మాట్లాడుతూ, జాతీయ రవాణా సంస్థ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని, ప్రమాదాల నియంత్రణకు నిరంతర ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత మూడేళ్ల కాలంలో రైల్వే ప్రమాదాలు 2014–15లో 135, 2015–16లో 107, 2016–17లో 104కు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ఏప్రిల్ 1, 2017 నుంచి ఫిబ్రవరి 28, 2018లో 70 వరకు ప్రమాదాలు తగ్గాయని, గతేడాది ఇదే త్రైమాసికానికి 99 ప్రమాదాలు నమోదయ్యాయని మంత్రి తెలిపారు.

జవాన్లపై సహచరుడి కాల్పులు

నాగ్‌పూర్ : ఒక సిఆర్‌పిఎఫ్ జవాన్ సహచరులపై కాల్పులకు తెగబడ్డాడు. నక్సలైట్ల ప్రాంత సమీపంలో గడ్చిరౌలి జిల్లాలోని రాత్రి ఎట్టపల్లి క్యాంపు వద్ద ఈ ఘటన జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ సంద్రే సంజయ్ తన సహచర జవాన్లతో ఘర్షణ తలెత్తగా, అతడు తన సర్వీసు తుపాకితో ఆ ఇద్దరిపై కాల్పులు జరిపాడు. దీంతో ఇద్దరు కానిస్టేబుళ్లు సిబి మారుతి, ఎస్ఎస్ సింగ్‌లకు గాయాలు కాగా, ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మారుతికి పొట్టభాగంలో గాయాలుకావడంతో అతని పరిస్థితి విషమంగా ఉంది. సింగ్‌కు కాలులోకి బుల్లెట్ దూసుకెళ్లింది. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉంది. కోర్టు ఆదేశాల మేరకు ఈ ఘటనపై స్థానిక పోలీసులు విచారణ చేపడుతున్నారు.మావోయిస్టు కార్యకలాపాలకు వ్యతిరేకంగా సెంట్రల్ రిజర్వు పోలీసు పోర్స్‌తో ఎట్టపల్లి క్యాంపు నిర్వహిస్తున్నది.

గ్రనేడ్‌తో అసెంబ్లీలోకి ఎంఎల్‌ఎ

తిరువనంతపురం : కేరళ అసెంబ్లీలో బుధవారంనాడు అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. గ్రనేడ్‌తో ఓ కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అసెంబ్లీలోకి అడుగుపెట్టి కలకలం సృష్టించారు. నేరుగా అసెంబ్లీ స్పీకర్ వద్దకు వెళ్లి గడువు తీరిన ఈ గ్రనేడ్‌ను గత వారం పోలీసులు తమ పార్టీ కార్యకర్తలపై ఉపయోగించారని అక్కడ ప్రదర్శించారు. తొలుత అది ఉపయోగించని గ్రనేడ్ అనుకొని పలువురు ఆందోళన చెందారు. స్పీకర్‌కు దాన్ని చూపించి వివరాలు చెప్పిన తర్వాత వారు ఊపిరి పీల్చుకున్నారు. తిరువంచూర్‌కు చెందిన కాంగ్రెస్ ఎంఎల్‌ఎ రాధాకృష్ణన్ బుధవారం ఉదయం కేరళ అసెంబ్లీలోకి ఓ ఉపయోగించిన గ్రనేడ్‌తో అడుగుపెట్టారు. గత వారం యూత్ కాంగ్రెస్ ఉద్యమకారులు ఓ అంశంపై ఆందోళన వ్యక్తం చేస్తుండగా పోలీసులు కాలం చెల్లిన గ్రనేడ్‌ను ఉపయోగించారని, అందుకు సాక్షంగా తాను దానిని అసెంబ్లీలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.







బుధవారంనాడు ఢిల్లీ వీధుల్లో పార్లమెంట్ ఆవరణలో వివిధ పార్టీల నేతలు నిరసనలకు దిగారు. కావేరి జలాలప పంపిణీ వివాదం పరిష్కారానికి త్వరితగతిన బోర్డు ఏర్పాటు చేయాలని డిఎంకె ఎంపిలు, త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వామపక్షాలు, ఎపికి ప్రత్యేక హోదా, పునర్విభజన చట్టం అమలుకు డిమాండ్ చేస్తూ టిడిపి ఎంపిలు ఆందోళన నిర్వహించారు.

మూడో రోజూ అంతే...

వివిధ అంశాలపై దద్దరిల్లిన పార్లమెంట్

ఉభయ సభలు వాయిదా

న్యూఢిల్లీ: పార్లమెంటు ఉభయ సభల కార్యక్రమాలు బుధవారం వరుసగా మూడో రోజు కూడా కొనసాగలేదు.ఆంధ్రప్రదేశ్ విభజన, విగ్రహాల విధ్వంసం, బ్యాంకుల కుంభకోణాలపై విపక్షాలు, ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలైన శివసేన, టిడిపి, ఎఐఎడిఎంకె తీవ్ర విమర్శలు చేస్తూ నిరసన తెలపడంతో సభాకార్యక్రమాలు కొనసాగలేదు. లోక్‌సభ మధ్యాహ్నం తర్వాత వాయిదా పడగా, రాజ్యసభ నిరసన, ఆందోళన మధ్య మధ్యాహ్నం రెండు తర్వాత వాయిదా పడింది. రాజ్యసభలో చైర్మన్ ఎం. వెంకయ్యనాయుడు 'విగ్రహాలను ధ్వంసం చేశారు.. ఇది సిగ్గుమాలిన పని. పిచ్చి, పిచ్చి.. ఎవరూ చేసినా సరే.. అది తమిళనాడులోనైనా, త్రిపురలోనైనా, పశ్చిమ బెంగాల్‌లోనైనా ఆక్షేపణీయమే' అన్నారు. లోక్‌సభ బుధవారం సమావేశం కాగానే టిడిపి, శివసేన, టిఆర్ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్, ఎఐఎడిఎంకె, తృణమూల్ కాంగ్రెస్ సహా విపక్షాలు వివిధ అంశాలపై నిరసనలు, నినాదాలు ప్రకటించారు. దాం తో ప్రశ్నోత్తరాల సమయాన్ని చేపట్టిన స్పీకర్ సుమిత్రా మహాజన్ కొన్ని నిమిషాలకే గంటపాటు సభను వాయిదా వేశారు. రిజర్వేషన్‌లో తెలంగాణ కోటా పెంచడం గురించి టిఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని టిడిపి, మరాఠీకి ప్రాచీన భాష హోదా ఇవ్వాలని శివసేన, పెరియార్ ఫోటోలు పట్టుకుని ఎఐఎడిఎంకె, నీరవ్ మోడీ బ్యాంకు మోసంపై కాంగ్రెస్ రెచ్చిపోయి ఆందోళన వ్యక్తం చేశారు. దాని సుమిత్రా మహాజన్ దిగ్భ్రాంతికి గురయ్యారు. గందరగోళం నేపథ్యంలో లోక్‌సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మధ్యాహ్నం తిరిగి సమావేశమైనప్పుడు కూడా విపక్షాల సభ్యులు సభ మధ్య(వెల్)లో చేరి నిరసనలు మొదలెట్టారు. శివసేన సభ్యుడు మరాఠీ భాషకు ప్రాచీన హోదా ఇవ్వాలని అడిగినప్పుడు, ఆ విషయాన్ని పరిశీలిస్తామని హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. శివసేన సభ్యులు తమ నిరసన ఆపగానే ఎఐఎడిఎంకె సభ్యులు పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై రచ్చ చేశారు. హోం మంత్రి సమాధానం ఇవ్వడానికి ప్రయత్నించినా సభ మామూలు స్థితికి రాలేదు. దాంతో లోక్‌సభను వాయిదా వేశారు.

రవిశంకర్‌పై శివసేన ఆగ్రహం

ముంబయి: రామ మందిరం అంశంపై ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీ రవిశంకర్ జోక్యం పట్ల బుధవారం శివసేన తీవ్రంగా విమర్శించింది. పార్లమెంట్‌లో పూర్తి మెజార్టీ ఉన్న బిజెపి తలచుకుంటే ఆర్డినెన్స్ జారీ చేసి, 24 గంటల్లో ఆలయ నిర్మాణాన్ని ప్రారంభిస్తుందని పేర్కొంది. రామ మందిర్ అంశంపై గత రెండేళ్లుగా జోక్యం చేసుకుంటున్న శ్రీ రవిశంకర్, చర్చల్లో ఒక పార్టీగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారనిపేర్కొంది. సమస్య పరిష్కారం కానట్లైతే ఇప్పుడు దేశ పరిస్థితి సిరియాలో ఉన్నట్లుగా తయారవుతుందని చెబుతున్నారని శివసేన అధికారిక పత్రిక సామ్నా సంపాదకీయంలో పేర్కొంది. ఆధ్యాత్మిక గురువు బెదిరింపులకు పాల్పడి ఉన్నట్లైతే విచారణ జరిపించాల్సి ఉందని పేర్కొంది. భవిష్యత్ ఏం జరుగనుందో ముందే చెప్పారని, సమ్మె చేస్తారా లేదా దేశంలో అశాంతి సృష్టించేందుకు ఈ అంశంలోకి ఐసిస్‌ను తీసుకురాబోతున్నారా అని ప్రశ్నించింది. శ్రీ రవి శంకర్ ప్రకటనపై జాతీయ ప్రయోజనాల దృష్ట్యా విచారణ జరిపించాలని కోరింది. ఈ అంశంపై శ్రీ రవిశంకర్ జోక్యం చేసుకోవడం మానుకొని తన పని తాను చేసుకోవాలని సేన పేర్కొంది. సమస్య పరిష్కారానికి ఈ అంశాన్ని ప్రధాని మోడీ, బిజెపి చీఫ్ అమిత్ షా,ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భగవత్‌కు వదిలి వేయాలని పేర్కొంది.

కర్నాటక లోకాయుక్తకు కత్తిపోట్లు



బెంగళూరు: కర్నాటక లోకాయుక్త జస్టిస్ విశ్వనాథ శెట్టిపై హత్యాయత్నం జరిగింది. బుధవారం తన ఆఫీసులో కేసు విచారిస్తున్న విశ్వనాథశెట్టిని ఓ వ్యక్తి కత్తితో మూడుసార్లు పొడిచాడు. తీవ్ర గాయాలైన ఆయనను మాల్యాఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ఒంబుడ్స్‌మెన్ ఆఫీస్‌లో భద్రతా వైఫల్యం బట్టబయలైంది. దాడికి పాల్పడిన తేజస్‌శర్మ అనే నిందితుడిని పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ఓ అవినీతి అధికారిపై తాను చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోలేదని నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కర్నాటక హోంశాఖ మంత్రి రామలింగారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ విశ్వనాథశెట్టికి ప్రాణపాయంలేదని తెలిపారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా ఆస్పత్రిని సందర్శించి, శెట్టి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. లోకాయుక్త చాంబర్‌లోకి ప్రవేశించిన నిందితుడు ఆయనపై దాడికి పాల్పడ్డాడని, సెక్యూరిటీ వైఫల్యముంటే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు. లోకాయుక్త ఆఫీస్‌లో మెటల్ డిటెక్టర్ పనిచేయక పోవడం వల్లనే నిందితుడు ఆయుధాన్ని లోనికి తీసుకెళ్లి ఉంటాడని భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి దర్యాప్తునకు ఆదేశించినట్లు ప్రభుత్వం తెలిపింది.

బెంగాల్ సిపిఐ(ఎం)లో యువరక్తం

వయసుమీరిన నేతల తొలగింపు, అన్ని స్థాయిల్లో అమలుకు నిర్ణయం



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో గతంలో జరిగిన ఎన్నికల్లో ఓటమిని చవిచూసిన సిపిఐ(ఎం) ప్రస్తుతం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. వృద్ధులను తొలగిస్తూ, యువకులకు ప్రాధాన్యం కల్పిస్తూ పార్టీని పునర్ వ్యవస్థీకరించేందుకు రంగం సిద్ధం చేసినట్లు పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయం సాధించేందుకు పార్టీ వ్యూహాలు రచిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్రంలోని 23 జిల్లాల్లో 60 నుంచి 80 ఏళ్ల వయసున్న 70 శాతం పైగా నాయకుల స్థానంలో 300 మంది యువకులకు ప్రాధాన్యత కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ చర్య అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై గట్టి పోరాటం చేసేందుకు సహాయ పడుతుందని పార్టీ అధిష్ఠానం భావిస్తోందన్నారు. అదే విధంగా రాష్ట్రంలో మెల్లమెల్లగా పుంజుకొని లెఫ్ట్‌ఫ్రంట్, కాంగ్రెస్ స్థానంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలని చూస్తున్న బిజెపిని కూడా నిరోధించేందుకు ఉపయోగపడుతుందని ఆశిస్తోందని ఆయన వెల్లడించారు. ప్రాంతీయ కమిటీల నుంచి రాష్ట్ర నాయకత్వం వరకు అన్ని స్థాయిల్లో సభ్యులు వయసును పరిమితం చేస్తామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూర్యకాంత్ మిశ్రా స్పష్టం చేశారు. కాగా, రాష్ట్ర కమిటీ, కార్యవర్గ కమిటీ, వివిధ జిల్లా కమిటీల్లో 75 ఏళ్ల పైబడిన నాయకులను సిపిఐ(ఎం) అధినాయత్వం తొలగించే అవకాశముంది. అయితే పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బిమన్ బోస్, పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం బుద్ధదేవ్ భట్టాచార్యాలకు మినహాయింపునిచ్చే అవకాశముంది. ఇదిలా ఉండగా, అనారోగ్య కారణాల వల్ల రాష్ట్ర కమిటీని వైదొలుగుతానని ఇప్పటికే భట్టాచార్య తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

జర్నలిస్టుల సంక్షేమ పథకంలో ఐదింతల పెంపు

న్యూఢిల్లీ: సమాచార, ప్రసారాల మంత్రిత్వ శాఖ పాత్రికేయుల సంక్షేమ పథకంలో ఐదు రెట్ల పెంపుదలను ప్రకటించింది. తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్న పాత్రికేయుల కుటుంబాలకు ఆర్థిక సాయంగా రూ. 20 లక్షల నుంచి రూ. 1 కోటి ఇవ్వనుందని అధికారి ఒకరు బుధవారం తెలిపారు. ఈ పెంపుదల ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానుంది. ఈ పథకం కింద చనిపోయిన పాత్రికేయుడి కుటుంబానికి రూ. 5 లక్షల వరకు, శాశ్వత అంగవైకల్యం పొందిన పాత్రికేయుడికి రూ. 5 లక్షల వరకు, కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య పథకం(సిజిహెచ్ఎస్) కింద ప్రధాన వ్యాధులకు రూ. 3 లక్షల మేరకు చికిత్సా ఖర్చులను ఆర్థిక సాయంగా ఇవ్వనుంది. 'పాత్రికేయులకు ఇప్పుడిస్తున్న సంక్షేమ సదుపాయాలు తగినంతగా లేవని సమాచార, ప్రసార మంత్రి స్మృతి ఇరానీ భావిస్తున్నారని, ఈ కొరతను తీర్చడానికే తొలిసారి పెద్ద ఎత్తున సంక్షేమ పథకంను ఐదు రెట్టు పెంచారని, దీంతో పాత్రికేయులకు, వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందుతుంది' అని విశ్వసనీయ వర్గం వెల్లడించింది. జర్నలిస్టుల ఈ సంక్షేమ పథకం కేంద్ర పాలిత ప్రాంతాలు/ రాష్ట్రాలు, ప్రెస్ ఇన్ఫార్మేషన్ బ్యూరో(పిఐబి)లో పనిచేసే గుర్తింపు ఉన్న పాత్రికేయులకు(అక్రెడిటెడ్ జర్నలిస్టులకు), ఫుల్‌టైమ్ లేక పార్ట్‌టైమ్‌గా న్యూస్ ఎడిటర్, రిపోర్టర్, ఫోటోగ్రాఫర్, కెమెరామన్, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా కనీసం ఐదేళ్లపాటు నిరంతరం పనిచేసిన నాన్–అక్రెడిటెడ్ జర్నలిస్టులకు వర్తిస్తుంది.

పనిచేయని ఉర్దూ కంప్యూటర్ సెంటర్లు

● కాగితాలకే పరిమితమయిన ఆధునీకరణ ● పట్టించుకోని మైనారిటీ సంక్షేమ శాఖ

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ఉర్దూ అకాడమి ఆధ్వర్యంలో నడుస్తున్న కంప్యూటర్ సెంటర్ల నిర్వహణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ పరిధిలోకి మారడంతో ప్రభుత్వం ఆశిస్తున్న ఫలితాలు రావడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న లైబ్రరీలతో కూడిన 42 ఉర్దూ కంప్యూటర్ సెంటర్లలో నిరుద్యోగ విద్యావంతులకు కంప్యూటర్ శిక్షణ కల్పించడం పూర్తిగా ఆగిపోయింది. ఈ సెంటర్లలో పనిచేసే దాదాపు 177 మంది సిబ్బంది భవిష్యత్తుపై స్పష్టత లేకుండా పోయింది. ఔట్‌సోర్సింగ్‌పై పనిచేస్తున్న ఈ సిబ్బందిని మైనారిటీ సంక్షేమ శాఖ ఇతర పనులకు వినియోగించుకుంటున్నా వారికి నామమాత్రంగా ఇచ్చే రూ.5,000 నుంచి రూ.8,500 వేతనాలు కూడా ప్రతీ నెలా అందడం లేదని వాపోతున్నారు. నాలుగైదు నెలలకు ఒక సారి మాత్రమే చెల్లిస్తుండడంతో సిబ్బంది అవస్థలు పడుతున్నారని ఉర్దూ కంప్యూటర్ సెంటర్ కమ్ లైబ్రరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వ్యాఖ్యానించారు. దాదాపు పదిహేనేళ్ళుగా సర్వీసు ఉన్నా జీతం పది వేలు కూడా దాటడంలేదని వ్యాఖ్యానించారు. కంప్యూటర్ సెంటర్ల భవనాలకు అద్దె, విద్యుత్ బిల్లులు చెల్లించక పోవడంతో కొన్ని మూతబడ్డాయి. విద్యార్థులకు శిక్షణ కల్పించడంపై తగిన శ్రద్ధ లేకపోవడంతో కాలం చెల్లిన కంప్యూటర్ల స్థానంలో కొత్తవాటిని సమకూర్చుకునే ఆలోచన కూడా లేకుండాపోయిందని సంఘం నేతలు వ్యాఖ్యానించారు. గతంలో ఏడాదికి రెండు బ్యాచ్‌ల చొప్పున మైనారిటీ యువతకు ఈ సెంటర్లలో ఉచిత కంప్యూటర్ శిక్షణ లభించేదని, రెండేళ్ళుగా ఈ సెంటర్లను ఉర్దూ అకాడమి పరిధి నుండి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ పరిదిలోకి మార్చడంతో గడ్డు పరిస్థితులు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ళ క్రితం శిక్షణ పూర్తి చేసుకున్న బ్యాచ్ విద్యార్థులకు ఇప్పటికీ పరీక్షలు నిర్వహించలేదని పేర్కొన్నారు. ఈ కంప్యూటర్ సెంటర్లను ఆధునీకరించి తిరిగి ప్రారంభిస్తామని ప్రభుత్వం పలు పర్యాయాలు ప్రకటించినా ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదని, హైదరాబాద్ సంతోష్‌నగర్‌లోని ఒక్క కేంద్రాన్ని మాత్రమే ఆధునీకరించారని వారు గుర్తుచేశారు. అద్దె చెల్లించకపోవడంతో కొన్ని కంప్యూటర్ సెంటర్లు మూతపడడంతో చాలా సెంటర్లకు అవసరమైన అద్దె బకాయిలను మైనారిటీ సంక్షేమ శాఖ ఇటీవల విడుదల చేసింది. కరెంటు బిల్లుల బకాయిలను మాత్రం ఇంకా విడుదల చేయలేదు.



ఆచరణకు నోచుకోని జీతాల పెంపు ఉత్తర్వులు

ఈ సెంటర్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలను పెంపుకు సంబంధించి మైనారిటీ సంక్షేమ శాఖ గతేడాది నవంబర్ 3న మెమో జారీ చేసింది. ఆ ప్రకారం బోధనా సిబ్బందికి నెలకు రూ.17,500, లైబ్రేరియన్‌కు రూ.15,000లు, ఆఫీస్ సబార్డినేట్‌కు రూ.12,000లకు వేతనం పెరిగింది. పెరిగిన వేతనాలనే చెల్లించాలని మైనారిటీ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను సంక్షేమ శాఖ కార్యదర్శి ఆదేశించారు. నాలుగు నెలలు దాటినా ఆ వేతనాల పెంపు ఆచరణకు నోచుకోలేదు. సిబ్బందికి ఇంకా పాత వేతనాన్నే చెల్లిస్తోంది. ఐదు నెలల వేతన బకాయిల్లో కేవలం రెండు నెలల బకాయిలను మాత్రమే చెల్లించిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెంచిన జీతాల ప్రకారం మొత్తం బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. మరో వైపు ఈ ఉద్యోగులను ఇటీవల మరోచోటికి బదిలీ చేస్తూ సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఐదు వేల జీతంతో పనిచేస్తున్న తాము కుటుంబాన్ని వదిలి 200 కి.మీ.ల దూరంలోని సెంటర్లకు బదిలీపై వెళ్ళడం ఆర్థికంగా ఇబ్బందికరమని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఆ ఉత్తర్వులను కమిషన్ తాత్కాలికంగా నిలిపివేసింది.



నేపాల్ అధ్యక్ష పదవి పోటీలో బిద్యాదేవి, లక్ష్మీ రాయ్

ఖాట్మండు: నేపాల్ అధ్యక్ష పదవి ఎన్నికలకు అధికారంలో ఉన్న అధ్యక్షురాలు బిద్యాదేవి భండారీ, నేపాలి కాంగ్రెస్ నాయకురాలు కుమారి లక్ష్మీ రాయ్ బుధవారం తమ నామినేషన్లు వేశారు. నేపాల్ అధ్యక్ష ఎన్నిక మార్చి 13న జరగనుంది. తొలిసారి అధ్యక్ష పదవికి ఎన్నికైన మహిళ బిద్యా దేవి భండారీ రెండోసారి పదవీ కాలానికి పోటీపడుతున్నారు. 2015లో జరిగిన రెండో అధ్యక్ష ఎన్నికల్లో ఆమె ఎన్నిక య్యారు. ఇప్పుడు మూడో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. నేపాల్‌లో 2008లో రాచరికం రద్దయిన సంగతి తెలిసిందే. అధికారంలో ఉన్న సిపిఎన్–యుఎంఎల్, సిపిఎన్–మావోయిస్ట్ సెంటర్ పార్టీలతో పాటు చిన్న పార్టీల మద్దతు ఉన్నందున బిద్యా దేవి భండారీ(56) మళ్ళీ ఎన్నికయ్యే అవకాశాలు ఎక్కువు న్నాయి. ఎలక్టోరల్ కాలేజీలో 800కు పైగా ఓట్లున్నాయి. అధ్యక్ష ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళి(కోడ్ ఆఫ్ కండక్ట్) బుధవారం నుంచే అమలులోకి వచ్చింది. ఈ ప్రవర్తనా నియమావళి ప్రభుత్వ సంస్థలకు, ప్రజలకు వర్తిస్తుందని ఎన్నికల సంఘం ప్రతినిధి నవరాజ్ ధకల్ తెలిపారు.

భారత్ డ్రోన్‌ను కూల్చేశాం : పాక్

ఇస్లామాబాద్ : తమ గగనతలంలోకి భారత్‌కు చెందిన నిఘా డ్రోన్ ప్రవేశించిందని, దానిని కశ్మీర్‌లోని నియంత్రణ రేఖా వెంట ఉన్న చిరికోట్ సెక్టార్‌లో కూల్చివేసినట్లు పాకిస్థాన్ ఆర్మీ పేర్కొంది. మంగళవారం అర్ధ రాత్రి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ సమీపంలో భారత్‌కు చెందిన ఒక డ్రోన్‌ను గుర్తించామని పాకిస్థాన్ మిలిటరీ ఓ ప్రకటనలో తెలిపింది. అక్రమంగా తమ గగనతలంలోకి ప్రవేశించిన నిఘా డ్రోన్‌ను చిరికోట్ గ్రామంలో కూల్చివేసినట్లు పేర్కొంది. గత ఏడాది కాలం నుంచి తమ గగనతలంలోకి వచ్చిన నాలుగో భారత డ్రోన్ ఇది అని తెలిపింది. కాగా.. ఈ ఆరోపణలపై భారత్ ఇంకా స్పందించలేదు.

బిఎస్‌ఎఫ్ జవాన్‌కు వారం జీతం కట్

అభ్యంతరం తెలిపిన మోడీ

న్యూఢిల్లీ: తరచూ జరిగే విన్యాసంలో ప్రధాని నరేంద్ర మోడీని అగౌరవ పరిచినందుకు శిక్షగా ఓ జవాను 7 రోజుల జీతాన్ని సరిహద్దు భద్రతా దళం(బిఎస్‌ఎఫ్) కోసింది. అయితే ఆ జీతం కోత ఉత్తర్వును వెంటనే ఉపసంహరించాలని ప్రధాన మంత్రి బుధవారం ఆదేశించడంతో ఆ జవానుకు ఉపశమనం కలిగింది. ఫిబ్రవరి 21న ఉదయం పూట రోల్ కాల్ టాస్క్‌కు హాజరయినప్పుడు అది 'మోడీ కార్యక్రమం'లా ఉందని బిఎస్‌ఎఫ్ 15వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ సంజీవ్ కుమార్ వ్యాఖ్యానించడాన్ని కమాండింగ్ ఆఫీసర్ తప్పు పట్టి శిక్ష విధించారు. ఆ కానిస్టేబుల్‌ను పశ్చిమ బెంగాల్‌కు చెందిన నడియా జిల్లాలో విధులకు నియుక్తించారు. యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ అనూప్ లాల్ భగవత్ ఆ జవాను 7 రోజుల(వారం రోజుల) జీతంను కోసే ఉత్తర్వును జారీ చేశారు. అయితే దీనిపై ప్రధాని నరేంద్ర మోడీ అసంతృప్తిని వ్యక్తం చేసి వెంటనే ఆ ఉత్తర్వును ఉపసంహరించాలని ఆదేశించారు. తమ అధికారిక కార్యకలాపాల గురించి సీనియర్లకు వివరించే సమావేశం లేక 'జీరో పరేడ్' సమయంలో జవాను సంజీవ్ కుమార్ అదంతా 'మోడీ కార్యక్రమం'లా ఉందని వ్యాఖ్యానించాడు. జవాను చేసిన ఈ వ్యాఖ్యలు అసమంజసంగా ఉన్నాయని, అతడిపై విచారణ జరపాలని అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. విచారణ ఒక రోజులో పూర్తయింది.కానిస్టేబుల్ సంజీవ్ కుమార్ తప్పు చేశాడని రుజువైంది. బిఎస్‌ఎఫ్ చట్టం 40 సెక్షన్ కింద అతడిపై అభియోగం నమోదు చేశారు. జవానులు చాలా దుర్భరమైన పరిస్థితుల్లో పనిచేస్తుంటారని... వారి మానసిక పరిస్థితిని పై అధికారులు దృష్టిలో పెట్టుకుని తమ నాయకత్వ లక్షణాలను కనబరచాలని సీనియర్ అధికారులకు తర్వాత సూచించడం జరిగింది. జవాను జీతం కోయడం అన్నది సరైన నిర్ణయం కాదని బిఎస్‌ఎఫ్ బలగానికి ఓ సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు. బిఎస్‌ఎఫ్ 15వ బెటాలియన్ పశ్చిమ బెంగాల్‌లోని భారత–బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దులో పనిచేస్తుంది.

శ్రీలంకలో ఆగని హింస



కొలంబో : ఎమర్జెన్సీ కొనసాగుతున్నప్పటికీ శ్రీలంకలో హింస ఆగలేదు. బుధవారం నాడు కూడా క్యాండీలోని పలు చోట్ల బౌద్ధులు, ముస్లింల మధ్య ఘర్షణలు జరిగాయి. బౌద్ధ సంఘాలకు చెందిన యువకులు కొందరు.. మసీదులను ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కొందరిని పోలీసులు అరెస్టు చేశారు.అల్లర్లు నానాటకీ వ్యాప్తి చెందుతుండటంతో ఫేస్‌బుక్, వాట్సప్ సహా ఇతర సోషల్ మీడియా నెట్‌వర్క్‌లపై నిషేధం విధించారు.ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వ వర్గాలు ప్రకటన చేశాయి. అయితే, నిషేధం ఎంతకాలం ఉంటుందనేది స్పష్టంగా తెలియరాలేదు. క్యాండీ జిల్లాల్లో చెలరేగిన హింసను అదుపుచేయడంలో భాగంగా మంగళవారం నుంచి 10 రోజులపాటు ఎమర్జెన్సీని విధించిన సంగతి తెలిసిందే.

మహిళలు స్వతంత్ర నిర్ణయం తీసుకునే స్థాయికి ఎదగాలి

బిసి మహిళా ఐక్యవేదిక అధ్యక్షురాలు లత

మన తెలంగాణ / హైదరాబాద్ : మహిళలు స్వతంత్ర నిర్ణయం తీసుకునే స్థాయికి ఎదిగినపుడే మహిళా సాధికారికతకు సార్థకత చేకూరుతుందని బిసి మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు ఆలంపల్లి లత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 70 ఏళ్ళ స్వాతంత్ర భారతదేశంలో మహిళల స్థితిగతులు ఆశించిన స్థాయిలో మెరుగుపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రధాన కారణం మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా స్వతంత్రంగా లేకపోవడమేనన్నారు. చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు సంబంధించి పార్లమెంటులో బిల్లు తేవాలని కోరారు. వార్డు సభ్యుడి నుండి రాష్ట్ర పతి వరకు మహిళలు ఎదిగినప్పటికి సమాజంలో మగవారి ఒత్తిళ్లకు తలొగ్గి ఆత్మాభిమానం చంపుకుని సంతకాలు చేసే స్థితి ఉందన్నారు. పురుషాధిక్యత ఉన్నంత వరకు మహిళలు ముందంజ వేయలేరన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్ని మహిళా దినోత్సవాలు జరుపుకున్నా ప్రయోజనం ఉండబోదని లత అన్నారు.

మహిళల పట్ల చులకనభావం తగదు



మన తెలంగాణ / హైదరాబాద్ : సమాజంలో మహిళలను చులకనగా చూసే ధోరణిని రూపుమాపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ అన్నారు. గతంలో మహిళలను దేవతలుగా కొలిచే విలువలను మరిచిపోయారని ఆయన పేర్కొన్నారు. ఎస్‌సిఆర్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్ నిలయంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్‌సిఆర్ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు అర్చన యాదవ్, ఎస్‌సిఆర్ ఎంయు అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.శంకరరావు, మహిళా విభాగం సమన్వయకర్త టి,కళావతి, ఎస్‌సిఆర్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ ఎన్.వి.రమణరెడ్డి తదితరులు ప్రసంగించారు. మహిళా ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని జిఎం చెప్పారు. ఎస్‌సిఆర్‌కు ఉత్తమ జోన్‌గా గుర్తింపు లభించడంలో మహిళా ఉద్యోగుల కృషి ప్రశంసనీయమన్నారు. అర్చనా యాదవ్ మాట్లాడుతూ చంద్రగిరి, బేగంపేట, ఫిరంగిపురం రైల్వే స్టేషన్లను 'మహిళా ఉద్యోగుల రైల్వే స్టేషన్లు'గా గుర్తించడం మహిళలకు గర్వకారణమని అన్నారు.

నేటి నుంచి 'ఆట' మొదలు

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు, నిర్మాతల మండలి చర్చలు సఫలం





మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గురువారం నుంచి సినిమా థియేటర్లు తెరుచుకోనున్నాయి. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు, తెలు గు సినీ నిర్మాతల మండలి మధ్య రాజీ కుదరడంతో సినిమా థియేటర్లలో చిత్ర ప్రదర్శనలకు మార్గం సుగమమైంది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు వర్చువల్ ప్రింట్ ఫీజును (విపిఎఫ్) అధికంగా వసూలు చేస్తున్నారని దక్షిణభారత చలనచిత్ర నిర్మాతల మండలి ఐక్య కార్యాచరణ సమితి ఈనెల 2 నుంచి సినిమా థియేటర్ల బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో వారం రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, కేరళలోని థియేటర్లు మూతపడ్డాయి. బంద్ జరుగుతున్న రోజు నుంచి పలుసార్లు డిజిటల్ ప్రొవైడర్లతో చర్చలు నిర్వహించింది దక్షిణాది నిర్మాతల మండలి ఐక్య కార్యాచరణ సమితి. చివరికి బుధవారం ఇరువురి మధ్య చర్చలు సఫలం కావడంతో థియేటర్ల బంద్‌ను విరమించేశారు. వర్చువల్ ప్రింట్ ఫీజ్, కట్ ఆఫ్ టైమ్ తగ్గింపు రేట్లపై ఓ నిర్ణయానికి రావడంతో గురువారం నుంచి సినిమా థియేటర్లు తెరుచుకుంటాయని దక్షిణాది నిర్మాతల మండలి ఐక్య కార్యాచరణ సమితి ఛైర్మన్ డి.సురేష్‌బాబు తెలియజేశారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని థియేటర్లలో గురువారం నుంచి సినిమా ప్రదర్శనలు యధావిధిగా కొనసాగుతాయని ఆయన చెప్పారు. ఈ బంద్ వల్ల చిత్ర పరిశ్రమలోని తామంతా ఒక్కటేనని నిరూపించుకోగలిగామని అన్నారు. ఇక నూతన సాంకేతిక పరిజ్ఞానంతో వచ్చే డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లను తాము ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని ఆయన పేర్కొన్నారు. వారం రోజులుగా థియేటర్లలో సినిమాల ప్రదర్శనలు లేక నిరుత్సాహ పడ్డ సినీ లవర్స్ గురువారం నుంచి థియేటర్లు తెరుచుకుంటాయని తెలియడంతో ఎంతో సంతోషపడిపోతున్నారు.

యుపి నుంచి రాజ్యసభకు జైట్లీ

న్యూఢిల్లీ: రాజ్యసభకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఉత్తర్‌ప్రదేశ్ నుంచి, పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మధ్యప్రదేశ్ నుంచి పోటీ చేయనున్నారని బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ బుధవారం ప్రకటించింది. ప్రస్తుతం జైట్లీ గుజరాత్ నుంచి, ప్రధాన్ బీహార్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల రాజ్యసభ సీట్లకు బిజెపి పార్టీ తన అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఇతర బిజెపి అభ్యర్థులు తమ రాష్ట్రాల నుంచే పోటీ చేయనున్నారు. వారిలో మధ్యప్రదేశ్ నుంచి సామాజికి న్యాయ శాఖ మంత్రి త్వారాచంద్ గెహ్లాట్ , బీహార్ నుంచి న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ , హిమాచల్‌ప్రదేశ్ నుంచి జె.పి.నడ్డా పోటీ చేయనున్నారని బిజెపి పార్టీ తన ప్రకటనలో వెల్లడించింది. మరి ఇద్దరు కేంద్ర మంత్రులు పురుషోత్తం రూపాల, మన్‌సుఖ్ మాండవీయ గుజరాత్ నుంచి పోటీ చేయబోతున్నారు. బిజెపి ప్రధాన కార్యదర్శి భుపేందర్ యాదవ్ రాజస్థాన్ నుంచి పోటీ చేయనున్నారు. ఈ ఏడుగురి నాయకుల పదవీకాలం ఏప్రిల్ 2న ముగియబోతున్నది. అందుకే వారు మళ్లీ ఎన్నిక కావడానికి పోటీపడుతున్నారు.

ఏడాదిన్నరలో ద్వితీయ తృతీయ నగరాలకు విమానాశ్రయాలు

కేంద్ర పౌర విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉషా పద్దే


మన తెలంగాణ / హైదరాబాద్ : వచ్చే 18 నెలల్లో 'ఉడాన్' పథకం ద్వారా దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు నూతనంగా విమాన సర్వీసు సేవలను అందుబాటులోకి తేవాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని కేంద్ర పౌర విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉషా పద్దే అన్నారు. బిజినెస్ ఏయిర్ క్రాఫ్ట్ ఆపరేషన్స్ అసోసియేషన్ (బిఎఓఎ) ఆధ్వర్యంలో 'బిజ్ ఏవి ఇండియా' పేరిట హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 56 ఎయిర్‌పోర్టులు, 31 హెలి పోర్టులను (హెలీప్యాడ్)ల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 4500 కోట్లు వ్యయం చేయాలని భావిస్తోందన్నారు. కొద్ది రోజుల క్రిందటే దాదాపు 60 ప్రాంతాలను ఏయిర్ పోర్టుల ఆవశ్యకత నగరాలుగా కేంద్రం గుర్తించిందన్నారు. చిన్న చిన్న ఏయిర్ క్రాఫ్ట్ సర్వీసులను నడిపించే సంస్థలు ప్రయాణ టికెటింగ్ ఛార్జీలను తక్కువగానే వసూలు చేయనున్నాయన్నారు.

ఏవియేషన్ ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి

'వింగ్స్ ఇండియా' ఏవియేషన్ ప్రదర్శన, సదస్సుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ముఖ్యమంత్రి కెసిఆర్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పి. అశోక గజపతి రాజు నేడు ఉదయం 10.00 లకు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో బేగంపేట విమానాశ్రయంలో భద్ర త, రక్షణ చర్యలను అధికారులు సమీక్షించారు.

కూచిభొట్ల హంతకుడికి 50ఏళ్ల జైలు?

ఆడమ్‌ను దోషిగా తేల్చిన కేన్సస్ కోర్టు



వాషింగ్టన్: అమెరికాలో గతేడాది దారుణహత్యకు గురైన శ్రీనివాస్ కూచిభొట్ల కేసులో నిందితుడు 52ఏళ్ల ఆడమ్ ప్యూరింటన్ దోషి అని నిర్ధారణ అయింది. ఈ కేసులో ఆడమ్‌ను నేరస్థుడిగా తేలుస్తూ కేన్సస్ కోర్టు తీర్పు వెల్లడించింది. అతడికి కనిష్ఠంగా 12ఏళ్ల నుంచి గరిష్ఠంగా 54ఏళ్ల వరకు శిక్ష పడే అవకాశముంది. గతేడాది ఫిబ్రవరిలో కేన్సస్ నగరంలోని ఆస్టిన్ బార్ అండ్ గ్రిల్‌లో ఆడమ్ కాల్పులకు పాల్పడి శ్రీనివాస్ కూచిభొట్లను హత్య చేసిన విషయం తెలిసిందే. కాల్పులు జరపడానికి ముందు 'మా దేశం నుంచి వెళ్లిపోండి' అంటూ ఆడమ్ పెద్దపెద్దగా అరిచాడు. ఈ ఘటనలో భారత్ కు చెందిన మరో యువకుడు అలోక్ మదసాని, అమెరికా పౌరుడు ఇయాన్ గ్రిలియట్ గాయపడ్డారు. ఘటన తర్వాత ఆడమ్‌ను అరెస్టు చేసిన పోలీసులు అతడిపై ఫస్ట్ డిగ్రీ హత్య కేసు, ఫస్ట్ డిగ్రీ హత్యాయత్నం కేసు నమోదు చేశారు. తీర్పుపై దివంగత కూచి భొట్ల సతీమణి సునయన దూమల హర్షం వ్యక్తం చేశారు. 'ఈ తీర్పు నా శ్రీనును తిరిగి తీసుకురాలేదు. కానీ జాతి విద్వేషాన్ని ఎన్నటికీ ఆమోదయోగ్యం కాదని ఈ తీర్పు బలమైన సందేశాన్నిస్తుంది' అని సునయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో ఆడమ్ ప్యూరింటన్‌కు మే 4వ తేదీన శిక్ష ఖరారు చేయనున్నారు.

అనుమతులు లేకుండానే

అద్దె వాహనాలు

- సమగ్ర వివరాలు ఇవ్వాలని మున్సిపల్ శాఖ ఆదేశం
- బాధ్యులపై చర్యలు

మన తెలంగాణ/హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా, ప్రభుత్వ అనుమతులు పొందకుండానే అద్దె వాహనాలను(కారులు) ఉపయోగించిన అధికారులపై చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ శాఖ సిద్ధమైంది. ఇప్పటి వరకు ఇలాంటి వాహనాలకు చెల్లించిన నగదు మొత్తాన్ని కూడా సదరు అధికారుల నుంచి వసూలు చేయాలని నిర్ణయించింది. అలాగే నిబంధనలకు విరుద్ధంగా, సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న అద్దె వాహనాలకు చెక్ పెట్టనుంది. నిబంధనలను పాటించకపోగా, కనీసం ప్రభుత్వ అనుమతి కూడా తీసుకోకుండానే వివిధ ప్రాంతాల్లో అద్దె వాహనాలను తిప్పుతున్నట్లు ము న్సిపల్ శాఖకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా పురపాలికల పరిధిలో ఉన్న అద్దె వాహనాల వివరాలను అందజేయాలని స్థానిక సంస్థల కమిషనర్లను మున్సిపల్ శాఖ ఆదేశించింది. ఏ పురపాలికలలో ఎన్ని వాహనాలు ఉన్నాయి.వాటి అవసరాలు,ప్రభుత్వం నుం చి పొందిన అనుమతులకు సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన నివేదికను వెంటనే అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రధానంగా ప్రైవేటు ట్యాక్స్ నెంబర్ ప్లేట్లు లేకుం డా, ట్రావెల్స్ రూల్స్‌కు విరుద్ధంగా, వాహనాలకు సరైన పత్రాలు కూడా ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే ప్రస్తుతం పురపాలికలలో తిరుగుతున్న వాహనాల సమగ్ర వివరాలను తెప్పించుకున్న తర్వాత వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. కొన్ని పురపాలికలలో అద్దె వాహనాలు అవసరం లేకపోయినా కేవ లం కొందరు అధికారుల వ్యక్తిగత అవసరాల కోస మే అద్దె వాహనాలను తీసుకుని, వాటి ఖర్చును పురపాలికల నుంచి వసూలు చేస్తున్నట్లు మున్సిప ల్ శాఖ కు ఫిర్యాదులు అందాయి.అందుకే అద్దె వాహనాల లెక్కలపై ఉన్నతాధికారులు దృష్టి కేంద్రీకరించారు.

నివేదిక ఆధారంగా చర్యలు స్థానిక సంస్థల నుంచి వివరాలు రాగానే వాటిని పరిశీలించి నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోనున్నారు. వాహనాల అవసరం లేకపోయినా తమ వ్యక్తిగత అవసరాలకు వాహనాలు అద్దెకు తీసుకున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తం గా ఉపయోగిస్తున్న అద్దె వాహనాల సంఖ్య, అందుకు అయ్యే ఖర్చులు, వాటి ఉపయోగాలను కూడా ఉన్నతాధికారులు పరిశీలించనున్నారు.

కర్ణాటక అసెంబ్లీకి ఏప్రిల్ లేదా మే లో ఎన్నికలు : ఇసి

బెంగళూరు: కర్నాటక అసెంబ్లీకి ఏప్రిల్ లేదా మే లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని బుధవారం ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు కేంద్ర ఎన్నికల కమిషనర్ మార్చి మొదటివారం లేదా ఏప్రిల్ మొదటి వారంలో రాష్ట్రాలలో పర్యటించి ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఆ తర్వాత ఎన్నికలు జరిగే తుది తేదీని ప్రకటించనున్నారు. 224 మంది సభ్యులు గల కర్నాటక అసెంబ్లీ పదవీకాలం ఈ ఏడాది మే 28తో ముగియనుంది. స్కూలు బోర్డు పరీక్షలు ముగిసిన తర్వాత ఏప్రిల్ రెండో వారంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో అధికారం చేపట్టడానికి బిజెపి విశ్వ ప్రయత్నం చేస్తోంది. మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడ్యూరప్పను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఇది వరకే ప్రకటించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ తిరిగి ఎన్నికలకు వెళుతోంది. రాష్ట్రంలో మూడో శక్తిగా పేరున్న జెడి (ఎస్), బిఎస్‌పితో కలిసి ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించింది.

గ్రామాల్లో ఊపందుకున్న పనులు

తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం

రూ.2810.90కోట్లతో 2,18,825 పనులు

మన తెలంగాణ/హైదరాబాద్ : పద్నాల్గవ ఆర్థిక సంఘం నిధులతో పాటు ఆయా గ్రామ పంచాయతీలు పన్నుల వసూళ్ళు లాంటి సొంత వనరుల ద్వారా సమకూర్చుకున్న ఆదాయాన్ని కలిపి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో పాతిక రోజుల్లో పూర్తవుతున్న నేపథ్యంలో ఒకేసారి రూ. 2810.90 కోట్లను విడుదల చేసింది. ఇంత పెద్ద మొత్తంలో నిధులు విడుదలైనందున ఇకపై గ్రామాల్లో పనులు ఊపందుకోనున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 8684 గ్రామపంచాయతీ లలో ఈ నిధులతో సుమారు 2.18 లక్షల పనులు కొలిక్కి రానున్నాయి. రానున్నది వేసవికాలం కాబట్టి త్రాగునీటికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా పంచాయతీరాజ్ కమిషనర్ నీతూ ప్రసాద్ అన్ని పంచాయతీల సిఇఓలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినందు వల్ల ఆ పనులకే పంచాయతీల నిర్వాహకులు ఖర్చు చేయనున్నారు. తాగునీటి ట్యాంకుల మరమ్మతులు, కొత్త టాంకుల నిర్మాణం, అంతర్గత పైప్‌లైన్ల మరమ్మతులు వంటి పనులపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరి స్తున్నారు. భూగర్భజలాలు తగ్గిపోవడంతో బోరుబావులు పనిచేయకపోవడం, మామూలు బావులు ఎండిపోవడం, నీటిలభ్యత లేని ప్రాంతాల్లో తాగునీటి సమస్యను తీర్చేందుకు అవసరమైన ప్రత్యామ్నాయ పనులను చేపడుతున్నారు. వీటితో పాటు అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాల ఏర్పాటు, వేసవి వ్యాధులు సోకకుండా పారిశుద్ధ్య పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. పనులు ఎక్కువే అయినా గ్రామస్థాయిలో చిన్నచిన్నవే ఉండడంతో వాటిని ఎక్కువ మందికి కేటాయించి త్వరలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు.

చెప్పినవన్నీ ఇవ్వాల్సిందే

- ప్రత్యేక హోదా సహా ఆర్థిక సాయంపై బిజెపి ఎందుకు వెనక్కి పోతోంది
- అసెంబ్లీలో ఏపి సిఎం చంద్రబాబు



అమరావతి: రాష్ట్రవిభజన సమయంలో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించిన బిజెపి ఇప్పుడెందుకు ఇవ్వడంలేదని టిడిపి అధినేత, ఏపి సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. 14వ ఆర్థిక సంఘం వద్దని చెప్పినందువల్లే ఎవరికీ ప్రత్యేకహోదా ఇవ్వడంలేదని ఇప్పుడు బిజెపి అంటోందని, అలాంటప్పుడు ప్రస్తుతం హోదా కింద ఇప్పుడు ఏయే రాష్ట్రాలకు ఎంత మేర నిధులు, సౌకర్యాలు కల్పిస్తున్నారో అవన్నీ ఆంధ్రప్రదేశ్‌కు తప్పకుండా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన అసెంబ్లీలో రాష్ట్ర విభజన హామీలపై కీలక ప్రసంగం చేశారు.

'రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీపడబోను. రాష్ట్ర ప్రయోజనాల కోసమే టిడిపి, బిజెపి కలిశాయి. పారిశ్రామిక ప్రోత్సాహకాలు మాకు ఇవ్వాలని అడిగాను. ముందుగానే లాలూచీ పడినట్టు మాట్లాడితే మాత్రం సరికాదు. ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ హక్కు అని ప్రజలు భావిస్తున్నారు. రాష్ట్రాన్ని కేంద్రం ఆదుకోవాలని కోరుతున్నారు. అంతా దానికోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. ఆ రోజు ఏవైతే చెప్పారో అవన్నీ ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నా. హోదా అనేది ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కు. దాన్ని గౌరవించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది.

మాపై ఎదురుదాడిచేస్తే ప్రజలు వూరుకోరు : విభజన సమయంలో బిజెపి ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు హోదా ఇస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ప్రకటించింది. పారిశ్రామికంగా ప్రోత్సా హం కల్పించేందుకు పన్ను రాయితీలు.. రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారు. దాన్ని మీకు గుర్తుచేస్తున్నా. మీరు(బిజెపి) దాన్నుంచి తప్పించుకోలేరు. మీరు ఢిల్లీకి వెళ్లి మాట్లాడితే అంతా హర్షిస్తాం. అలాకాకుండా బిజెపి నేతలు మాపై ఎదురుదాడి చేస్తే మాత్రం ప్రజలు వూరుకోరు. నేను 29 సార్లు ఢిల్లీకి వెళ్లాను. అందరినీ కలిశాను. పదేపదే విజ్ఞప్తి చేశా ను. మా మంత్రులను, అధికారులను, ఎంపీలను పంపా ను. ప్రత్యేకహోదా ఇవ్వరు,నిధులు ఇవ్వరంటే చాలామంది ఆందోళన చెందారు. భయభ్రాంతులకు గురయ్యా రు. ఆ సమయంలో ప్రధానికి ఫోన్‌చేసి ఇక్కడి పరిస్థితిని వివరిస్తే.. ఆయన రమ్మన్నారు. ఢిల్లీకి వెళ్లాం. నీతిఆయోగ్‌ను పిలిచి చెబితే అన్నీ వివరించాం. పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తే అనుకున్న సమయానికి పూర్తవుతుందని భావించి రాష్ట్రానికి ఇవ్వాలని నీతి ఆయో గ్ సిఫారసు చేసింది. రాష్ట్రానికి జీవనాడి ప్రాజెక్టు అది. ఇప్పటివరకు పోలవరం కోసం 13,054 కోట్లు ఖర్చుపెట్టాం. కేంద్రం దీనికోసం రూ.5,349.70 కోట్లు ఇచ్చిం ది. మనం ఖర్చుపెట్టిన దాంట్లో ఇంకా రూ.2568 కోట్లు రావాల్సి ఉంది. రూ.4,932 కోట్లకు లెక్కలను పోలవరం అథారిటీ ద్వారా కేంద్రానికి పంపాం. పోలవరం అథారిటీకి ఎప్పటికప్పుడు వివరాలు ఇస్తున్నాం. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనైనా పూర్తి చేసుకోవాలి.

విశాఖకు రైల్వేజోన్ ఇవ్వాల్సిందే : రైల్వేజోన్ ఇస్తామని కేంద్రం స్పష్టంగా చెప్పింది. విభజన తర్వాత ఆర్నెళ్లలోపు ఇస్తామన్నారు. నాలుగేళ్లయినా రైల్వేజోన్ ఎందుకు ఇవ్వడంలేదు? విశాఖలో రైల్వేజోన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకొని అమరావతి రాజధాని నిర్మాణం చేపడుతున్నాం. ఢిల్లీకి మించిన నగరాన్ని నిర్మించేందుకు సహకరిస్తామని ఆనాడు ప్రధాని తిరుపతిలో హామీ ఇచ్చారు. హైదరాబాద్ లాంటి నగరం నిర్మాణానికి రూ.5లక్షల కోట్లు అవుతుందని ముందే చెప్పాం. ఆంధ్రప్రదేశ్‌కు మహానగరం కావాలనుకోవడం తప్పుకాదు. అమరావతి నిర్మాణానికి రూ.1500 కోట్లు ఇచ్చారు. వాటికి లెక్కలు అందజేశాం. కేంద్రం ఉదారంగా ముందుకొచ్చి రాజధాని నగర నిర్మాణానికి నిధులు ఇవ్వాల్సిన బాధ్యత ఉంది.

ఆ రోజు ఒప్పుకుని ఇప్పుడెందుకివ్వడంలేదు?

పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేసినప్పుడు ప్రస్తుత కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు పోరాడి బిల్లులో కొన్ని అంశాలు పెట్టి పాస్ చేయించారు. మరి దాన్ని అమలుచేయడంలో మీరెందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? ఆంధ్రప్రదేశ్ పట్ల ఎందుకింత ఉదాసీనత? అని అడుగుతున్నా. అప్పుడు ఆంధ్ర ప్రజలు పోరాడారు. ఇప్పటికీ పోరాడుతున్నారు. సరికాదని ప్రతిపక్ష పార్టీలన్నీ చెబుతున్నప్పుడు ఎందుకు కనికరించడం లేదు. ఎవరైతే రాష్ట్రానికి అన్యాయం చేశారో.. ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మళ్లీ మేం అధికారంలోకి వస్తే తొలి సంతకం ప్రత్యేకహోదాపైనేనని ప్రకటనలు చేసే పరిస్థితి ఉంటే మీరు ఎందుకు ఇవ్వలేకపోతున్నారో చెప్పాలి. నాలుగేళ్లు నేను ఆవేదనతో, బాధతో ఎంతో ఓపికగా 29సార్లు ఢిల్లీకి వెళ్లి అడిగితే కనీసం కనికరించలేదు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలనే ఎందుకు అమలుచేయడంలేదు. మేం సమాఖ్య స్ఫూర్తికి కట్టుబడి ఉన్నాం.

ఆ లీకులు చూసి బాధేసింది

నిన్న, మొన్న వచ్చిన లీకులు చూసి బాధేసింది. తెలుగు వారి ఆత్మగౌరవం అం టే.. తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి కూడా ఇదే విధమైన డిమాండ్లు వస్తాయని లీకులు ఇస్తున్నారు. తెలుగు వాళ్లను అవమానించకపోతే తెదేపా ఆవిర్భవించేది కాదని సాక్షాత్తూ ప్రధానే పార్లమెంట్‌లో చెప్పారు. లాలూచీ రాజకీయాలు నా జీవితంలో లేవు. ఈ దేశంలో ఉన్న సీనియర్ నాయకుల్లో నేను తొలిస్థానంలో ఉంటా.అది ప్రజలు ఇచ్చి న గౌరవం. తెలుగు జాతికి ఎప్పటికీ రుణపడి ఉంటా.

ఢిల్లీ డేర్‌డెవిల్స్ కెప్టెన్‌గా గౌతం గంభీర్



న్యూఢిల్లీ: ఐపిఎల్ సీజన్‌లో పాల్గొనే ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టుకు గౌతం గంభీర్ సారథ్యం వహిస్తాడు. ఈ విషయాన్ని బుధవారం జట్టు యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. గతంలో కూడా గంభీర్ తరపున ఆడిన విషయం తెలిసిందే. అయితే కొన్నేళ్లుగా గంభీర్ కోల్‌కతా నైట్‌రైడర్స్ తరపున ఆడాడు. కానీ, ఈ సీజన్‌లో గంభీర్ కోల్‌కతా జట్టుకు దూరమయ్యాడు. అతన్ని ఈసారి ఢిల్లీ డేర్ డెవిల్స్ రూ.2.8 కోట్లకు కొనుగోలు చేసింది. సొంత జట్టు ఢిల్లీ తరపున ఆడేందుకు గంభీర్ కోల్‌కతాకు గుడ్‌బై చేశాడు. వేలం పాటలో గంభీర్‌ను సొంత చేసుకోవాలని భావించినా అతను దానికి ఒప్పుకోలేదు. గంభీర్ ఆసక్తిని గమనించిన ఢిల్లీ యాజమాన్యం అతన్ని వేలం పాటలో దక్కించుకుంది. మరోవైపు ఊహించినట్టే గంభీర్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది జరిగే ఐపిఎల్ సీజన్‌లో గంభీర్ ఢిల్లీకి కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. కాగా, బుధవారం జరిగిన ఢిల్లీ జట్టు నూతన జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమంలో జట్టు ప్రతినిధి ఒకరు గంభీర్‌కు కెప్టెన్సీ అప్పగిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన గంభీర్‌కు జ్ఞాపికను అందజేశారు. ఇదిలావుండగా జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇటీవల ఢిల్లీకి ఎంపికైన పలువురు ఆటగాళ్లు పాల్గొన్నారు.

క్రికెటర్ మహ్మద్ షమిపై భార్య సంచలన ఆరోపణలు

- తన భర్తకు చాలా మందితో అక్రమ సంబంధం
- నన్ను చంపేందుకు కుట్ర
- వైరల్‌గా మారిన హసిన్ ఆరోపణలు



న్యూఢిల్లీ: టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమిపై అతని భార్య హసిన్ జహాన్ సంచలన ఆరోపణలు చేసింది. తన భర్త షమికు చాలా మంది అమ్మాయిలతో అక్రమ సంబంధం ఉందని తీవ్ర స్థాయిలో విమర్శలు చేసింది. ఈ ఆరోపణలు దేశ వ్యాప్తంగా సంచలనంగా మారాయి. అయితే షమి మాత్రం ఆరోపణలను కొట్టి పారేశాడు. తానంటే గిట్టని వారు కావాలనే సోషల్ మీడియాలో ఇటు వంటి ఆరోపణలు చేశారని ఆరోపించాడు. కాగా, తన భర్తపై చేసిన ఆరోపణలకు తాను కట్టుబడి ఉన్నానని అతని భార్య హసిన్ స్పష్టం చేశాడు. కాగా, తన భర్త వ్యవహార శైలిని ప్రశ్నించిన తనపై అతని కుటుంబ సభ్యులు దాడికి దిగారని, అంతేగాక తనను చంపేందుకు ప్రయత్నించారని తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ సందర్భంగా హసిన్ జహాన్ మీడియాతో మాట్లాడుతూ రెండేళ్లుగా తన భర్త షమితో పాటు అతని కుటుంబ సభ్యులు తనపై ఎన్నో అరాచకాలు చేస్తున్నారని ఆరోపించింది. తరచు తనను కొట్టడమే కాకుండా వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపింది. అంతేగాక తనను చంపేందుకు కూడా ప్రయత్నిస్తున్నారని సంచలన అరోపణ చేసింది. తన భర్తకు పాకిస్థాన్‌కు చెందిన ఓ అమ్మాయితో పెళ్లి కూడా ఆరోపించింది. దీనికి సంబంధించి సాక్ష్యాలు తన వద్ద ఉన్నాయని వివరించింది. అంతేగాక దక్షిణాఫ్రికాతో సిరీస్ ముగిసిన వెంటనే షమి తన భార్యతో కలిసేందుకు పాకిస్థాన్‌కు కూడా వెళ్లాడని తెలిపింది. కొంతకాలంగా షమితో పాటు అతని తల్లి, సోదరుడు తనపై దౌర్జన్యానికి దిగారని ఆరోపించింది. షమికి వేరే అమ్మాయిలతో అక్రమ సంబంధాలు ఉన్నాయని విషయం అతని ఫోన్ ద్వారా తాను తెలుసుకున్నానని హసిన్ వివరించింది. ఒక రోజు షమి కారులో దొరికిన ఫోన్‌తో అతని గుట్టు రట్టయ్యిందని తెలిపింది. ఆ రోజు అతనికి ఇతర అమ్మాయిలతో సంబంధాలు ఉన్న విషయం తనకు తెలిసిందని పేర్కొంది. దీనిపై షమిని నిలదిస్తే వేధింపులకు దిగాడని ఆరోపించింది. ఈ విషయంలో షమికి అతని కుటుంబ సభ్యులు అండగా నిలిచారని తెలిపింది. కాగా, షమి కుటుంబంతో తనకు ప్రాణ హాని ఉందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరింది. కాగా, షమి వ్యవహార శైలీ గురించి ఎన్ని సార్లు బిసిసిఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోయింది. బిసిసిఐ తగిన విధంగా స్పందించి ఉంటే షమి దారిలోకి వచ్చేవాడని తెలిపింది. కాగా, త్వరలో షమితో పాటు అతని కుటుంబ సభ్యులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హసిన్ స్పష్టం చేసింది. ఇదిలావుండగా మ్యాచ్‌లు ఆడేందుకు ఎక్కడికి వెళ్లినా కుల్దీప్ అనే వ్యక్తి షమికి అమ్మాయిలను సప్లై చేస్తాడని తీవ్రంగా ఆరోపించింది. ఈ విషయం బిసిసిఐ అధికారులకు తెలిసినా పట్టించు కోలేదని ఆవేదన్య వ్యక్తం చేసింది. కాగా, షమి–హసిన్ జహాన్‌లది ప్రేమ వివాహం. 2012లో ఓ ఐపిఎల్ మ్యాచ్ సందర్భంగా షమి తొలిసారి హసిన్ జహాన్‌ను చూశాడు. అప్పటి నుంచి ఇద్దరు డేటింగ్‌లో నిమగ్నమయ్యారు. తర్వాత 2014 జూన్ 6న పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక పాప కూడా ఉంది.

ఆరోపణల్లో నిజం లేదు..



తనపై వచ్చిన ఆరోపణలను మహ్మద్ షమి ఖండించాడు. కావాలనే కొందరు ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించాడు. ఈ మేరకు షమి ట్విటర్ ద్వారా స్పందించాడు. నా వ్యక్తిగత జీవితాన్ని నాశనం చేయాలనే ఉద్దేశంతోనే కొందరు పని గట్టుకొని ఇలాంటి వార్తలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని పేర్కొన్నాడు. ఈ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని పేర్కొన్నాడు. ఇది నాపై జరుగుతున్న కుట్రగా షమి అభివర్ణించాడు. తనంటే పడని వారు ఇలాంటి ఆరోపణలకు దిగారని తెలిపాడు. ఇదిలావుండగా షమిపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అతనికి కేటాయించిన సెంట్రల్ కాంట్రాక్ట్ ఒప్పందాన్ని భారత క్రికెట్ బోర్డు నిలిపి వేసింది. షమికి గ్రేడ్–బిలో స్థానం లభించింది. దీనిలో భాగంగా అతనికి ఏడాదికి మూడు కోట్ల రూపాయల పారితోషికాన్ని అందిస్తారు. కాగా, షమి భార్య ఆరోపణల నేపథ్యంలో పూర్తి స్థాయి విచారణకు బిసిసిఐ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై నివేదిక వచ్చిన తర్వాతే సెంట్రల్ కాంట్రాక్ట్ విషయంపై తగిన చర్యలు తీసుకుంటామని బిసిసిఐ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.



క్రికెటర్లకు కళ్లు చెదిరే ప్యాకేజి

కోహ్లి, రోహిత్‌లకు ఏడు కోట్లు, ధోని, రహానెలకు రూ.ఐదు కోట్లు

ముంబయి: టీమిండియా క్రికెటర్లపై కాసుల పంట పండింది. సెంట్రల్ కాంట్రాక్ట్‌లో భాగంగా టాప్ గ్రేడ్ క్రికెటర్లకు రికార్డు స్థాయిలో ఏడు కోట్ల రూపాయల భారీ ప్యాకేజిని భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ) ప్రకటించింది. మూడు ఫార్మాట్‌లో ఆడే క్రికెటర్లకు ఏ ప్లస్ కేటాగిరిని కేటాయించారు. ఇందులో ఐదుగురు క్రికెటర్లకు చోటు దక్కింది. భారత కెప్టెన్ విరాట్ కోహ్లి, ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, ఫాస్ట్ బౌలర్లు భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రిత్ బుమ్రాలకు ఈ కేటాగిరిలో స్థానం లభించింది. వీరందరికి ఒక్కొక్కరికి ఏడాది ఏడు కోట్ల రూపాయల చొప్పున పారితోషికాన్ని చెల్లిస్తారు. గతంలో ఈ గ్రేడ్‌లో ఉన్న వారికి కేవలం రెండు కోట్ల రూపాయలు మాత్రమే చెల్లించే వారు. ఈసారి వీరికి ఏకంగా ఏడు కోట్ల రూపాయల భారీ మొత్తాన్ని చెల్లించేందుకు బోర్డు ముందుకు వచ్చింది. మరోవైపు ఏ గ్రేడ్ కాంట్రాక్టులో చోటు సంపాదించిన క్రికెటర్లకు ఏడాదికి ఐదు కోట్ల రూపాయల చొప్పున చెల్లిస్తారు. ఈ కేటాగిరిలో ఏడుగురు టీమిండియా క్రికెటర్లకు చోటు లభించింది. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనితో పాటు స్టార్ క్రికెటర్లు చటేశ్వర్ పుజారా, మురళీ విజయ్, అజింక్య రహానె, వృద్ధిమాన్ సాహా, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లు ఈ కేటాగిరిలో ఉన్నారు. కాగా, గ్రేడ్–బిలో భాగంగా కాంట్రాక్ట్ పొందిన ప్రతి క్రికెటర్‌కు రూ.3 కోట్ల చొప్పున చెల్లిస్తారు. మరోవైపు సి–గ్రేడ్‌లో చోటు సంపాదించిన ఆటగాళ్లకు కోటి రూపాయల చొప్పున ప్యాకేజిని ఇవ్వనున్నారు. ఇదిలావుండగా తాజా కాంట్రాక్టు విధానంపై బిసిసిఐ పాలక మండలి అధికారి వినోద్ రాయ్ స్పందించారు. కార్పొరేట్ స్థాయిలో పంపకాలు జరిగే జరిగే విధంగా ప్రణాళిక రూపొందించాం. ఈ మేరకు టీమిండియా కెప్టెన్ కోహ్లి, మాజీ సారథి ధోని, ప్రధాన కోచ్ రవిశాస్త్రిలు కూడా కాంట్రాక్టు విషయంపై మాతో చర్చించారు. అందరి సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత ఈ నిర్ణయాన్ని ప్రకటించామని రాయ్ వివరించారు.

భారత్‌కు పరీక్ష!

నేడు బంగ్లాతో కీలక పోరు, ముక్కోణపు టోర్నీ



కొలంబో: తొలి మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో చిత్తుగా ఓడిన భారత్‌కు గురువారం బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్ కీలకంగా మారింది. మూడు దేశాల ముక్కోణపు ట్వంటీ–20 టోర్నమెంట్‌లో భాగంగా ఈ మ్యాచ్ జరుగనుంది. మొదటి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంక దెబ్బకు భారత్ కుదేలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్ భారత్‌కు పరీక్షగా తయారైంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మెరుగ్గా రాణిస్తేనే భారత్‌కు గెలుపు అవకాశాలు అధికంగా ఉంటాయి. సీనియర్లు విరాట్ కోహ్లి, మహేంద్ర సింగ్ ధోని, భువనేశ్వర్, బుమ్రా, హార్దిక్ తదితరులు లేకుండా భారత్ టోర్నీలో ఆడుతోంది. దీంతో తొలి మ్యాచ్‌లో లంక చేతిలో ఓటమి తప్పలేదు. బ్యాటింగ్‌లో ఒక్క శిఖర్ ధావన్ తప్ప మిగతావారు విఫలమయ్యారు. బౌలర్లు కూడా విఫలమయ్యారు. దీంతో ఓటమి తప్పలేదు. అయితే బంగ్లాదేశ్ జరిగే మ్యాచ్‌లో టీమిండియా విజయమే లక్ష్యంగా పెట్టుకొంది. ఈ మ్యాచ్‌లో గెలిచి విమర్శకులకు గట్టి సమాధానం చెప్పాలని తహతహలాడుతోంది.

రోహిత్ ఈసారైనా...

కొంతకాలంగా ఘోరంగా విఫలమవుతున్న రోహిత్ శర్మ కీలకమైన ఈ మ్యాచ్‌లోనైనా బ్యాట్‌ను ఝులిపించాల్సిన అవసరం ఉంది. అతని వైఫల్యం జట్టుకు తీవ్రంగా పరిణమించింది. లంకతో జరిగిన మొదటి మ్యాచ్‌లో ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. అంతకుముందు దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో మూడు ఫార్మాట్‌లలోనూ విఫలమయ్యాడు. తాజాగా నిదహాస్ టోర్నీలో కూడా ఆడిన మొదటి మ్యాచ్‌లో డకౌటయ్యాడు. కోహ్లి, ధోని వంటి సీనియర్లు లేకుండా బరిలోకి దిగిన భారత్‌కు రోహిత్ కీలకంగా మారాడు. ఈ మ్యాచ్‌లోనైనా అతను మెరుగ్గా రాణించక తప్పదు. ఇక, తొలి మ్యాచ్‌లో విఫలమైన సీనియర్ బ్యాట్స్‌మన్ సురేశ్ రైనాకు కూడా మ్యాచ్ కీలకంగా మారింది. జట్టును ముందుండి నడిపిస్తాడని భావించిన రైనా లంకపై విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లో తన బ్యాట్‌కు పనిచెప్పాల్సిన బాధ్యత అతనిపై ఉంది.



ధావన్‌పైనే ఆశలు...

ఇక, జట్టు ఆశలన్నీ మరో సీనియర్ ఆటగాడు శిఖర్ ధావన్‌పై పెట్టుకుంది. తొలి మ్యాచ్‌లో 90 పరుగులు చేసి సత్తా చాటిన ధావన్ ఈసారి కూడా జట్టుకు కీలకంగా మారాడు. ఇటీవల కాలంలో ధావన్ అద్భుత ఫాంలో ఉన్న విషయం తెలిసిందే. దీంతో బంగ్లాతో జరిగే మ్యాచ్‌లో కూడా జట్టు ఆశలన్నీ అతనిపైనే నిలిచాయి. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడి బంగ్లాపై ఎదురు దాడి చేయాల్సిన బాధ్యత ధావన్‌పై ఉంది. రోహిత్ కూడా అతనికి జత కలిస్తే ఈ మ్యాచ్‌లో భారీ స్కోరు సాధించడం భారత్‌కు కష్టమేమి కాదు.

యువకులకు ఇదే మంచి ఛాన్స్...

తొలి మ్యాచ్‌లో అందివచ్చిన అవకాశాన్ని యువ క్రికెటర్లు ఆశించిన విధంగా సదినియోగం చేసుకోలేదని చెప్పాలి. ముఖ్యంగా మనీష్ పాండే, రిషబ్ పంత్‌లు వేగంగా ఆడలేక పోయారు. భవిష్యత్తు కీపర్‌గా పరిగణిస్తున్న రిషబ్ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేక పోతున్నాడు. ఇప్పటికే దక్షిణాఫ్రికా సిరీస్‌లో శ్రేయస్ అయ్యర్ ఛాన్స్ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఈసారి పంత్‌తో పాటు విజయ్ శంకర్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ తదితరులకు టీమిండియాలో ఛాన్స్ కల్పించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత వీరిపై ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగంలో యువ ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో రాణించలేక పోయారు. ఠాకూర్, ఉనద్కట్, చాహల్, సుందర్‌లు పొదుపుగా బౌలింగ్ చేయడంలో విఫలమయ్యారు. అంతేగాక మనీష్, పంత్‌లు వేగంగా ఆడలేక పోయారు. ఈమ్యాచ్‌లో యువ ఆటగాళ్లలందరూ మంచి ఆటను కనబరచాల్సిన అవసరం ఉంది. లేకుంటే వీరిపై బోర్డు పెట్టుకున్న ఆశలు నీరుకారడం ఖాయం.

తేలిగ్గా తీసుకోలేం...

మరోవైపు బంగ్లాదేశ్‌ను తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. ఒంటి చేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు జట్టులో కొదవలేదు. కెప్టెన్ సాకిబ్ అల్ హసన్ లేకుండానే బంగ్లా పోరుకు సిద్ధమైంది. సాకిబ్ లేకున్నా బంగ్లాను తక్కువ అంచనా వేయలేం. జట్టులో ప్రతిభావంతులైన క్రికెటర్లకు కొదవ లేదు. తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, ముష్ఫికుర్ రహీం, ఇమ్రుల్ కైస్, షబ్బీర్ రహెమాన్, మహ్మదుల్లా వంటి మ్యాచ్ విన్నర్లు జట్టులో ఉన్నారు. అంతేగాక టి–20 స్పెసలిస్ట్‌గా పేరు తెచ్చుకున్న ముస్తఫిజుర్ ఉండనే ఉన్నాడు. ఎటువంటి బ్యాటింగ్ లైనప్‌నైనా చిన్నాభిన్నం చేసే సత్తా అతనికి ఉంది. రుబేల్ హుస్సేన్, నూరుల్ హసన్, తస్కిన్ అహ్మద్, లిటన్ దాస్ తదితరులతో కూడిన బంగ్లాదేశ్‌తో భారత్‌కు గట్టి పోటీ ఎదురు కావడం ఖాయం. కాగా, ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన భారత్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. దీంతో పొరపాట్లకు తావులేకుండా ఆడాల్సిన బాధ్యత టీమిండియాపై ఉంది.



జట్ల వివరాలు:

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్ (వైస్ కెప్టెన్), లోకేష్ రాహుల్, సురేశ్ రైనా, మనీష్ పాండే, దినేష్ కార్తీక్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కట్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్.

బంగ్లాదేశ్: మహ్మదుల్లా, తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, ముష్ఫికుర్ రహీం, షబ్బీర్ రహెమాన్, ముస్తఫిజుర్ రహెమాన్, రుబేల్ హుస్సేన్, అబు జయ్యద్, తస్కిన్ అహ్మద్, ఇమ్రూల్ కైస్, నూరుల్ హసన్, మెహది హసన్, ఆరిఫుల్ హక్, నజ్ముల్ హక్, అబు హైదర్ రోని, లిటన్ దాస్.

రాత్రి 7 గంటల నుంచి డిడి స్పోర్ట్స్, డిడి నేషనల్‌లలో ప్రత్యక్షప్రసారం

కదం తొక్కిన టేలర్

- రూట్, బెయిర్ స్టో శతకాలు వృథా
- ఇంగ్లాండ్‌పై కివీస్ రికార్డు విజయం



డూనెడిన్: ఇంగ్లాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో రికార్డు విజయాన్ని సాధించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–2తో సమం చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 9 వికెట్ల నష్టానికి 335 పరుగులు చేసింది. తర్వాత క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ మరో మూడు బంతులు మిగిలివుండగానే ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. రాస్ టైలర్ 181(నాటౌట్) చిరస్మరణీయ సెంచరీతో కదం తొక్కడంతో కివీస్ సంచలన విజయం సాధించింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కివీస్‌కు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్లు కొలిన్ మున్రో (0), మార్టిన్ గుప్టిల్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను కెప్టెన్ కానె విలియమ్సన్, సీనియర్ ఆటగాడు టైలర్ తమపై తీసుకున్నారు. ఇద్దరు ఇంగ్లాండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. టైలర్ దూకుడుగా ఆడగా విలియమ్సన్ సమన్వయంతో బ్యాటింగ్ చేశాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన విలియమ్సన్ (45)ను స్టోక్స్ వెనక్కి పంపాడు. దీంతో 84 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. మరోవైపు తర్వాత వచ్చిన వికెట్ కీపర్ లాథమ్‌తో కలిసి టైలర్ మరో కీలక పార్ట్‌నర్‌షిప్ నెలకొల్పాడు. ఇద్దరు ఇంగ్లాండ్ బౌలర్లను హడలెత్తిస్తూ జట్టును లక్ష్యం దిశగా నడిపించారు. లాథమ్ దూకుడుగా ఆడుతూ స్కోరును పరిగెత్తించాడు. రాస్ కూడా తన మార్క్ షాట్లతో చెలరేగిపోయాడు. ఈ క్రమంలో నాలుగో వికెట్‌కు 187 పరుగులు జోడించి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన టామ్ లాథమ్ మూడు సిక్స్‌లు, మరో రెండు బౌండరీలతో 71 పరుగులు చేశాడు. మరోవైపు చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన టైలర్ 147 బంతుల్లో ఆరు సిక్సర్లు, మరో 17 ఫోర్లతో 181 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. గ్రాండోమ్ (23), నికోలస్ 12 (నాటౌట్) తమవంతు పాత్ర పోషించారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్‌ను బైర్‌స్టో, జోయ్ రూట్ శతకాలతో ఆదుకున్నారు. చెలరేగి ఆడిన ఓపెనర్ బైర్‌స్టో ఏడు ఫోర్లు, 14 ఫోర్లతో 138 పరుగులు చేశాడు. మరోవైపు సమన్వయంతో ఆడిన రూట్ ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 102 పరుగులు సాధించాడు. దీంతో ఇంగ్లాండ్ స్కోరు 335కి చేరింది.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.